Postel No. MBN/08/2016-2018




పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు, చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల నొప్పులకు వనమూలికలతో వైద్యంచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము
నారాయణపేట రోడు, ఊట్కూర్ మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :24 | సంచిక :237 | సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | శుక్రవారం 19 డిసెంబర్ 2025 | పేజీలు :12 | వెల రూ5 /-




## మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ

**అదిలాబాద్, డిసెంబర్ 18 :**కేంద్రం ఆపరేషన్ కగార్ నిర్వహిస్తున్న క్రమంలో గత కొద్ది రోజులుగా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దుల్లో పెద్ద మొత్తంలో మావోయిస్టులు లొంగుబాటులకు సిద్ధమవుతున్నారు. పలుచోట్ల ఎన్కౌంటర్లు జరగ్గా, ఇటీవల ఓ పక్కా మావోల లేఖ కలకలం రేపింది. ఈ తరుణంలోనే తాజాగా తెలంగాణలోని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 16మంది మావోయిస్టులను అరెస్టు చేసినట్టు తెలుస్తోంది. అయితే సోమవారం రాత్రి పూట సమాచారం తెలుసుకొని ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ ఆధ్వర్యంలో వారిని హైదరాబాద్ డిజిపి - మిగతా3లో

## పరిషత్ ఎన్నికల్లో... 42 శాతం రిజర్వేషన్

**హైదరాబాద్, డిసెంబర్ 18:**తెలంగాణలో పంచాయతీ ఎన్నికల పోరు ముగిసింది. మూడు విడతల్లో ఎన్నికల ప్రక్రియ జరిగింది. చివరి విడత పోలింగ్ బుధవారం పూర్తయింది. అయితే, పంచాయతీ పోరులో అధికార కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది. మూడు విడతల్లోనూ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులుగా పోటీ చేసిన సర్పంచ్‌లు అత్యధిక స్థానాల్లో విజయం సాధించారు. అయితే, ఇదే ఊపులో జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికలనుసైతం నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తికావడంతో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. మండల పరిషత్ (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ (జడ్పీటీసీ) ఎన్నికలను వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వ భావిస్తుంది. ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ప్రభుత్వానికి చెప్పిందని సమాచారం. దీంతో ఈ నెలాఖరులో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని సమాచారం.



మరోవైపు.. తొలుత మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తుందట. అన్నీ అనుకూలిస్తే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కంటే ముందే - మిగతా3లో

## మన పార్టీ కాకున్నా పనులు చేస్తా....



**మంత్రి తుమ్మల**

**ఖమ్మం:**ఖమ్మం పట్టణంలో 14వ డివిజన్ లో 2 కోట్ల 25 లక్షల నిధులతో సీసీ రోడ్ల కి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు. తుమ్మల మాట్లాడుతూ ముఖ్యమంత్రి మన జిల్లాకి - మిగతా3లో

## తెలంగాణ విద్యుత్ రంగంపై.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 18:** తెలంగాణ విద్యుత్ రంగం ఆర్థికంగా సంక్షోభంలో ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. గత, ప్రస్తుత ప్రభుత్వాల అప్పులు తడిసి మోపెడయ్యాయని వ్యాఖ్యలు చేశారు. తెలంగాణకు విద్యుత్ ఉత్పత్తి విషయంలో అన్ని రకాలుగా సహకరించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. తెలంగాణలోని విద్యుత్ ఉత్పత్తి సంస్థలు, పంపిణీ సంస్థల.. అప్పుల బాటలో, నష్టాల ఊబిలో - మిగతా3లో

## పంచాయితీ విన్నర్ కాంగ్రెస్..



**హైదరాబాద్, డిసెంబర్ 18:**తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజేతగా నిలిచింది. 12వేలకుపైగా పంచాయతీల్లో సర్పంచ్ పదవులు, వార్డు సభ్యుల పదవుల కోసం ఎన్నికలు జరిగాయి. అనేక సవాళ్ల మధ్య కాంగ్రెస్ పార్టీ భారీ విజయాలు సాధించింది. 55 శాతం వరకూ పంచాయతీల్లో అంటే దాదాపుగా 7వేలకుపైగా పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు విజయం సాధించారు. మరో ఆరేడు వందల పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ రెబల్స్ గెలిచారు. వారంతా కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంక్ అనుకోవచ్చు. బీఆర్ఎస్ పార్టీ..కాంగ్రెస్ సాధించిన పంచాయతీల్లో సగం సాధించింది. బీజేపీ మరీ తీసికట్టుగా ఏమీ లేదు. పర్వాలేదనుకునే స్థాయిలోనే పంచాయతీలను సాధించింది. అంతిమంగా కాంగ్రెస్ పార్టీ విన్నర్‌గా నిలిచింది.జూబ్లిహిల్స్ ఉపఎన్నికల్లో వచ్చిన విజయంతో ధైర్యం తెచ్చుకున్న కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికలను వెంటనే నిర్వహించేసింది. బీసీ రిజర్వేషన్ల అంశం పెద్దగా ఎన్నికల్లో టాపిక్ కాకుండా ఎన్నికలు జరిపించేసింది. నిజానికి స్థానిక ఎన్నికలు బీసీ రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతనే నిర్వహిస్తామని గతంలో వాగ్దానాలు చేశారు. అలాంటి అవకాశం లేదని తేలడంతో కోర్టుకు ఇచ్చిన మాట ప్రకారం పంచాయతీ ఎన్నికలు నిర్వహించారు. భారీగా అధికార వ్యతిరేకత ఉందని జరిగిన ప్రచారం మాత్రమే కాదు.. యూరియా సమస్య సహా చాలా అంశాలు కాంగ్రెస్ కు ఇబ్బందికరంగా మారాయి. పొరపాటున గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఎక్కువ పంచాయతీలు సాధిస్తే అది భవిష్యత్ లో చాలా ఇబ్బందికరం - మిగతా3లో

## కేటీఆర్‌కు కవితపై ప్రేమ ఎంత... ఉందా..?లేదా..?



**హైదరాబాద్, డిసెంబర్ 18:**భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియా కవితను టార్గెట్ చేసుకుని తమ పార్టీకి ఎంత నష్టం చేయాలో అంత నష్టం చేస్తోంది. కొత్తగా కేటీఆర్ కు కవితపై ప్రేమ ఉందా లేదా అన్న డిబేట్ ను ప్రారభించింది. అంత అవసరం ఏముందో కానీ.. జాగృతి సోషల్ మీడియా గట్టిగానే - మిగతా3లో

## కమలంలో లీకు వీరులు ఎవరు..?

**హైదరాబాద్, డిసెంబర్ 18:**"మోదీతో విందులో జరిగిన చర్చల్ని బయటపెట్టిన వారెవరు?. మోదీ బయటకు చెప్పవద్దనిచెప్పారు?. బయటకు చెప్పిన వారిపై చర్యలు తీసుకుంటాం"..అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మీడియా చిట్ చాట్ లో ఆవేశపడ్డారు. ఆయన అలా అన్నారు కానీ ఆ సమావేశంలో మోదీ ఏం చెప్పారో ఆయన కూడా ఈ మీడియా చిట్ చాట్ లో చెప్పారు. ఒడిషాలో బలమైన నేతలు లేరు కానీ పార్టీ అధికారంలోకి వచ్చింది. తెలంగాణలో అలా కలసి కట్టుగా ప్రయత్నించాలని చెప్పారు. కానీ తెలంగాణ నేతలు ఏం చేస్తున్నారు?. చివరికి మోదీతో సమావేశం వివరాలు లీక్ అయ్యాయని అంతర్గత రాజకీయాలు



చేసుకుంటున్నారు. తెలంగాణలో అలా కలసి కట్టుగా ప్రయత్నించాలని చెప్పారు. కానీ తెలంగాణ నేతలు ఏం చేస్తున్నారు?. చివరికి మోదీతో సమావేశం వివరాలు లీక్ అయ్యాయని అంతర్గత రాజకీయాలు చేసుకుంటున్నారు.తెలంగాణ బీజేపీ రాను రాను కుంచించుకుపోతోంది. దానికి పంచాయతీ ఎన్నికల ఫలితాలే నిదర్శనంగా కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ తో లోపాయికారీ ఒప్పందాలు చేసుకున్న చోట ఆ పార్టీకి మంచి ఫలితాలు వస్తున్నాయి. కానీ తమ పార్టీ ప్రజా ప్రతినిధులు ఉన్న చోట కూడా భారీ విజయాలు దక్కించుకోలేకపోతోంది. ఎనిమిది మంది ఎంపీలు - మిగతా3లో

## స్పీకర్ సరే... ప్రజాకోర్టు ఉందిగా...

**హైదరాబాద్, డిసెంబర్ 18:**పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు ఒత్తిడితో స్పీకర్ ప్రసాద్ కుమార్ నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం పడింది. సుప్రీం నిర్ణయించిన గడువు డిసెంబర్ 18 ముంచుకొచ్చిన తరుణంలో ఐదుగురిపై పిటిషన్లు తిరస్కరించారు. మిగిలిన ఐదుగురిలో నలుగురివి కూడా తిరస్కరిస్తారు. ఒక్క దానం నాగేందర్ విషయాన్ని మాత్రం పెండింగ్ పెడతారు. ఆయన పార్టీ మారలేదని చెప్పి తప్పించుకునే అవకాశం లేదు. ఆయన సంగతి పక్కన పెడితే మిగతా 9 మంది ఎమ్మెల్యేలు



సేఫ్ అయినట్లేనా అంటే.. చెప్పడం కష్టమే. దానికి కారణం కోల్ కతా హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు.నవంబర్‌లో కోల్ కతా హైకోర్టు బీజేపీ టికెట్‌పై ఎమ్మెల్యేగా గెలిచి తృణమూల్‌లో చేరిన ముకుల్ రాయ్ పై అనర్హతా వేటు వేసింది. మొదట స్పీకర్ వద్ద బీజేపీ అనర్హతా పిటిషన్ వేసింది. రెండేళ్ల పాటు విచారణ చేసిన స్పీకర్ .. పిటిషన్ ను తోసి పుచ్చారు. దీనిపై బీజేపీ హైకోర్టును ఆశ్రయించింది. విచారణ జరిపిన హైకోర్టు స్పీకర్ ఇచ్చిన నిర్ణయాన్ని కూడా రద్దు చేసి.. ముకుల్ రాయ్ పై - మిగతా3లో

## ఐ బొమ్మ రవిని కస్టడీలోకి తీసుకున్న పోలీసులు

**హైదరాబాద్:**సినిమా పైరసీ కేసులో అరెస్టయిన ఐ బొమ్మ రవిని పోలీసులు మరో కేసులో కస్టడీలో తీసుకున్నారు. మూడోసారి కస్టడీలోకి తీసుకుని సైబర్ క్రైమ్ పోలీసులు విచారిస్తున్నారు. కేసుల్లో 12 రోజుల పాటు కస్టడీకి నాంపల్లి కోర్టు అనుమతించింది. ఒక్కో కేసులో 4రోజులు కస్టడీకి




ఇచ్చింది. సైబర్ క్రైమ్ పోలీసులు, రవిని ఇప్పటికే 8రోజులపాటు రెండు సార్లు కస్టడీలో తీసుకుని విచారించారు. రవి పై మొత్తం ఐదు కేసులు నమోదు చేసారు. పైరసీ లింకులు, బెట్టింగ్ యాప్స్ నుంచి పొందిన డబ్బులు, ఆర్థిక లావాదేవీలపై ప్రశ్నించారు.

# సంపాదకీయం


## గిగ్ వర్కర్లకు పని భద్రత కరవు!

అభివృద్ధి ముసుగులో 'గిగ్' వర్కర్ల పేరుతో కొత్త సేవలు విస్తరిస్తున్నాయి. వినిమయదారులు ఉన్న చోటికే వాహనాలు ఆన్‌లైన్ బుకింగ్‌తో వస్తున్నాయి. వినియోగదారులకు ఇది సౌకర్యవంతంగా ఉన్నది. మరి డ్రైవర్ల పరిస్థితేమిటి? కస్టమర్లతో వీరు వ్యక్తిగతంగా పని కుదుర్చుకొని పూర్తి చేస్తారు. దానికి పరిహారం వినియోగదారుల నుంచి పొందుతారు. ప్రత్యేకంగా 'యాజమాన్యం- కార్మికులు' అన్న సంబంధం ఉండదు. చేసిన కాలానికి కాకుండా, పూర్తి చేసిన పనికి పరిహారం పొందుతారు. సంప్రదాయంగా ఉండే పనిస్థలం ఉండదు. ఇది సమిష్టి, సామూహిక కృషి కాదు. ఉబెర్, ఓలా, పోర్టర్ తదితర ప్లాట్‌ఫారాలకు అనుసంధానంగా పనిచేసే వారితోపాటు, అనుసంధానం కాని ఇతర కార్మికులు కూడా, ఈ పద్ధతిలో పనిచేసే వారంతా 'గిగ్' వర్కర్స్ అంటున్నారు. కానీ క్రమంగా, ప్లాట్‌ఫారంతో అనుసంధానం కాకుండా ఉండే 'గిగ్' వర్కర్స్ నిలదొక్కు కోవడం సాధ్యం కాదు. ఏదో ఒక యాప్ ప్రాతిపదికన పనిచేసే ప్లాట్‌ఫారంతో అనుసంధానం కావల్సిందే. పూర్తిగా ఇదే జీవనాధారంగా పనిచేసే వారితో పాటు, పార్ట్‌టైమ్ ఆదాయం కోసం చేసే వారి సంఖ్య కూడా పెరుగుతున్నది. ఇప్పుడిప్పుడే ఈ రంగంలో యువతులు కూడా ప్రవేశిస్తున్నారు. తెలంగాణలో 8 నుంచి 10 లక్షల మంది గిగ్ వర్కర్స్ ఉంటారు. అత్యధికులు హైదరాబాద్, పరిసర ప్రాంతాలలో పనిచేస్తున్నారు. వీరి పని స్వభావం స్థూలంగా అత్యంత అస్థిరమైన, అనిశ్చితమైంది. వీరికి కార్మిక చట్టాలేవీ వర్తించవు. లేబర్ కోడ్స్ కూడా వీరి సమస్యలకు పరిష్కారం చూపలేదు. యాప్ ప్రాతిపదికన వీరితో పని చేయిస్తున్న ప్లాట్‌ఫారాల యాజమాన్యాల మీద కూడా చట్టపరమైన పర్యవేక్షణ లేదు. వీరికి కూడా ఏ చట్టమూ వర్తించదు. కార్మికులకూ, వినియోగదారులకు మధ్య తాము మధ్యవర్తులంగానే సేవలందిస్తున్నామనీ, ఈ కార్మికులతో తమకేం సంబంధం లేదనీ ఇప్పటికే ప్రకటించారు. కార్మికుల గురించి ఎలాంటి బాధ్యత తీసుకోవడానికి సిద్ధంగా లేరు. పైగా తాము సామాజిక సేవలందిస్తున్నామంటున్నారు. వీరికి ఆదాయమే తప్ప బాధ్యతలు లేవు. ఏ సంబంధమూ లేదంటూనే, ఆన్‌లైన్‌లో కార్మికులను నియంత్రిస్తున్నారు. యాజమాన్యం నుంచి ఏక పక్ష నియంత్రణే తప్ప, కార్మికులు సంప్రదించేందుకు, ఫిర్యాదు చేసేందుకు అవకాశం లేదు. కార్మికులుగా వీరికి గుర్తింపు లేదు. పని భద్రత లేదు. సెలవులు, వైద్యం, ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్ లాంటి సామాజిక భద్రతలేవీ వర్తించవు. పరిమిత ఆదాయం, అది కూడా స్థిరంగా ఉండదు. భౌతిక సమస్యలు, ఆరోగ్య సమస్యలు, మానసిక ఒత్తిడులు పెరుగుతున్నాయి. గిగ్ ఆర్థిక వ్యవస్థ గొప్ప ముందడుగుగా ప్రచారం జరుగుతున్నది. యువతకు కొత్త అవకాశాలు అందిస్తున్నదని చెబుతున్నారు. ఈ పనికి ముద్దుపేర్లు పెట్టి మభ్యపెడుతున్నారు. కార్మికులు అని కాకుండా భాగస్వాములు (పార్ట్‌నర్స్) అని అంటున్నారు. నిజానికి బానిసలని చెప్పవచ్చు. వీరిని స్వతంత్ర కాంట్రాక్టర్లుగా చెప్పేందుకు ప్రయత్నిస్తున్నారు. కానీ వీరు స్వతంత్రులుగా కనిపిస్తున్నప్పటికీ, స్వతంత్ర కార్మికులుగా కూడా లేరనేది స్పష్టం. ప్లాట్‌ఫారాల యాజమాన్యాల చుట్టూ, దిక్కులేని పక్షుల్లా తిరగవల్సి వస్తున్నది. మరో ప్రత్యామ్నాయం లేకనే ఈ పనిలో ఉండవల్సి వస్తున్నది.ఈ పని ఎప్పుడైనా ఉపయోగించుకోగలిగే విధంగా, కార్మికులకు అనువైనదిగా చెబుతున్నారు. కార్మికుల మీద ఎవరి నియంత్రణ, ఆధిపత్యం లేని స్వయం ప్రతిపత్తి ఉంటుందన్నారు. తమ పని మీద తమకే అధికారం, పట్టు ఉంటుందని ప్రచారం జరుగుతున్నది. వెంటవెంటనే చెల్లింపులు జరుగుతాయనీ, ఎక్కువ సమయం పని చేసి ఎంతైనా సంపాదించుకోవచ్చంటున్నారు. పనిలో చేరడానికి ఎలాంటి అవరోధాలు లేవు. ఒక సెల్‌ఫోన్, వాహనం, కనీసస్థాయిలో చదువుంటే చాలు అంటున్నారు. ఉపాధి సమస్యలు, నిరుద్యోగ సమస్య నుంచి ప్రజల దృష్టి మరలించడానికే ఈ వాదనలు. పెట్టుబడిదారీ వ్యవస్థ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకోసమే ఈ ప్రచారాలు. గిగ్ వర్కర్స్ అభద్రతా భావంతో సతమతమవుతున్నారు. అయినప్పటికీ వేగంగా విస్తరించడానికి రెండు కారణాలు. గిగ్ వర్కర్స్ అందించే సేవలు ప్రజలకు బాగా ఉపయోగపడుతున్నాయి. చవక గానూ, అందుబాటులో ఉంటున్నాయి. అందువల్ల వినియోగదారులు వీరి సేవలకు ఆకర్శితులవుతున్నారు. వినియోగదారులకది సౌకర్యవంతమైనదే! కానీ 'గిగ్' వర్కర్ల పాలిట శాపంగా తయారైంది. పెరుగుతున్న డిమాండ్‌ను ఉపయోగించుకొని, ప్లాట్‌ఫారాల యాజమాన్యాలు, యువత శ్రమను పిండుకుంటున్నారు. రోడ్డు ప్రమాదాలు, బెదిరింపులు జరిగినప్పుడు వీరికి భద్రత లేదు. వినియోగదారులు డబ్బు చెల్లించకపోతే యాజమాన్యానికి బాధ్యత లేదు. పోలీసులు చలానా వేస్తే డ్రైవర్ భరించవల్సి వస్తున్నది. బుక్ చేసి మధ్యలో క్యాన్సిల్ చేస్తే మినిమమ్ ఫేర్ లేదు. వెయిటింగ్ చార్జీ లేదు. రోడ్ బ్లాక్ అయినా, ట్రాఫిక్ సమస్య ఏర్పడినా రేటు మారదు. పైపులు, కంకర, ఇసుక, పశువుల రవాణాకు వేర్వేరు వాహనాలు ఉపయోగించాలి. వాహనంలో అదనపు లోడ్, అదనపు ఎత్తు లేదా పొడవు సరుకు లోడ్ చేయ టం చట్ట విరుద్ధం. అంగీకరించకపోతే డ్రైవర్లదే బాధ్యతగా క్యాన్సల్ చేస్తున్నారు. అంగీకరిస్తే పోలీసులు వేధిస్తున్నారు. ఒకే బండి, ఒకే కిరాయితో ముగ్గురు, నలుగురు కస్టమర్ల నుంచి సరుకు పిక్అప్ బుక్ చేస్తున్నారు. లోడింగ్, అన్‌లోడింగ్ పనులు కూడా డ్రైవర్లే చేయాలని వత్తిడి చేస్తున్నారు. ప్లాట్‌ఫారం యాజమాన్యం కస్టమర్లకు వెయింటింగ్ టైమ్ సౌకర్యం ఇస్తారు. ఆ భారం డ్రైవర్ల మీద పడుతున్నది. పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్స్‌లో 20 నుంచి 30 నిమిషాలు వృధా అవుతున్నది. ఎయిర్‌పోర్టుకు పోయేటపుడు చెల్లించే రేటు, తిరుగు ప్రయాణంలో ఇవ్వటం లేదు. గిగ్ వర్కర్స్‌కు టాయిలెట్స్, మంచినీరు, పార్కింగ్ స్థలం, నిలువ నీడ వంటి సమస్యలున్నాయి. వారంలో కనీసం 75 గంటలు పనిచేసి, అరవై శాతం పనితనం ప్రదర్శించిన వారికి మాత్రమే ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నారు. కానీ ఇందుకు అనేక ఆంక్షలు. ఉదయం పదిగంటల నుంచి సాయంత్రం ఆరు గంటల మధ్య లాగిన్ అయ్యింది మాత్రమే లెక్కలోకి తీసుకుంటారు. మిగిలిన సమయంలో తీసుకున్న బుకింగ్స్, లాగిన్ సమయం పరిగణలోకి తీసుకోరు. రోడ్డు ప్రమాదం జరిగితే, ఆ వారంలో 72 గంటలు లాగిన్ అయి ఉంటేనే వర్తిస్తుంది.కొన్ని యాజమాన్యాలు తమకూ, డ్రైవర్లకు మధ్య వెండార్స్ పేరుతో కొందరితో ఒప్పందం చేసుకుంటున్నారు. దగ్గరి బుకింగ్స్ అన్నీ వెండార్స్ పోతాయి. డ్రైవర్లను వెండార్స్ వైపు నెట్టుతున్నారు. కస్టమర్లు డ్రైవర్లకు నగదు చెల్లించినప్పటికీ, వీరు యాజమాన్యానికి ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి. జమ చేయాల్సిన మొత్తం రూ.2 వేలు దాటితే బుకింగ్స్ ఆగిపోతాయి. చెల్లించిన తర్వాతనే మొదలవుతాయి. సాధారణంగా రేట్లు పెరుగుతూ ఉండాలి. డ్రైవర్ల ఆదాయం పెరుగుతూ ఉండాలి. కానీ గత సంవత్సరంతో పోల్చితే సగానికి పడిపోయింది. యాజమాన్యాల వేధింపులకు అడ్డు, అదుపూ లేదు. బుకింగ్స్ ఒప్పుకోలేదనే పేరుతో యాప్ ప్లాట్‌ఫారం నుంచి సస్పెండ్ లేదా డిస్మిస్ చేస్తారు. ఎక్కువ బుకింగ్స్ క్యాన్సిల్ అయినా ఐడీ బ్లాక్ చేస్తున్నారు. ఒకసారి సస్పెండ్ అయిన డ్రైవర్ మళ్లీ ప్లాట్‌ఫారంతో అనుసంధానం కావాలంటే పోలీసుల దగ్గర నుంచి లెటర్ తేవాలంటున్నారు. ప్యాసింజర్ ఆటోలకు గూడ్స్ ట్రాన్స్‌పోర్టు బుకింగ్ ఇస్తున్నారు. ఒప్పుకోకపోతే సస్పెండ్ చేస్తున్నారు. ఒప్పుకుంటే పోలీసులు చలాన్లు వేస్తున్నారు. కొత్తలో డ్రైవర్లకు ఆకర్షణీయమైన ఆదాయం ఉంటుందని నమ్మించారు. క్రమంగా కస్టమర్లను ఆకర్శించేందుకు రేటు తగ్గిస్తూ వచ్చారు. కానీ యాజమాన్యం కమీషన్ మాత్రం పెంచుకుంటున్నది. వెయిటింగ్ టైమ్‌కు కస్టమర్ మీద అదనంగా రేటు పెంచిన సందర్భాలలో కూడా ఆ డబ్బు కూడా తీసుకుంటున్నది. డ్రైవర్ చాలా దూరం ప్రయాణించిన తర్వాత, చివరి సమయంలో కస్టమర్ క్యాన్సల్ చేస్తే, కస్టమర్ మీద వేసే జరిమానా డబ్బు కూడా యాజమాన్యమే తింటున్నది. పెట్రోల్/డీజిల్ ఖర్చు భరించేది, సమయం నష్టపోతు న్నది డ్రైవర్లు. తమ వాహనం మీద కంపెనీ అడ్వర్‌టైజ్‌మెంట్ స్టిక్కర్ వేయాలి. అందుకు యాజమాన్యం చెల్లించేది కేవలం వెయ్యి రూపాయలు. కానీ చిన్న గీతపడినా రూ.5 నుండి 7 వేలు ఖర్చు పెట్టి కొత్త స్టిక్కర్ వేయాలి. మార్కెట్‌లో ప్లాట్‌ఫారాల మధ్య పోటీలో వినియమదారులకు రకరకాల ఆఫర్లు ఇస్తున్నారు. నష్టపోతున్నది డ్రైవర్లే. సాధా రణంగా కస్టమర్లు గమ్యం చేరిన తర్వాత ఫీడ్‌బ్యాక్ ఆప్షన్ పట్టించుకోరు. ఫీడ్‌బ్యాక్ ఇవ్వకపోయినా. ఆదాయం కోత పెట్టి యాజమాన్యం మింగుతున్నది. కమీషన్‌కు అదనంగా యాజమాన్యాలు ప్లాట్‌ఫారం చార్జీ పేరుతో అదనంగా రూ.20 కోత పెడుతున్నారు. మొత్తం మీద, వీరిమధ్య పోటీలో కస్టమర్లను నిలుపుకునేందుకు, పెంచుకునేందుకే ప్రాధాన్యత. కష్టాలు డ్రైవర్లకూ, లాభాలు యాజమా

# నేడు గోవా విముక్తి దినం...

**-పోర్చుగీసు పాలన నుండి గోవా ను విముక్తి చేసిన భారత సాయుధ దళాలు**

భారతదేశంలో ప్రతి సంవత్సరం డిసెంబర్ 19న గోవా విమోచన దినోత్సవాన్ని జరుపుకుంటారు. 450 సంవత్సరాల పోర్చుగీసు పాలన తరువాత 1961లో గోవాను భారత సాయుధ దళాలు విముక్తి చేసిన రోజును ఇది గుర్తు చేస్తుంది.1947 ఆగస్టు 15న భారతదేశం స్వాతంత్ర్యం పొందినప్పుడు గోవా ఇంకా పోర్చుగీసు పాలనలో నే ఉంది. పోర్చుగీసు వారు గోవా, ఇతర భారత భూభాగాలపై తమ పట్టును వదులుకోవడానికి నిరాకరించారు. పోర్చుగీసుతో అనేక విఫల చర్చలు మరియు దౌత్య ప్రయత్నాలు తరువాత, భారత మాజీ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ, సైనిక జోక్యం ఒక్కటే మార్గంగా నిర్ణయించారు. భారత నౌకాదళ సమాచారం ప్రకారం, భారత దళాలు స్వల్ప ప్రతిఘటనతో డిసెంబర్ 19న గోవా భూభాగాన్ని తిరిగి స్వాధీనం




చేసుకున్నాయి. పదవీచ్యుత గవర్నర్-జనరల్ మాన్యుయేల్ ఆంటోనియో వాసాలో ఇ సిల్వా ఈ ప్రాంతంలో పోర్చుగీసు పాలనను అంతమొందించడానికి లొంగుబాటు సర్టిఫికేట్ పై సంతకం చేశారు. దీంతో భారత్ పూర్తిగా పరాయి పాలన నుంచి విముక్తి పొందాడు. "గోవా, డామన్ మరియు డయ్యూ ప్రాంతాల విముక్తి కోసం భారత నౌకాదళం చేపట్టిన "ఆపరేషన్ విజయ్" లో 1961 డిసెంబర్ 19న తమ ప్రాణాలను త్యాగం చేసిన ఏడుగురు యువ నావికులు, ఇతర సిబ్బంది జ్ఞాపకార్థం గోమంతక్ వద్ద యుద్ధ స్మారకం నిర్మించబడింది. గోవా విమోచన దినోత్సవం సందర్భంగా గోవాలో ఘనంగా ఉత్సవాలు, ఉత్సవాలు గోవాలో ఘనంగా జరిగాయి. రాష్ట్రంలోని మూడు వేర్వేరు ప్రాంతాల నుంచి టార్చ్ లైట్ ఊరేగింపు ను వెలిగించారు, చివరికి ఆజాద్ మైదాన్ లో అందరూ సమావేశం అయ్యారు. గోవా ను స్వాధీనం చేసుకోవడంలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళి అర్పిస్తారు.

# భారతి సిమెంట్స్ లీజులు రద్దు

**విజయవాడ, డిసెంబర్ 18:** భారతి సిమెంట్స్ లీజులను రద్దు చేసేందుకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. అక్రమాలకు పాల్పడిన అంశాలపై వివరణ కోరింది. పదిహేనురోజుల్లో సమాధానం చెప్పాలని ఆదేశించింది.వారు ఇచ్చే సమాధానాన్ని పరిశీలించి నిర్ణయం ప్రకటిస్తారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా.. చట్టపరంగా ప్రభుత్వాధికారులు ముందుకు వెళ్తున్నారు. భారతి సిమెంట్స్ విషయంలో ల్యాప్స్ అయిపోయిన లీజులను నిబంధనలకు విరుద్ధంగా వ్యవస్థల్ని ఉపయోగించుకుని భారతి సిమెంట్స్ కు కేటాయింపు చేసుకున్నారు. కేంద్రం ఈ విషయాన్ని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించి ఏడాది అయిపోయింది.భారతి సిమెంట్స్ అసలు పేరు భారతి సిమెంట్స్ కాదు. రఘురాం సిమెంట్స్. వైఎస్ సీఎం అయ్యాక దాన్ని జగన్ కొనుగోలు చేశారు. రఘురాం సిమెంట్స్ కంపెనీకే సున్నపురాయి లీజులు ఉన్నాయి. భారతి సిమెంట్స్ గా మారిన తర్వాత ఆ లీజుల్ని కూడా కంపెనీ వాడేసుకుంటోంది. కేంద్రం గనుల విషయంలో చాలా స్పష్టమైన పాలసీ తీసుకుంది. ఓ కంపెనీ పేరుతో లీజులు తీసుకుని మరొకరు ఆ కంపెనీని టేకోవర్ చేస్తే లీజులు చెల్లవని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దరఖాస్తులు చేసుకుని ఉన్నా సరే.. అవి ల్యాప్స్ అవుతాయని స్పష్టం చేసింది. దీంతో భారతి సిమెంట్స్ లీజులు గందరగోళంగా పడ్డాయి. 2017లో ఏపీ ప్రభుత్వం రఘురామ్ సిమెంట్స్ కు ఇచ్చిన ప్రాథమిక అనుమతిని రద్దు చేసింది.జగన్ అధికారంలోకి వచ్చాక లీజులను మళ్లీ తన కంపెనీ పేరుతో లీజులను పునరుద్ధరించుకునేందుకు ఓ సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తిని, అడ్వకేట్ జనరల్ ను పావుగా వాడుకున్నారు. న్యాయసలహా అంటూ లీజుల్ని పునరుద్ధరించేసుకున్నారు. నిబంధనలను అనుసరించాలని హైకోర్టు స్పష్టంగా ఆదేశించింది. అయినా న్యాయసలహా పేరుతో లీజుల్ని పునరుద్ధరించుకున్నారు. ఎన్నికలకు ముందు 2024 ఫిబ్రవరిలోనే లీజుల్ని పునరుద్ధరిస్తూ జీవోలు జారీ చేశారు. దీనిపై కేంద్రానికి ఫిర్యాదు వెళ్లింది. కేంద్రం విచారణ



చేయాలని రాష్ట్రానికి లేఖ రాసింది. అసలు విషయం బయటకు వచ్చింది. భారతి సిమెంట్స్ ను.. ప్రొడక్షన్ ప్రారంభం కాక ముందు 51శాతం వాటాను రెండువేల కోట్లకు వికాట్ అనే కంపెనీకి అమ్మేశారు. కానీ యాజమాన్యం ఇంకా జగన్ కుటుంబం చేతుల్లోనే ఉంది.

# తగ్గని బంగారం జోరు...

**ముంబై, డిసెంబర్ 18:** రెండ్రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు మళ్లీ పుంజుకొని ఆల్ టైం రికార్డ్ స్థాయి వద్ద కొనసాగుతున్నాయి. నిన్న ఒక్కరోజే భారీగా తులం బంగారంపై రూ.650 పెరగ్గా.. ఇవాళ మళ్లీ అదే సీన్ రిపీట్ అయింది. బుధవారం నుంచి గురువారం మధ్య కూడా బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. దీంతో డిసెంబర్ 18 గురువారం ఉదయం ఆరు గంటలకు మార్కెట్‌తో 24 క్యారెట్ల తులం బంగారం రూ. 1,34,520 వద్ద కొనసాగుతుంది. బుధవారం ఉదయం రూ.650 పెరిగిన తర్వాత రూ. 1,34,510 గా ఉన్న తులం బంగారం ధర ఇవాళ ఉదయానికి తులంపై రూ. 10 పెరిగి ప్రస్తుతం రూ. 1,34,520 కొనసాగుతుంది. ఇక 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,23,310 వద్ద కొనసాగుతుంది.ఇక బంగారం బాటలోనే వెండి కూడా నడుస్తోంది. నిన్న ఒక్క రోజే ఏకంగా కేజీ బంగారంపై రూ.11 వేలు పెరగ్గా.. బుధవారం నుంచి గురువారం మధ్యలో కాస్త స్వలంగా పెరిగి హాల్ టైం హైకి చేరుకున్నాయి. దీంతో దేశీయ మార్కెట్‌లో ప్రస్తుతం కేజీ వెండి ధర రూ.2,08,100గా కొనసాగుతుంది. కాబట్టి దేశ వ్యాప్తంగా పలు నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా



ఉన్నాయో చూద్దాం

ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,34,670 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,23,460 వద్ద కొనసాగుతోంది.

ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,34,520 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,23,310 వద్ద కొనసాగుతోంది.

హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,34,520 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,23,310 వద్ద కొనసాగుతోంది.

విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,34,520 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,23,310 వద్ద కొనసాగుతోంది.

చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,35,290 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,24,010 వద్ద కొనసాగుతోంది.

బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,34,520 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,23,310 వద్ద కొనసాగుతోంది.

ఈ బంగారం ధరలు ఇంతలా పెరగడానికి ప్రధాన కారణం డాలర్ విలువ పడిపోవడమని నిపుణులు అంటున్నారు. ఎందుకంటే డాలర్ విలువ అనేది విలువైన బంగారం, వెండి వంటి లోహాలను ప్రభావితం చేస్తుందట. ఈ కారణంగా బంగారం, వెండి ధరల్లో హెచ్చుతగ్గులు ఏర్పడుతాయి. కాబట్టి మీరు బంగారం కొనే ముందు ధరలను తెలుసుకోండి.

# ఇక రయ్ రయ్..టోల్‌గేట్లు ఉండవ్..

**ముంబై, డిసెంబర్ 18:** వాహనదారులకు ఇది గుడ్ న్యూస్. ఇక మీరు వాహనంపై వెళ్లేటప్పుడు టోల్ గేట్ల దగ్గర ఆగాల్సిన అవసరం లేదు. ఇక రయ్ రయ్ అంటూ నాన్ స్టాప్‌గా దూసుకెళ్లిపోవచ్చు. ప్రస్తుతం ఉన్న ఫాస్టాగ్ సిస్టమ్ ద్వారా కూడా నగదు అవసరం లేకుండా డైరెక్ట్‌గా టోల్ ఫీజు చెల్లించే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. దీని వల్ల టోల్ గేట్ వద్ద వేచిచూసే సమయం భారీగా తగ్గింది. అయినా పండుగల రద్దీ సమయంలో వాహనదారులు ఎక్కువగా ఉంటారు. ఇలాంటి సమయంలో ఫాస్టాగ్ స్కానర్ ద్వారా పేమెంట్ ప్రక్రియ పూర్తి చేసుకుని వెళ్లాలంటే ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తోంది. ఇప్పుడు దీనికి కూడా చెక్ పడింది. ఇక మీరు టోల్ గేట్ల దగ్గర ఒక్క నిమిషం కూడా ఆగాల్సిన అవసరం ఉండదు.ఫాస్టాగ్ ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నైజేషన్ ఆధారిత మల్టీ లేన్ ఫ్రీ ఫ్లో టోల్ కలెక్షన్ సిస్టమ్ త్వరలో రాబోతుంది. ఈ సిస్టమ్ ద్వారా టోల్ గేట్ దగ్గర ఆగాల్సిన అవసరం ఉండదు. రోడ్లపై కొన్ని చోట్ల కెమెరాలతో కూడిన ప్రత్యేక స్ట్రక్చర్లు ఏర్పాటు చేస్తారు. ఈ కెమెరాలు నెంబర్ ప్లేట్లను స్కాన్ చేసి ఆటోమేటిక్‌గా టోల్ కట్ అయ్యేలా చేస్తాయి. దీని వల్ల మీరు ఒక్క నిమిషం కూడా ఎక్కడా ఆగే పని ఉండదు. ఇప్పటికే దేశవ్యాప్తంగా 11 టోల్ ప్లాజాల్లో ఈ తరహాలో పేమెంట్స్‌ను స్వీకరిస్తున్నారు. త్వరలో దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చే అవకాశముంది.ఆటోమేటిక్ పేమెంట్స్ స్వీకరించే కాంట్రాక్ట్‌ను పలు టోల్ ప్లాజాల వద్ద జియో పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ దక్కించుకుంది. ఈ మేరకు ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. డెడికేటెడ్ షార్ట్-రేంజ్ కమ్యూనికేషన్‌తో పాటు డియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్, గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ టెక్నాలజీలతో కలిసి ఈ కొత్త టోల్ వ్యవస్థ పనిచేస్తుంది. రానున్న రోజుల్లో ఈ కొత్త టోల్ వ్యవస్థ దేశవ్యాప్తంగా అమల్లోకి రానుందని తెలుస్తోంది. దీని వల్ల వాహనదారులకు సమయం ఆదా కానుంది.

# నేషనల్ హెరాల్డ్ కేసు.. కేవలం రాజకీయ కక్ష సాధింపు

**- ఎమ్మెల్యే సత్యనారాయణ రావు**

**జయశంకర్ భూపాలపల్లి:** నేషనల్ హెరాల్డ్ కేసు.. కేవలం రాజకీయ కక్ష సాధింపు తప్ప మరొకటి కాదని.., సీబీఐ, ఈడిలను ఉపయోగించి కాంగ్రెస్ నాయకులను, ముఖ్యంగా గాంధీ కుటుంబాన్ని వేధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఎద్దేవా చేశారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి మంజూరునగర్ లోని బీజేపీ కార్యాలయం ముందు డిసిసి అధ్యక్షుడు బట్టు కరుణాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అంతకుముందు సింగరేణి ఏరియా ఆసుపత్రి సెంటర్ నుండి బీజేపీ కార్యాలయం వరకు ర్యాలీ తీశారు. కొంతసేపు బీజేపీ ఆఫీస్ ముందు బైఠాయించి నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ ఫిర్యాదును కోర్టు కొట్టేసిందని, కేసులో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు, ట్రాన్సాక్షన్లు లేవని కోర్టు స్పష్టం చేసిందని తెలిపారు. రాహుల్ గాంధీ, సోనియా గాంధీలపై కక్ష సాధింపు రాజకీయాలే



లక్ష్యంగా ఈడీ కేసు నమోదు చేసిందని, బీజేపీ ప్రభుత్వమే ఈడీ, సీబీఐ వంటి సంస్థలను రాజకీయ ఆయుధాలుగా వాడుతోందని ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ప్రాపర్టీ ట్రాన్స్ఫర్ గానీ, అక్రమ ఆస్తుల గానీ లేవని, కోర్టు ఈడీకి చివాట్లు పెట్టి ఇలాంటి కేసులు పెట్టొద్దని హెచ్చరించిందన్నారు. స్వతంత్ర సంస్థలను పార్టీ ప్రయోజనాల కోసం వాడొద్దని స్పష్టమైన సందేశం ఇచ్చిందని, కాంగ్రెస్ నేతలపై తప్పుడు కేసులతో ప్రజల్లో అపనమ్మకం సృష్టించే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఈడీ చర్యల వెనుక బీజేపీ రాజకీయ దురాలోచన బయటపడిందని, ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో 2005లో ఉపాధి హామీ పథకం ప్రారంభం అయిందని, ఇప్పుడు పథకం పేరు మార్చి వికసిత్ భారత్ %-% జీ రామ్ జీగా నామకరణం చేశారన్నారు. మహాత్మా గాంధీ పేరు తొలగించడం ఆర్ఎస్ఎస్, బీజేపీ ఆలోచనకు నిదర్శనమని, పథకాన్ని బలపర్చకుండా నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. పేదలు, దళితులు, మైనారిటీల సంక్షేమాన్ని పట్టించుకోని వైఖరి కేంద్రానిదని మండిపడ్డారు. కాంగ్రెస్ తీసుకొచ్చిన పథకాల మూలసూత్రాలను బీజేపీ చెరిపేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆరోపణలు గుప్పించారు.

# పరిషత్ ఎన్నికల్లో...
# 42 శాతం రిజర్వేషన్

- మొదటి పేజీ తరువాయి

మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వంలోని ముఖ్యులు పేర్కొంటున్నట్లు సమాచారం.పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకొని పల్లె ప్రజలు అధికార పార్టీ వైపే ఉన్నారని నిరూపించింది. ఇదే వేడిలో మున్సిపల్ ఎన్నికలను నిర్వహించి పట్టణ ప్రాంత ప్రజలుసైతం కాంగ్రెస్ ప్రభుత్వం వైపే ఉన్నారని స్పష్టం చేయాలని కాంగ్రెస్ పెద్దల ఆలోచనగా ఉన్నట్లు తెలుస్తోంది. అన్నీ కుదిరితే జనవరిలోనే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే, పార్టీ పరంగా జరిగే మున్సిపల్ ఎన్నికలకు ముందే బీసీ రిజర్వేషన్లపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్న అంశంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.వాస్తవానికి పంచాయతీ ఎన్నికల్లోనే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రయత్నించిన విషయం తెలిసిందే. ఇందుకోసం ప్రత్యేకంగా



జీవో 9 జారీ చేసింది. అయితే, మొత్తం రిజర్వేషన్లు 50శాతం మించరాదని, పాత రిజర్వేషన్ల ప్రకారమే స్థానిక ఎన్నికలను నిర్వహించుకోవచ్చునని కోర్టులు స్పష్టం చేశాయి. దీంతో బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోను నిలిపివేశాయి. మరోవైపు.. పంచాయతీలకు పాలక వర్గాలు లేకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోయే ప్రమాదం ఏర్పడింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పని పరిస్థితుల్లో 42శాతం బీసీ రిజర్వేషన్లు లేకుండానే పంచాయతీ ఎన్నికలకు వెళ్లింది. అయితే, మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో 42శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.మున్సిపల్, పరిషత్ ఎన్నికలు పార్టీ గుర్తుపై నిర్వహించే ఎన్నికలు కావడంతో బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం ఒక నిర్ణయానికి రావాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికే రిజర్వేషన్లు 50శాతానికి మించకూడదని కోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో బీసీలకు పార్టీ పరంగా 42శాతం రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తానికి బీసీలకు 42శాతం రిజర్వేషన్లతోనే తొలుత మున్సిపల్, ఆ తరువాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం జనవరి మొదటి వారంలో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాల సమాచారం.

# పంచాయితీ విన్నర్ కాంగ్రెస్..

- మొదటి పేజీ తరువాయి

అయ్యేది . కానీ కాంగ్రెస్ ఆ గండాన్ని గట్టెక్కింది.భారత రాష్ట్ర సమితి క్యాడర్ చేతులు ఎత్తేయకపోవడం ఆ పార్టీ పెద్దల్ని సంతృప్తి పరిచిందని అనుకోవాలి. అధికారంలో లేకపోతే పనులు చేయించుకోలేమన్న కారణం చెప్పి బలమైన గ్రామ స్థాయి నేతలంతా పార్టీ మారిపోయి ఉంటే బీఆర్ఎస్ పార్టీ పరువు పోయేది. కానీ మెజార్టీ నేతలు పార్టీ మారలేదు. గ్రామాల్లో రెండు వర్గాలు బలంగా ఉండటం దీనికి కారణం. ఇలాంటి పరిస్థితితో బీఆర్ఎస్ మద్దతుదారులు గట్టిగా పోరాడారు. బలమైన నేతలు ఉన్న చోట.. బీఆర్ఎస్ నేతలు తమ సర్పంచ్ అభ్యర్థులకు ఆర్థికంగా కూడా సాయం అందించారు. ఇది కలసి వచ్చింది. ఎలా చూసినా.. భారత రాష్ట్ర సమితి జావ కారిపోలేదు. గట్టిగానే పోరాడి నిలబడింది. ఇది రాబోయే రోజుల్లో పోరాటానికి సరిపోతుంది.గ్రామ స్థాయిలో ఎప్పుడూ బలంగా లేని బీజేపీ ఈ సారి కొన్ని జిల్లాల్లో మంచి ఫలితాలు చూపించింది. బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్ రెడ్డి ఉన్న నిర్మల్ జిల్లాలో ఇతర పార్టీల కన్నా ఎక్కువ సీట్లు సాధించింది. అలాగే ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ వంటి చోట్ల ఏకపక్షంగా కాకపోయినా కొన్ని మంచి ఫలితాలు సాధించారు. ఐదారు వందల పంచాయతీల్లో బీజేపీ మద్దతుదారులు అయిన సర్పంచ్‌ల విజయం సాధించారంటే చిన్న విషయం కాదు. కానీ బీజేపీ ఇచ్చుకున్న హైప్‌కు.. ఆ తర్వాత వచ్చిన ఫలితాలకు మాత్రం పొంతన లేదు.మొత్తంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ స్థాయిలోనూ విజేతగా నిలిచింది. రెండేళ్ల పాలన తర్వాత జరిగిన ఈ ఎన్నికలు ఆ పార్టీ నాయకత్వానికి మోరల్ సపోర్టుగా ఉంటాయి. రేవంత్ రెడ్డి స్థానానికి మరింత బలం చేకూర్చాయి.

**విజయం వెనుక వ్యూహం- సీఎం ఇమేజ్, సమన్వయం**

పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఘన విజయానికి కేవలం ప్రభుత్వ పాలన మాత్రమే కారణం కాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగత ఇమేజ్ కూడా దోహదపడిందని గాంధీ భవన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సీఎం నాయకత్వానికి తోడు, మంత్రులు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, పార్టీ నేతలు, కార్యకర్తల మధ్య ఉన్న పటిష్టమైన సమన్వయమే ఈ మంచి ఫలితాలను సాధించి పెట్టిందని పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత ముఖ్యమంత్రి పరిపాలన విధానానికి పల్లె ప్రాంతాల ప్రజలు పట్టం కట్టిన విషయం ఈ ఫలితాల ద్వారా స్పష్టమవుతోందని నాయకులు అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ గ్రామీణ ప్రాంతాల్లో అధికారాన్ని కెలుచుకోవడానికి ప్రధానంగా సంక్షేమ పథకాలే బాసటగా నిలిచాయని అభిప్రాయం బలంగా పార్టీలో వ్యక్తమవుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ, పేద ప్రజలకు నేరుగా లబ్ధి చేకూర్చే పథకాలను అమలు చేయడం ప్రజలను కాంగ్రెస్ వైపు మొగ్గు చూపించింది. ముఖ్యంగా పేదలకు సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు వంటి ప్రతిష్టాత్మక పథకాలు, వీటితోపాటు రేషన్ కార్డుల పంపిణీ, రైతు భరోసా, సన్న ధాన్యానికి ఐదు వందల రూపాయల బోనస్ వంటి వ్యవసాయ అనుకూల విధానాలు అలాగే మహిళలకు ఉచిత బస్ ప్రయాణం వంటి పథకాలు గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా ఓటర్లను ప్రభావితం చేశాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఈ పథకాల ద్వారా ప్రజల్లో విశ్వాసం పెరిగి, పంచాయతీల్లో అత్యధిక స్థానాలు కాంగ్రెస్ ఖాతాలో చేరాయని అంటున్నారు.ఒకట్రెండు జిల్లాల్లో మినహా రాష్ట్రంలోని అన్ని గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ ఆధిక్యం సాధించడం ద్వారా కాంగ్రెస్ తన పట్టును బలంగా రుజువు చేసుకుంది. ఈ విజయం పల్లె ప్రాంతాల్లో కాంగ్రెస్ గట్టిగా




పాగా వేయగలిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీపై విమర్శలు చేసింది. ఆ రెండు పార్టీలు కలిసినప్పటికీ 30 శాతం సీట్లు దక్కలేదని ఇది ప్రతిపక్షాలపై ప్రజలకు విశ్వాసం లేదని చెప్పడానికి నిదర్శనమని కాంగ్రెస్ నాయకులు విశ్లేషిస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన స్వతంత్ర అభ్యర్థులపై కాంగ్రెస్ తన విశ్లేషణ వినిపిస్తోంది. స్వతంత్రంగా గెలిచిన వారిలో 90 శాతం మంది కాంగ్రెస్ పార్టీ వాళ్లేనని అంటోంది. రెండు వేలకుపైగా గ్రామాల్లో రెబెల్స్ పోటీ చేశారని,గ్రామీణ ప్రాంతాల్లో వారికి ఉన్న ప్రజాదరణకు ఇదే నిదర్శనమని అంటున్నారు. ప్రస్తుతం గెలిచిన ఈ స్వతంత్రుల్లో ఎక్కువ మంది కాంగ్రెస్ గూటికి వస్తారని చెబుతోంది. వారి రాకతో 75 శాతానికిపైగా పంచాయతీలు తమ పార్టీవే అవుతాయని అంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణను ప్రపంచ పటంలో నిలబెట్టేందుకు చేస్తున్న కృషి, అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా మంత్రివర్గం పని చేస్తుండటం కూడా ఈ విజయానికి కారణాలని టీపీసీసీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

# కమలంలో లీకు వీరులు ఎవరు..?

- మొదటి పేజీ తరువాయి

ఉన్నారు. వారంతా మంచి మెజార్టీలతో గెలిచారు. కానీ పంచాయతీ ఎన్నికలను పట్టించుకోవడం లేదు. ఈటల రాజేందర్ మల్కాజిగిరి కన్నా హుజూరాబాద్ పైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారు. ఇతర ఎంపీలూ అంతే.ఎవరికి పదవి ఇస్తే ఎవరు అసంతృప్తికి గురవుతారోనన్న ఉద్దేశంతో అందర్నీసమానంగా ఉంచుతూ.. ప్రధాన పదవులకు పెద్దగా పోటీ పడని రామచంద్రరావును అధ్యక్షుడిగా నియమించారు. కానీ ఈ నియామకాన్ని బీజేపీ నేతలు వేరేగా తీసుకున్నారు. అసలు పని చేయడం మానేసారు. కొంత మంది అడ్వాంటేజ్ గా తీసుకున్నారు. తెలంగాణ బీజేపీలో కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్ తో పాటు డీకే అరుణ, రఘునందన్ రావు లాంటి వాళ్లు ఉన్నారు. అందరూ ఎప్పుడూ ఒక్క మాట మీద లేరు. ఎవరి రాజకీయాలు వారు చేస్తున్నారు. వీరిలో ఎవరికైనా అధ్యక్ష పదవి వచ్చి ఉంటే పరిస్థితి ఇంకా ఘోరంగా ఉండేది. ఇప్పుడు రామచంద్రరావు చెప్పిన మాట వినరు. పార్టీ తరపున పోరాటం చేయరు. దీంతో హైకమాండ్ రామచంద్రరావు నియామకంలో చేసిన ప్రయోగం రివర్స్ అయినట్లయింది.బండి సంజయ్ నాయకత్వం ఉన్నప్పుడు ఆ పార్టీ పరిస్థితి మెరుగ్గానే ఉండేది. కానీ ఆయన ఎదుగుదల చాలా మందికి నచ్చలేదు. అందుకే నియంత్రించారు. చివరికి ఇప్పుడు అటూ ఇటూ కాకుండా అయిపోయింది. అటు ఈటలను ప్రోత్సహిస్తే బండి సంజయ్ ఒప్పుకోరు. బండి సంజయ్ ను ప్రోత్సహిస్తే ఈటల, కిషన్ రెడ్డి అంగీకరించరు. పార్టీ నేతల మధ్య ఏ మాత్రం సరిపడని ఈ రాజకీయాన్ని మోదీ ఎంతో కాలం సహించే అవకాశం లేదు. పార్టీ పరిస్థితి మెరుగుపడకపోతే ఆయన కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

**విషయాలను బయటపెట్టింది ఎవరనేది మిస్టరీ..**

మోదీతో తెలంగాణ ఎంపీల భేటీకి సంబంధించిన వివరాలు బయటకు రావడంపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సీరియస్ అయ్యారు. భేటీ వివరాలను లీకు చేసినోళ్లు మెంటల్‌గాళ్లు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశ వివరాలను బయటకు చెప్పొద్దని స్వయంగా మోదీ ఆదేశించినా పట్టించుకోకపోవడం విచారకరం అంటూ మీడియాతో చిట్‌చాట్‌లో అన్నారు. లీకులు ఇచ్చిన ఎంపీలెవరో మీడియా ప్రతినిధులు చెప్తే.. వారిపై చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. ఐతే ఇక్కడే కొత్త చర్చ జరుగుతోంది. మోదీతో మీటింగ్ వివరాలు బయటపెట్టిన వాళ్లను మెంటల్‌గాళ్లు అంటూ కిషన్ రెడ్డి సంభోదించారంటే.. విషయం ఎంత సీరియస్సో.. జాతీయ నాయకత్వం ఎలాంటి తీరుతో ఉందో అర్థం అవుతుందనే చర్చ.. సొంత పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది.ఇదంతా ఎలా ఉన్నా.. మోదీ సమావేశ విషయాలను బయటపెట్టింది ఎవరనేది మిస్టరీగా మారింది. ప్రధానితో సమావేశం అయిన వారిలో.. తెలంగాణతో పాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ ఎంపీలు కూడా ఉన్నారు. ఇందులో సమావేశ వివరాలను బయటపెట్టాల్సిన అవసరం ఎవరికి ఉందన్న దానిపై ఆరా తీస్తున్నారని తెలుస్తోంది. కర్ణాటక, కేరళ ఎంపీలకు.. తెలుగు రాష్ట్రాల్లో మీడియా ప్రతినిధులతో పెద్దగా పరిచయం ఉండే అవకాశం లేదు. దీంతో తెలుగు రాష్ట్రాల ఎంపీలే.. ఈ విషయాలను బయటపెట్టి ఉంటారనే డిస్కషన్ నడుస్తోంది. దీంతో లీకు వీరుడు ఎవరనేది తెలుసుకునే ప్రయత్నంలో బీజేపీ నేతలు ఉన్నారట. మరి అది ఎవరో తెలిస్తే.. అసలు విషయం తేలితే.. ఎలాంటి చర్యలు ఉంటాయనేది హాట్‌టాపిక్‌గా మారింది.

# తెలంగాణ విద్యుత్ రంగంపై.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

- మొదటి పేజీ తరువాయి

పేరుకుపోయాయని.. వేలకోట్ల రూపాయల అప్పుల భారాన్ని మోయలేక నడ్డి విరుగుతోందని అన్నారు. విద్యుత్ సంస్థలు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ రంగంపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రాన్ని విడుదల చేసిందని.. రూ.30 వేల కోట్లకు పైగా అప్పు ఉందని చెప్పారని కేంద్రమంత్రి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సింగరేణి కంపెనీకి 47 వేల కోట్ల రూపాయలు అప్పు ఉందన్నారు. విద్యుత్ డిమాండ్ రోజు రోజుకు పెరుగుతోందని.. విద్యుత్ సంస్థల అప్పుల పరిస్థితి కూడా పెరుగుతోందని తెలిపారు. ఒకపూట వర్షాలు, గాలులు వస్తే హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోతుందన్నారు. కంపెనీలను ఆహ్వానిస్తున్న తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. విద్యుత్ లేకపోతే కంపెనీలు రావన్నారు. పాత బకాయిల విషయంలోనూ ఎటువంటి ఆలోచన చెయ్యడం లేదని విమర్శించారు. నిధులు లేక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందంటూ వ్యాఖ్యలు చేశారు.గ్లోబల్ హబ్‌గా మారాలంటే విద్యుత్ చాలా కీలకమని చెప్పుకొచ్చారు. కొత్త డిస్కంల ఏర్పాటుపై కాకుండా.. విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి పెట్టాలన్నారు. మనిషి మనుగడ, వ్యవస్థ మనుగడకు విద్యుత్ అత్యంత కీలకమని చెప్పుకొచ్చారు. విద్యుత్ ప్రాథమిక అవసరంగా మారిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ పెరుగుతోందని తెలిపారు. 74 శాతం విద్యుత్ థర్మల్‌తోనే జరుగుతోందని అన్నారు. గతంలో ఏపీ, తెలంగాణలో విద్యుత్ కోతలు ఉండేవని గుర్తుచేశారు. మోదీ పీఎం కాకముందే విద్యుత్ కోసం ఆందోళనలు జరిగాయన్నారు. ఇపుడు 24/7 విద్యుత్ సరఫరా జరుగుతోందన్నారు. ఇప్పుడు వన్ నేషన్ – వన్ గ్రిడ్‌తో అనుసంధానం జరిగిందని చెప్పారు. తెలంగాణలో విద్యుత్ కేబుల్స్ వ్యవస్థ బలోపేతం కోసం కొత్త టెక్నాలజీ అందించామన్నారు. కేంద్రం తెలంగాణాకు అనేక రకాలుగా సహకారం అందించిందని తెలిపారు. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 4 వేల మెగావాట్ల పవర్ జనరేషన్ చెయ్యాలని కేంద్రం నిర్ణయం తీసుకుందన్నారు. సింగరేణి కంపెనీ డీఎమ్ఎఫ్ కింద నిధులు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉందని కేంద్రమంత్రిపేర్కొన్నారు.

**ఎమ్మెల్యేల అనర్హత అంశంపై..**

ఎమ్మెల్యేల విషయంలో తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నిర్ణయం దురదృష్టకరమని కేంద్రమంత్రి అన్నారు. ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ ఇచ్చిన తీర్పును పునరాలోచన చేయాలని కోరారు. పార్టీలు మారినట్టు ఎమ్మెల్యేలు, పత్రికలు ప్రకటించాయని తెలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ప్రచారం చేశారన్నారు. రాజ్యాంగంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు గౌరవం లేదని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ.. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి మంత్రి పదవులు ఇచ్చారని.. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కూడా అదే పని చేస్తోందన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో గతం కంటే బీజేపీకి చాలా బలం పెరిగిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు.

## కేటీఆర్‌కు కవితపై ప్రేమ ఎంత...
# ఉందా..?లేదా..?

- మొదటి పేజీ తరువాయి

కౌంటర్ ఇస్తూ.. విషయాన్ని పెద్దది చేస్తున్నారు.కవిత ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తనను బీజేపీ జైల్లో పెడితే కేటీఆర్ కూడా పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ ఆరోపణలకు బీఆర్ఎస్ సోషల్మీడియా ఉలిక్కిపడి స్పందించింది. కవితను అరెస్టు చేయడానికి వచ్చినప్పుడు కేటీఆర్ అడ్డం పడ్డారని అప్పటి వీడియోలు చూపిస్తున్నారు. కానీ జాగృతి సోషల్ మీడియా మాత్రం అదంతా డ్రామానేనని.. కవితను త్వరగా జైలుకుపంపాలని ఈడీకి చెప్పారని.. జైలుకు తీసుకెళ్లేందుకు కారులో ఎక్కించుకున్న తరవాత హరీష్ రావు,కేటీఆర్ నవ్వుకున్నారని వీడియోలు పెట్టారు. కేటీఆర్ఎప్పుడూ కవితపై ప్రేమాభిమానాలు చూపించలేదని అంటున్నారు.జాగృతి కార్యకర్తలు కొత్త కొత్త విషయాలు బయట పెడుతూండటంతో.. కేటీఆర్ మొదటి నుంచి కవితపై అంత సానుకూలంగా లేరన్నప్రచారం ప్రారంభమవుతోంది. కేటీఆర్ తన సోదరిపై ఎంతో ఆప్యాయంగా ఉంటారని నమ్మించేందుకు బీఆర్ఎస్ సోషల్ మీడియా తంటాలు పడుతోంది. కానీ ఇలాంటి చర్చ పెట్టి కేటీఆర్ పై కొత్త అనుమానాలు రేకెత్తించడంలో మాత్రం.. బీఆర్ఎస్ సోషల్ మీడియా సక్సెస్ అయింది. ఇదంతా ఆ పార్టీకి అవసరం లేని వివాదాలు తెచ్చి పెట్టడానికి తప్ప దేనికీ ఉపయోగపడవు.

## మావోయిస్టులకు
# భారీ ఎదురుదెబ్బ

- మొదటి పేజీ తరువాయి

కార్యాలయానికి వేకువ జామున తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. వీరంతా ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని బస్తర్ ఏరియా నుంచి వచ్చి కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ (యూ)లో ఓ ఇంట్లో 16 మంది మావోయిస్టులు ఉన్నట్లు తెలుసుకొని సోమవారం రాత్రి కూంబింగ్ నిర్వహించిన పోలీసులు 16 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు. ఛతీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో ఇటీవల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో మావోలు వారి స్థావరాలను మారుస్తున్నారు. పోలీస్ నిఘా విభాగం సమాచారంతో ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్, స్పెషల్ పార్టీ పోలీసులు సిర్పూర్ (యు)లో సోమవారం రాత్రి 16మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ వారిలో 9 మంది మహిళలు ఉండగా 7 పురుషులు ఉన్నట్లు తెలిసింది. ఇందులో ముఖ్యంగా మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ ఉన్నట్లు సమాచారం. డిస్ట్రిక్ట్ కమాండెంట్ మెంబర్స్ స్థాయి కేడర్స్ వారు నలుగురు ఉన్నట్లు తెలుస్తోంది. పట్టుపడ్డ వారిని సోమవారం రాత్రికి రాత్రే హైదరాబాద్‌లోని డిజిపి కార్యాలయానికి తరలించినట్లు తెలిసింది. ఒకట్రెండు రోజుల్లో డిజిపి కార్యాలయంలో ఈ విషయాన్ని మీడియా ముందు ప్రకటించే అవకాశం ఉంది.

# మన పార్టీ కాకున్నా పనులు చేస్తా....

- మొదటి పేజీ తరువాయి



ఆడిగినవి అన్ని ఇస్తున్నారు. ఎన్నికల టైం లో కబ్జా చేసే వాళ్ళని, గొడవలు చేసే వాళ్ళని గంజాయి బ్యాచ్ లని ఖమ్మం కి దూరం చేయమని అన్నారు. ఖమ్మం లో గంజాయి కూడా లేకుండా చేస్తా నని అన్నారు.కబ్జాలు కూడా లేకుండా చేస్తా. అంతకు ముందు ఒక్కొక్కరి పై100 కేసులు పెట్టారు. అవన్నీ లేకుండా చేస్తా. పెద్ద పెద్ద స్కూల్స్ కాలేజ్ చుట్టు పక్కల గంజాయి అమ్ముతున్నారు. అమ్మే విషయం తెలిసిన వారు చెప్పాలి. చెప్పకుండా అన్నీ చేయాలి అంటే కష్టం అని అన్నారు.ప్రజలకి ఉపయోగపడే ఏదైనా చేస్తా. నన్ను అడిగే వాళ్లే లేరు. చేసే పనులు కూడా చూసే వాళ్ళు లేరు. ఇచ్చిన డబ్బులు సక్రమముగా ఖర్చు చెయాలి. ఖమ్మం పట్టణంలో 5 లక్షల మంది కి పైగా ప్రజలు నివసిస్తున్నారు. నాయకులు వెంట పడి పనులు చేపించు కొకపోతే మీ మొహాలు చూడరు ప్రజలు. ప్రజల మనసులు గెలవాలి. మన పార్టీ కాక పోయిన కావాల్సి పని చేస్తాం. కాంగ్రెస్ ని గెలిపిస్తే మాకు పథకాలు వస్తాయి అని ఆశగా ప్రజలు చూస్తున్నారు. అందరి ఆశలను నెరవేర్చాలని అన్నారు.

# స్పీకర్ సరే...
# ప్రజాకోర్టు ఉందిగా...

- మొదటి పేజీ తరువాయి

అనర్హతా వేటు వేసింది. సభా వ్యవహారాల్లో స్పీకర్ నిర్ణయాన్ని హైకోర్టు కొట్టి వేయడానికి అవకాశం ఉందా లేదా అన్నదానిపై రాజ్యాంగపరమైన చర్చలు ఉన్నాయి. కానీ ఇక్కడ తీర్పు వచ్చేసింది. ఇంకా సుప్రీంకోర్టులో సవాల్ చేయలేదు. ముకుల్ రాయ్.. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ గా ఉన్నారు.బెంగాల్‌లో ఒక్క ఎమ్మెల్యే గురించి హైకోర్టు ఇలాంటి తీర్పు వచ్చింది. ఒక్కరైనా పది మంది అయినా కోల్ కతా హైకోర్టు ఇచ్చిన తీర్పు ఇక్కడ కూడా అన్వయిస్తే మాత్రం పది మందిపై అనర్హతా వేటు వేయాలి . బెంగాల్ లో ముకుల్ రాయ్ లానే.. ఇక్కడ పది మంది బీఆర్ఎస్ తరపున గెలిచి కాంగ్రెస్ లో చేరారు. వారిపై అనర్హతా పిటిషన్లను స్పీకర్ తోసి పుచ్చుతున్నారు. కానీ వారు పార్టీ మారారన్నది మాత్రం బహిరంగసత్యం. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ పీఏసీ చైర్మన్ గా ఉన్నారు. ఇది కూడా బెంగాల్ హైకోర్టు ఇచ్చిన తీర్పుతో సరిపోలింది. అందుకే బీఆర్ఎస్ పార్టీ మరింత ఆత్మవిశ్వాసంతో న్యాయపోరాటం చేయనుంది. ఇది పిరాయింపు ఎమ్మెల్యేలకు మరింత టెన్షన్ పుట్టించే అవకాశం ఉంది.హైకోర్టులో గతంలో కొంత మంది ఎమ్మెల్యేలపై అనర్హతా వేటు వేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఎప్పుడూ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద మాత్రం అలాంటి అనర్హతా వేయలేదు. అఫిడవిట్‌లో తప్పులు ఉన్నాయనో.. మరో కారణంతోనో అనర్హతా వేటు వేశారు. ఏపీలో ఓ ఎమ్మెల్యేపై అనర్హతా వేటు వేసి.. రెండో స్థానంలో ఉన్న అభ్యర్థితో ఎమ్మెల్యేగా ప్రమాణం చేయించారు. ఎక్కడైనా ఉపఎన్నిక పెడతారు కానీ ఇలా రెండో స్థానంలో ఉన్న వారితో ప్రమాణం చేయించడం అరుదు. అదే సమయంలో అనర్హతా చట్టం ప్రకారం స్పీకర్ నిర్ణయమే ఫైనల్. ఆయన చెప్పేదే తీర్పు. కోర్టులు ఈ చట్టాల్లో జోక్యం చేసుకుని తీర్పులు ఇవ్వలేదు. అందుకే ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎంత టెన్షన్ పడినా చివరి విజయం తమదే అవుతుందని గట్టి నమ్మకంతో ఉంటున్నారు. కానీ వారికి వచ్చే రెండు, మూడేళ్లూ టెన్షన్ తప్పదని అనుకోవచ్చు.

# ఎల్లమ్మ బండలో
# ఎమ్మెల్యే మాధవరం పర్యటన

**రంగారెడ్డి:**ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండాలో 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కూల్చిన ఇండ్లను కూకట్ పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే, శేరిలింగంపల్లి నియోజకవర్గ బి.ఆర్.ఎస్ పార్టీ ఇంచార్జ్ మాధవరం కృష్ణారావు సందర్శించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లమ్మబండ అనేది ప్రభుత్వ భూమి అని ఇప్పుడు ఉన్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి కూడా తెలుసని ఎన్నోసార్లు కూడా ప్రస్తావించారని అన్నారు. కానీ ఓ ఎమ్మెల్యే అయి ఉండి ప్రజలకు న్యాయం చేయాల్సింది పోయి దగ్గరుండి ఇండ్లను కూల్చివేయడం ఏమిటి అని ప్రశ్నించారు. 100 ఫీట్ల రోడ్డుకు తాము వ్యతిరేకం కాదని దానిని ప్రజాభిప్రాయ మద్దతుతో వారికి నష్టపరిహారం అందజేసి పనులు ప్రారంభించాలని అన్నారు. రోడ్డు మధ్యలో సెంటర్ పాయింట్ ని తీసుకొని ఈ పనులు చేయాలని ఇష్టం వచ్చినట్లు చేస్తే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్ ఇలాంటి దుశ్చర్యలో వెనక్కి తగ్గకపోతే టిఆర్ఎస్ పార్టీ తరఫున ఉద్యమిస్తామని అదేవిధంగా పేదల జోలికి వస్తే తాము సహించబోయేది లేదని హెచ్చరించారు. నిరుపేదలకు ఎప్పుడు అండగా ఉంటామని వారి బాగోగుల కోసం తాము పాటు పడతామని ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు.

వార్తాతరంగాలు
శుక్రవారం 19 డిసెంబర్ 2025

# ఇక సర్కారీ మెట్రో..

**హైదరాబాద్, డిసెంబర్ 18:** హైదరాబాద్‌లో మెట్రో రైలు సేవలను విస్తరించడంలో భాగంగా మొదటి దశ మెట్రోను స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డి ఎల్ అండ్ టీ కంపెనీ ప్రతినిధులతో కీలక చర్చలు జరిపారు మెట్రో రైలు ఫేజ్ 1లో తమకున్న మొత్తం వాటాను రాష్ట్ర ప్రభుత్వానికి విక్రయించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఎల్ అండ్ టి కంపెనీ ప్రతినిధులు స్పష్టం చేశారు.హైదరాబాద్‌లో మెట్రో హెూల్ సెల్ ఇండియా హైదరాబాద్ దాదాపు 163 కిలోమీటర్ల మేరకు మెట్రోను విస్తరించేందుకు ఎల్ అండ్ టికి మెట్రోపై ప్రస్తుతం ఉన్న దాదాపు రూ. 13,000 కోట్ల అప్పును రాష్ట్ర ప్రభుత్వం స్వీకరించనుంది. దీంతో పాటు తమ కంపెనీ ఈక్విటీ విలువకు సుమారు రూ. రూ.2,000 కోట్లు వన్-టైం చెల్లింపులను చేపట్టాలని ఎల్ అండ్ టి కంపెనీ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఈ చెల్లింపు పూర్తి చేసిన వెంటనే మెట్రో మొదటి దశ మొత్తం రాష్ట్ర ప్రభుత్వం అధీనంలోకి వస్తుంది. 2014లో దేశంలో మెట్రో రైలు నెట్‌వర్క్‌లో రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్, ప్రస్తుతం తొమ్మిదవ స్థానానికి పడిపోయింది. ఈ నేపథ్యంలోనే గ్రేటర్ సిటీలో ట్రాఫిక్ రద్దీ, ప్రజా రవాణా అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం మెట్రోను విస్తరించే ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఫేజ్ 2ఏ, 2బి విస్తరణలో భాగంగా ఎనిమిది కొత్త మెట్రో లైన్ల ప్రతిపాదనలను ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. దాదాపు 163 కిలోమీటర్ల మేరకు మెట్రోను విస్తరించేందుకు



ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన మెట్రో విస్తరణ ప్రతిపాదనలన్నీ కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి.ఇప్పటికే పలు మార్లు సమావేశాలు నిర్వహించిన కేంద్రం ప్రైవేటు భాగస్వామ్యంతో నడుస్తున్న ఫేజ్ 1 మెట్రోకు, ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన ఫేజ్ 2 విస్తరణకు సంయుక్త కార్యాచరణ అవసరమని సూచించింది. అందుకు వీలుగా ఒప్పందం కావాలని కేంద్రం స్పష్టం చేసింది. ఫేజ్ 2లో కూడా ఎల్ అండ్ టి భాగస్వామ్యం ఉండాల్సి ఉంటుందని కేంద్రం సూచించింది. కేంద్రం అభ్యంతరాల నేపథ్యంలో నెలకొన్న ప్రతిష్టంభనను అధిగమించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఎల్ అండ్ టి కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపారు.ఆర్థిక ఒప్పందాలు, చట్టపరమైన నిబంధనల ప్రకారం ఈ ప్రక్రియ పూర్తి ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ, మెట్రో ఫేజ్ 2లోనూ ఎల్ అండ్ టి భాగస్వామ్యం పంచుకుంటే బాగుంటుందని, రాష్ట్ర ప్రభుత్వం అందుకు తగినంత ప్రాధాన్యతనిస్తుందని సిఎం తెలిపారు. ఫేజ్ 1, ఫేజ్ 2 కారిడార్ల మధ్య సంయుక్త కార్యాచరణకు కచ్చితమైన ఒప్పందం అవసరమని ముఖ్యమంత్రి సూచించారు. ఈ ఒప్పందం కుదిరితేనే విస్తరించే రైలు కార్యకలాపాలు సజావుగా సాగుతాయని, ఆదాయ వ్యయాల భాగస్వామ్యంలో స్పష్టత ఉంటుందని సిఎం అన్నారు. రవాణా సంబంధిత వ్యాపారం నుంచి కంపెనీ తప్పుకున్నందు వల్ల కంపెనీ ఈక్విటీ భాగస్వామిగా ఉండలేదని ఎల్ అండ్ టి సీఎండీ అన్నారు. 2002 జులై 22న కుదిరిన రాయితీ ఒప్పందం ప్రకారం ప్రభుత్వం అంగీకరించిన రూ. 3,000 కోట్ల వడ్డీ లేని రుణంలో రూ.2,100 కోట్లు బకాయి ఉందని ఆయన గుర్తు చేశారు. చర్చల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్ 1 మెట్రో ప్రాజెక్టును స్వాధీనం చేసుకోవడానికి సూత్రప్రాయంగా అంగీకరించింది. ఆర్థిక ఒప్పందాలు, చట్టపరమైన నిబంధనల ప్రకారం ఈ ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో మెట్రో రెండో దశ విస్తరణ వేగవంతమవుతుందని, కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన అనుమతులు, ఆమోదం తొందరగా వచ్చే అవకాశముందని సిఎం రేవంత్ అభిప్రాయపడ్డారు

## తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌పై కేఏ పాల్ ఆగ్రహం...

**ఢిల్లీ, డిసెంబర్ 18:** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తాజా నిర్ణయంపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఐదుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను తోసిపుచ్చిన స్పీకర్, 'ఫిరాయింపు ఆధారాలు లేవు'అనడం విడ్డూరంగా ఉందని పాల్ వ్యాఖ్యానించారు.పార్టీ ఫిరాయించిన వారిని బిఆర్ఎస్ సభ్యులుగానే కొనసాగిస్తున్నట్టు స్పీకర్ రూలింగ్ ఇవ్వడం ఆందోళన కలిగించిందని కేఏ పాల్ అన్నారు.'బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు బహిరంగంగా కాంగ్రెస్‌లో చేరి, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నా స్పీకర్ ఫిరాయింపు జరగలేదంటున్నారా? అని పాల్ ప్రశ్నించారు. 'ఇది సిగ్గుచేటు! స్పీకర్‌కు చట్టం తెలుసా? సుప్రీంకోర్టు మీద గౌరవం లేదా?' అని పాల్ ప్రశ్నించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై తొలుత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది తానేనని.. ఈ అంశంపై పోరాటం కొనసాగిస్తానని పాల్ ఢిల్లీలో చెప్పారు.



## వికారాబాద్లో కాంగ్రెస్ పార్టీ నేతల ర్యాలీ

**అక్రమ కేసులతో బీజేపీ భయపెట్టే ప్రయత్నం:**

**కాంగ్రెస్ నేతల ఆరోపణ**

**వికారాబాద్:** వికారాబాద్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి కాంగ్రెస్ పార్టీని భయపెట్టే ప్రయత్నం చేస్తోందని ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు తీవ్రంగా విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ వెనకడుగు వేయదని వారు స్పష్టం చేశారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, రాజకీయ ప్రత్యర్థులపై అక్రమ కేసులు నమోదు చేయడం ద్వారా ప్రజల గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. బీజేపీ పాలనలో ప్రజాస్వామ్య విలువలు దెబ్బతింటున్నాయని, దీనికి వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నుండి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు . ఈ ర్యాలీలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొని నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై పోరాడుతూనే, అన్యాయాలకు ఎదురొడ్డి నిలబడతామని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా వెల్లడించారు.

ఆర్ఎంపి వైద్యుడి ఆత్మహత్య

## ఎస్సై వేధింపులే కారణమని బంధువుల ఆరోపణ



**అల్వాల్:** అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. అల్వాల్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఓ ఎస్సై వేధింపులకు తాళలేక ఆర్.ఎం.పి వైద్యుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది...ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది... గత నెలలో మురహరి గౌడ్ అనే ఆర్.ఎం.పి వద్దకు ఆరోగ్య పరిస్థితి సరిగా లేని రోగి వచ్చాడు. అల్వాల్ లో గౌరవి అనే పేరుతో క్లినిక్ నడుపుతున్న ఆర్ఎంపి మురహరి గౌడ్ వద్దకు సదరు రోగి చికిత్స తీసుకున్నాడు. మెరుగైన వైద్యం కోసం మురహరి అతన్ని మరొక ఆసుపత్రికి పంపడంతో అక్కడ చికిత్స పొందుతూ ఆ వ్యక్తి మృతి చెందాడు. ఆర్.ఎం.పి వైద్యుడు నిర్లక్ష్యం వల్లనే సదరు వ్యక్తి మృతి చెందాడని ఆరోపిస్తూ బంధువులు ఆందోళనకు దిగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు విచారణ జరుగుతున్న క్రమంలో ఆర్ఎంపి వైద్యుడు మురహరికి సరైన ధ్రువపత్రాలు లేవని ఇదే ఆసరాగా చేసుకున్న అల్వాల్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ రాఘవేందర్ రెడ్డి తనకు పది లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు బంధువులు ఆరోపించారు. తనకు డబ్బులు ఇస్తే కేసు నమోదు చేయాలని హామీ ఇవ్వడంతో ఐదు లక్షలకు బేరం కుదిరినట్లు బంధువులు చెప్పారు. అనంతరం లక్షా 50 వేల రూపాయలు ఎస్ఐ రాఘవేందర్ రెడ్డికి అందజేసినట్లు కుటుంబ సభ్యులకు ఆర్.ఎం.పి డాక్టర్ మురహరి గౌడ్ చెప్పినట్లు తెలిపారు. మిగిలిన డబ్బుల కోసం ఎస్సై వేధింపులు ఎక్కువ కావడంతో మెదక్ జిల్లాలోని ఆయన స్వగ్రామంలో ఆర్ఎంపి మురహరి విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై డబ్బుల కోసం వేధింపులకు గురి చేయడం మూలంగానే మురహరి ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని బంధువులు డిమాండ్ చేశారు.

## ఆదిలాబాద్ జిల్లాలో స్కూల్స్‌టైమింగ్స్‌లో మార్పులు..

**ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్**




**ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లాలో పాఠశాలల టైమింగ్స్ మారాయి. జిల్లాలో చలి తీవ్రత కొనసాగుతున్న నేపథ్యంలో పాఠశాల సమయాల్లో మార్పులు చేస్తూ జిల్లా కలెక్టర్ రాజర్షి షా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ మార్పులు అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు పాఠశాల సమయాలను సవరించి, ఉదయం 9.40 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కొనసాగేలా నిర్ణయించారు. ఈ మార్పులు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాథమిక, అప్పర్ ప్రైమరీ, హై స్కూళ్లకు వర్తిస్తాయని పేర్కొన్నారు. అన్ని మండల విద్యా శాఖ అధికారులకు, ప్రభుత్వ, ఎల్బీ, కేఏజీబీవీ, మోడల్ హై స్కూళ్లు, అలాగే ప్రైవేటు విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు ఈ ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మార్గదర్శకాలను పాటించకపోతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని, పాఠశాల సమయాల మార్పుల అమలును విద్యాశాఖ పర్యవేక్షించనుందని కలెక్టర్ స్పష్టం చేశారు .

# మూడో డిస్కం రెడీ....

**హైదరాబాద్, డిసెంబర్ 18 :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపరచడానికి, పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి మూడో డిస్కం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే ఉన్న రెండు డిస్కంలపై భారాన్ని తగ్గించి, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే దీని లక్ష్యం. ఈ కొత్త డిస్కం ప్రభుత్వ విద్యుత్ రంగాన్ని సంస్కరించడంలో సహాయపడుతుంది. త్వరలోనే ఇది ఏర్పాటు కానుందని సమాచారం.తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర అభివృద్ధికి అనేక సంస్కరణలు, నిర్ణయాలు తీసుకుంటున్న రేవంత్ సర్కార్.. ప్రజల సంక్షేమం కోసం కూడా పలు పథకాలు ప్రారంభించింది. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతు భరోసా, రైతు రుణమాఫీ వంటి పథకాలు అమలు చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో తాజాగా రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మూడో డిస్కం ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.తెలంగాణ ప్రభుత్వం మరో సంచలన



నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మూడో డిస్కం ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం తెలంగాణలో రెండు విద్యుత్ పంపిణీ సంస్థలు ఉన్నాయి. వీటికి తోడుగా.. మూడో డిస్కం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్రంలోని విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని అంటున్నారు.ప్రస్తుతం తెలంగాణలో ఉన్న ఈ 2 డిస్కంల పరిధి చాలా ఎక్కువగా ఉండటమే కాక.. విద్యుత్ డిమాండ్ కూడా భారీగా పెరగడం వల్ల ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మార్గదర్శకాలు విడుదల చేసింది. ప్రస్తుతం టీఎస్ఎస్‌పీడీసీఎల్ టీఎస్ఎన్‌పీడీసీఎల్ ద్వారా విద్యుత్ పంపిణీ జరుగుతోంది. త్వరలోనే వీటి సరసన మరో డిస్కం చేరనుంది.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. పేదల ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తుతో పాటు.. వ్యవసాయం, ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలకు ఉచిత విద్యుత్ సరఫరా వంటి పథకాలను ప్రవేశపెట్టింది. వీటి వల్ల.. ప్రస్తుతం ఉన్న టీఎస్ఎస్‌పీడీసీఎల్, టీఎస్ఎన్‌పీడీసీఎల్ డిస్కంలపై ఆర్థిక భారం పెరిగింది.దీన్ని తగ్గించడంతోపాటు.. ప్రభుత్వ విద్యుత్ రంగాన్ని సంస్కరించడం కోసం మూడో డిస్కం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న సదరన్, నార్తర్న్ డిస్కంస్ తో పాటు త్వరలోనే ఏర్పాటు చేయబోతున్న ఈ కొత్త డిస్కం పనిచేయనుంది. మూడో డిస్కం ఏర్పాటు వల్ల విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఆర్థిక సమస్యలు తగ్గడమే కాక.. రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అవకాశం లభిస్తుందని అంటున్నారు.

## ఖమ్మంలో గంజాయి లేకుండా చేస్తా: మంత్రి తుమ్మల

**ఖమ్మం, డిసెంబర్ 18:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లాకు అడిగినవన్నీ ఇస్తున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈరోజు (గురువారం) ఖమ్మం నగరంలో సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కబ్జా చేసే వాళ్ళని, గొడవలు చేసే వాళ్ళని, గంజాయి బ్యాచ్‌లను ఖమ్మంకు దూరం చేయమని ప్రజలు అడిగినట్లు తెలిపారు. ఖమ్మంలో గంజాయి కూడా లేకుండా చేస్తా అని.. కబ్జాలు కూడా లేకుండా చేస్తానని మాట ఇచ్చానని అన్నారు. గతంలో కాంగ్రెస్ నాయకుల మీద ఒక్కొక్కరిపై 100 కేసులు పెట్టారని గుర్తుచేశారు. కాంగ్రెస్ కార్యకర్త ప్రతి ఒక్కరికి అండగా నిలబడతా అని హామీ ఇచ్చారు. స్కూల్స్, కాలేజ్ చుట్టు పక్కల గంజాయి అమ్ముతున్నారని మండిపడ్డారు. గంజాయి విషయంలో కఠిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ప్రజలకు ఉపయోగపడే పని ఏదైనా చేస్తా అని స్పష్టం చేశారు.



ఖమ్మం పట్టణంలో 5 లక్షల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారని అన్నారు. నాయకులు వెంట పడి మరీ పనులు చేపించుకోవాలని... లేకపోతే ప్రజలు మొహాలు చూడరన్నారు. ప్రజల మనసులు గెలవాలన్నారు. గంజాయి అమ్మే వాళ్ళని, కబ్జా చేసే వాళ్ళని ఎవరు గెలిపించరని అన్నారు. రాజకీయాలకతీతంగా పార్టీలకు అతీతంగా అభివృద్ధి సంక్షేమం కొనసాగిస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## హుస్నాబాద్ పట్టణంలో మంత్రి పొన్నం పర్యటన

**హుస్నాబాద్:** మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం నాడు హుస్నాబాద్ పట్టణంలో స్థానిక నాయకులు కార్యకర్తలతో కలిసి బైక్ నడుపుతూ మున్సిపాలిటీ జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు పరిశీలిచారు. ముందుగా అంబేద్కర్ భవన్ ను పరిశీలించారు.. అక్కడ జరుగుతున్న సీసీ రోడ్లు డ్రైనేజీ పనులను పర్యవేక్షించి ఇప్పటికే పట్టణంలో శంకుస్థాపన చేసుకున్న రోడ్లు ,డ్రైనేజీ లు ,కమ్యూనిటీ హాల్ లు, జంక్షన్ ల అభివృద్ధి పనులను పరిశీలించడం జరిగింది అభివృద్ధి పనులపై మున్సిపల్ కమిషనర్,ఇతర అధికారులకు పలు సూచనలు చేసారు.పెండింగ్ పనులు వేగవంతం చేయాలని సూచించి .. ఇంకా పట్టణంలో ఎక్కడెక్కడ రోడ్లు ,డ్రైనేజీ పనులు అవసరమున్నాయో ఆరా తీసారు. స్థానిక ప్రజలతో మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకుని ఎల్లమ్మ చెరువు సుందరీకరణ అభివృద్ధి పనులు,జంక్షన్ ల సుందరీకరణ పనుల పై ఆరా తీసారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ నీ రాష్ట్రంలో ఆదర్శంగా ఉండేలా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని మంత్రి అన్నారు.

## సూక్మా జిల్లాలో ఎదురు కాల్పులు...



**ములుగు:** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా గొల్లపల్లి అటవీ ప్రాంతంలో గురువారం ఉదయం నుండి ఎదురు కాల్పులు జరుగుతున్నా యి,భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోలు మృతి చెందినట్లు తెలిసింది, మృతులు మహిళ ఉన్నట్టు సమాచారం. ఘటనా స్థలం నుంచి భారీగా మందు గుండు సామాగ్రి, ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ఇరుపక్షాల మధ్య ఇంకా ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి, ఈ సంఘటన సంబంధించిన మరింత సమాచారం తెలియవలసి ఉంది.

# :జడ్జిమెంట్‌పై సస్పెన్స్.. ఆ ఆలోచనలో స్పీకర్..!

**హైదరాబాద్, డిసెంబరు18 :** ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై ) ఇవాళ(గురువారం) తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీర్పు చెప్పనున్నారు. ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలె యాదయ్య, సంజయ్‌లపై తీర్పు ఇవ్వనున్నారు స్పీకర్. అయితే, దానం నాగేందర్, కడియం శ్రీహరి అనర్హత పిటిషన్లపై ఇంకా విచారణ పూర్తి కాలేదని తెలుస్తోంది. స్పీకర్ నోటీసులకు జవాబు ఇచ్చేందుకు కడియం శ్రీహరి, దానం నాగేందర్ మరింత గడువు కోరారు. ఈ క్రమంలో ఐదుగురు ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో జడ్జిమెంట్‌పై సస్పెన్స్ కొనసాగుతోంది. నిన్న(బుధవారం) ఐదుగురు ఫిరాయింపు ఎమ్మెల్యేలపై తీర్పు ఇచ్చారు స్పీకర్. మరో ముగ్గురు ఎమ్మెల్యేల కేసులో ఇవాళ జడ్జిమెంట్ ఇవ్వాలని స్పీకర్ నిర్ణయించారు. ఇప్పటి వరకు పిటిషనర్లకు స్పీకర్ కార్యాలయం నుంచి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు . ఈ నేపథ్యంలోనే స్పీకర్ నోటీసులకు బుధవారం రాత్రి వివరణ ఇచ్చారు కడియం శ్రీహరి. ఆయన ఇచ్చిన సమాధానంపై రేపటి(శుక్రవారం) వరకు కౌంటర్ దాఖలు చేయాలని పిటిషనర్ వివేకానంద గౌడ్‌కు నోటీసులు ఇచ్చారు స్పీకర్. అయితే, ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై రేపటితో సుప్రీంకోర్టు గడువు ముగియనుంది. ఈ క్రమంలోనే ఐదుగురు ఎమ్మెల్యేల కేసులో ఒకేసారి జడ్జిమెంట్ ఇద్దామనే ఆలోచనలో స్పీకర్ ఉన్నట్లు సమాచారం.

# శాంతి ప్రేమ కరుణకు ప్రతీక క్రిస్టమస్

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**కొత్తగూడెం డిసెంబర్ 18 (స్కై న్యూస్ ):**క్రిస్టమస్ పండుగ శాంతి, ప్రేమ, కరుణ, త్యాగం వంటి మానవీయ విలువలకు ప్రతీక అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో కార్యాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రిస్టమస్ వేడుకలకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి ఉద్యోగులు, సిబ్బందికి క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులు శాంతాక్లాజ్, వేషధారణలతో పాటు నృత్యాలు, పాటలు, సందేశాత్మక ప్రదర్శనలు చేసి అందరినీ అలరించారు. క్రిస్టమస్ పండుగ స్ఫూర్తిని ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ కార్యక్రమాలు వేడుకలకు ప్రత్యేక శోభను చేకూర్చాయి. అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ, క్రిస్టమస్ పండుగ శాంతి, సంతోషం, ప్రేమ, కరుణ, త్యాగం వంటి విలువలను సమాజానికి గుర్తు చేసే గొప్ప పండుగ అని అన్నారు. యేసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆదర్శప్రాయమని, వాటిని ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో





ఆచరించాలని సూచించారు. పరస్పర సహకారం, సహనం, సోదరభావంతో జీవించడమే క్రిస్టమస్ పండుగ యొక్క అసలైన సందేశమని తెలిపారు. క్రిస్టమస్ పండుగను క్రైస్తవ సోదరులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా, ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ క్రిస్మస్ ప్రతి ఇంట్లో ప్రేమ, సంతోషం, శాంతి, సిరిసంపదలు వెల్లివిరియాలని కోరారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ఐక్యతతో కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ అధికారి సంజీవరావు, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణ లత లెనీనా, టేకులపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సులోచన రాణి, టీజీవోస్ జిల్లా అధ్యక్షులు సంఘం వెంకట పుల్లయ్య, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు అమరనేని రామారావు జిల్లా అధికారులు, పాస్టర్లు ప్రభుదాస్, తిమోతి, ఐడీఓసీ కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొని క్రిస్టమస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# విద్యుత్ షాక్ తో మృతి చెందిన వారికి ప్రమాద బీమా అందజేసిన ఎమ్మెల్యే జి, మధుసూదన్ రెడ్డి

**చిన్న చింతకుంట దేవరకద్ర డిసెంబర్ 18 (స్కై న్యూస్):** చిన్న చింతకుంట మండలం ఫర్దిపూర్ గ్రామానికి చెందిన కమలన్న ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో మృతి చెందడంతో ప్రమాద బీమా కింద ఎమ్మెల్యే జి మధు రెడ్డి గతంలో 4లక్షల 50 వేల రూపాయల చెక్ ను, ప్రస్తుతం 50 వేల రూపాయల చెక్కును కమలన్న సతీమణి పుష్ప కి అందజేశారు. అనంతరం కౌకుంట్ల మండలం ముచ్చింతల గ్రామంలో పెద్ద గొల్ల చెంద్రన్న ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో మృతి చెందడంతో ప్రమాద బీమా కింద 50 వేల రూపాయల చెక్కును, విద్యుత్ అధికారుల సమక్షంలో వారి కుటుంబ సభ్యులకు అందజేసిన ఎమ్మెల్యే, ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లు, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు మండల నాయకులు, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.




# ఉచిత కంటి ఆపరేషన్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి....

**నాగర్ కర్నూల్ డిసెంబర్ 18 (స్కై న్యూస్)** జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ కార్యాలయంలోని 102 రూములో ఈనెల 23న నిర్వహిస్తున్న ఉచిత కంటి ఆపరేషన్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆప్తాలమిక్ అధికారి కొత్ర బాలాజీ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని ఈ శరీరంలో రోగులకు ప్రత్యేక కంటి పరీక్షలు సాధారణ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని లయన్ రామిరెడ్డి కంటి ఆసుపత్రిలో వీటిని నిర్వహించడం జరుగుతుందని అన్నారు. రోగులు ముందుగా డిపి షుగర్ పరీక్షలు చేయించుకుని రిపోర్టు వెంట తీసుకొని రావాలని ఆధార్ కార్డు రేషన్ కార్డు ఏదైనా ఒక గుర్తింపు కార్డు జిరాక్స్ తో ఫోన్ నెంబర్ తమ వెంట తీసుకొని రావాలని ఆయన వివరించారు ఇతర వివరాలకు 9440876556 మరియు 7386940480 నెంబర్లను సంప్రదించాలని కోరారు



# ప్రజల సహకారంతోనే ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి

**జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**

**నారాయణపేట డిసెంబర్ 18 (స్కైన్యూస్)** నారాయణపేట జిల్లాలో నిర్వహించిన గ్రామపంచాయితీ ఎన్నికలు మూడు విడతలుగా పూర్తిగా శాంతియుత వాతావరణంలో ప్రజల సహకారంతో విజయవంతంగా ముగిశాయి అని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. ప్రజల సహకారం, అధికారుల సమన్వయం, పోలీసు విభాగం కర్తవ్యనిష్ఠతో పనిచేయడం ఈ ఎన్నికల విజయానికి ప్రధాన కారణమని తెలిపారు. ఎన్నికల భద్రత కోసం అదనపు ఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, నారాయణపేట జిల్లా సిబ్బందితోపాటు ఇతర జిల్లాల నుండి వచ్చిన సిబ్బందితో సహా అందరి సమన్వయంతో విడతల వారీగా విధులు నిర్వర్తించినట్లు తెలిపారు. అందరినీ ఎస్పీ గారు ప్రత్యేకంగా అభినందించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన రోజునుంచే జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణకు కఠిన చర్యలు చేపట్టినట్లు వివరించారు. జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన 06 చెక్‌పోస్టుల్లో వాహనాలను క్షుణ్ణమైన తనిఖీలు నిర్వహించడంతో పాటు గ్రామాలలో మరియు రహదారులపై ప్రత్యేక పోలీసు టీములతో విస్తృతంగా తనిఖీలు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ తనిఖీల్లో రూ. 4.62,500/- నగదు, 730 లీటర్ల విలువైన మద్యం దాని విలువ 4,11,685 రూపాయలు ఉంటుందని, ఇతర విలువైన వస్తువులు చీరలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, పిడిఎస్, రైస్ మొత్తం 10,54,000/- రూపాయల విలువ గల వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు




పేర్కొన్నారు, గుట్కాలు 86,039/- వివిధ చట్టవిరుద్ధ చర్యలకు సంబంధించి ఎలక్షన్, మద్యంకి సంబంధించి 88 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అదనంగా గత ఎన్నికల్లో ఘర్షణలకు కారణమైన వ్యక్తులు, రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తులపై ముందస్తు చర్యలుగా 1162 మందిని బైండోవర్ చేసినట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో చలి, పగలు, రాత్రి అన్న తేడా లేకుండా కర్తవ్యదీక్షతో పనిచేసిన పోలీసు సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలు, వివిధ శాఖల అధికారులు, పోలీసు విభాగం అందరూ సమన్వయంతో పనిచేయడంతోనే ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు.

# రక్తదానంతో ప్రాణ దానం - సంగాల అయ్యపు రెడ్డి..

**గద్వాల జిల్లా కేంద్రంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు..**

**జోగులాంబ గద్వాల , డిసెంబర్ 18(స్కై న్యూస్):** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ నందు ఇండియా రెడ్ క్రాస్ సొసైటీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సంగాల అయ్యపు రెడ్డి సొసైటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు... ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా గవర్నమెంట్ బ్లడ్ బ్యాంకు నందు రక్త యూనిట్ల కొరత ఉందని సమాచారం అందడంతో గవర్నమెంట్ బ్లడ్ బ్యాంకు సహకారంతో అత్యవసర స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న తోటి వారిని కాపాడడంలో రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తారన్నారు. రక్త నేత్ర అవయవ దానాల పై ప్రజలు అపోహలు విడనాడాలని అయ్యపు రెడ్డి పేర్కొన్నారు... ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ చైర్మన్ ఎం.డి. తాహేర్, కోశాధికారి ధనలక్ష్మి, ఇసి మెంబర్లు అక్బర్ బాషా, రవి, అప్సర్ భాష, పెదొడ్డి నల్లారెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్, సుధాకర్, డాక్టర్ క్రాంతి కుమార్, డాక్టర్ మోహన్ రావు, కరాటే శ్రీహరి, డిటిఎఫ్ ప్రభాకర్, అతికూర్ రెహమాన్, ధరూర్ రవి, మహేష్ నాయుడు, రాకేష్, రాజు వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు..




# నారాయణపేట జిల్లా ఇంచార్జీ కలెక్టర్ గా సంచిత్ గంగ్వర్



**నారాయణపేట డిసెంబర్ 18: (స్కైన్యూస్):**నారాయణపేట జిల్లా ఇంచార్జీ ఫుల్ అడిషనల్ చార్జి కలెక్టర్ గా సంచిత్ గంగ్వర్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృ ష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఈ నెల 17 నుంచి వచ్చే నెల 11 వరకు లాంగ్ లీవ్ పెట్టడంతో జిల్లా ఇంచార్జీ కలెక్టర్ గా పూర్తి స్థాయి అదనపు బాధ్యతల ను స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్ కు అప్పగిస్తూ సీ.ఎస్. ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 17 నుంచి వచ్చే నెల జనవరి 11 వరకు జిల్లా ఇంచార్జీ కలెక్టర్ గా సంచిత్ గంగ్వర్ బాధ్య తలు నిర్వర్తించనున్నారు.

# 150 ఉద్యోగాల ఖాళీలకు జాబ్ మేళా..

**ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్**



**కొత్తగూడెం డిసెంబర్ 18 (స్కై న్యూస్ ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లోని నిరుద్యోగ యువతీ యువకులకు ఎస్బీఐ లైఫ్ ,కొత్తగూడెం వారి సంస్థ నందు పనిచేయుటకు, మొత్తం (150) ఖాళీలకు గాను ఉద్యోగాలు కలిపించేందుకు, ఉపాధి కల్పనా శాఖా ఆధ్వర్యంలో ఈ నెల 20 డిసెంబర్ శనివారం నాడు జాబ్ మేళ, గవర్నమెంట్ డిగ్రీ కళాశాల పాల్వంచ, నందు నిర్వహించబడుతుంది. కావున ఈ సదావకాశాన్ని 18 నుండి 40 సంవత్సరములగల నిరుద్యోగ 10వ /ఇంటర్ /ఏనీ డిగ్రీ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధికల్పన శాఖాధికారి కొండపల్లి శ్రీరామ్ తెలియచేయుచున్నారు. జీతము 25000 రూపాయలు కావున అభ్యర్థులు ఉదయం 10.00 గంటల నుంచే ఇంటర్వ్యూ కొరకు సర్టిఫికేట్స్ జిరాక్స్ లతో వచ్చి తమ పేరు నమోదు చేసుకోగలరు. సంప్రదించవలసిన నెంబర్ కీర్తి వాణి హెచ్ ఆర్ ,సెల్ నెంబర్: 9652728006. సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చు అని జిల్లా ఉపాధికల్పనశాఖాధికారి కొండపల్లి శ్రీరామ్ తెలియ చేశారు

# ఫార్మాసిస్టుల కొరతతో రోగులకు అవస్థలు....

**అందని ద్రాక్షగా మెరుగైన వైద్యం**

**మందుల సరఫరాలో జాప్యం**

**నాగర్ కర్నూల్ డిసెంబర్ 18( స్కై న్యూస్)** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఫార్మసిస్టుల కొరత వల్ల రోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రి స్థాయి పెంచిన సమస్యలను పరిష్కరించడంలో అటు పాలకులు ఇటు అధికారులు విఫలం కావడం వల్ల రోగులు మందుల కోసం అగచాట్లు పడుతున్నారు. జిల్లా ఆస్పత్రిలో 12 మంది ఫార్మసిస్టులు పనిచేయవలసి ఉండగా ముగ్గురు సిబ్బంది మాత్రమే ఉండటం వల్ల వారిపై పని భారం పడడం మందుల పంపిణీలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిసింది. ముగ్గురిలో ఇద్దరు డిప్యూటేషన్ పై ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు గతంలో ప్రజాప్రతినిధులకు ఫార్మసిస్టుల సమస్యను పరిష్కరించాలని ఆసుపత్రి అధికారులు కోరినప్పటికీ చర్యలు తీసుకోవడంలో సిబ్బంది నియామకంలో నిర్లక్ష్యం వల్ల ప్రతిరోజు రోగులు మందుల కోసం గంటల తరబడి వేచి చూడవలసిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం ద్వారా సరఫరా అవుతున్న మందుల తోపాటు రోగులకు అవసరమయ్యే మందులను కొనుగోలు చేసేందుకు కాంట్రాక్టర్లు నియమించినప్పటికీ ఇతను హైదరాబాదుకు చెందిన వ్యక్తి కావడంతో మందుల సరఫరా లో కూడా జాప్యం




జరుగుతుందని తెలిసింది. ఇక్కడి ఆసుపత్రిలో వైద్యులు కూడా విధుల నిర్వహణ పట్ల కొంత నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నట్లు అనేక సందర్భాలలో ఆరోపణలు వినిపించిన వారిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు పూర్తిగా వైఫల్యం కావడంతో ఇక్కడ పనిచేసే అనేకమంది వైద్యులు ప్రైవేట్ ఆస్పత్తుల నిర్వహణతో పాటు ఇతరత్రా ఆసుపత్రులలో విధులు నిర్వహించేందుకు మొగ్గు చూపడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందని ద్రాక్షగా మారింది. అత్యవసర పరిస్థితులలో కూడా మెరుగైన వైద్యం అందడం లేదని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు వెంటనే ఆసుపత్రి నిర్వహణపై ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

# అభివృద్ధిని చూసి బిజెపి నీ ఆదరించారు

**బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ**

**ఉట్కూర్ సర్పంచ్ కు ఘన సన్మానం**

**నారాయణపేట డిసెంబర్ 18: (స్కైన్యూస్)** ఉట్కూర్ మండల కేంద్రం పంచాయితీ నీ బిజెపి అభ్యర్థులు ఘన విజయం సాధించిన సందర్భంగా సర్పంచ్ గా ఎన్నికైన ఎం.రేణుకభరత్ ను గురువారం రాష్ట్ర బిజెపి సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగు రావు నామాజీ,జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్,జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి శ్యామ్ ,జిల్లా కోశాధికారి సిద్ధి వెంకట్ రాములు, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు,జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మదన్, నామాజీ,ఓబీసీ మోర్చ జిల్లా మాజీ అధ్యక్షుడు మిర్చి వెంకటయ్య,ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కృష్ణ శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాగురావు నామాజీ మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వం నిధులతోనే పల్లెల్లో ప్రగతి జరుగుతుందనీ నారాయణపేట జిల్లా లో బిజెపి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను ఆదరించి మునుపెన్నడూ లేనివిధంగా 49 మంది సర్పంచులను, 2వందలకు పైగా వార్డు సభ్యులను గెలిపించారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివాళా తీసిందని గ్రామాలకు నయా పైసా నిధులు ఇచ్చే అవకాశం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఉచిత



బియ్యం,ప్రధాని ఆవాస్ యోజన,ప్రధాన మంత్రి సడక్ యోజన,గ్రామీణ ఉపాధి హామీ పథకం,ఇంటింటికీ మెరుగు దొడ్లు,ఉచిత గ్యాస్ కనెక్షన్, స్వేచ్ఛ భారత్ పథకాల ద్వారానే పల్లెల్లో ప్రగతి జరుగుతుందనీ అన్నారు. ప్రజలు బిజెపి పై నమ్మకంతో బిజెపి అభ్యర్థులను ఆదరించారని అన్నారు. ఈ ప్రగతి కొనసాగుతుందని రానున్న ఎన్నికల్లో బిజెపి మరింత బలపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# పేట జిల్లాలో రోడ్ల అభివృద్ధికి నిధులు ఇవ్వండి..

**కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ కు ఎంపీ డీకే అరుణ వినతి**

**నారాయణపేట డిసెంబర్ 18: (స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా లో రోడ్ల అనుసందానం రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని పాలమూరు ఎంపి డి కే అరుణ కేంద్ర గ్రామీణ అభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తన ఛాంబర్ లో కలిసి విన్నవించారు.



మహబూబ్ నగర్ పార్లమెంట్ పరిధిలోని నారాయణపేట జిల్లాలో వివిధ గ్రామాలలో కనెక్టివిటీ రోడ్ల అభివృద్ధి పనులకు సంబంధించి వినతి పత్రం అందజేసి, రోడ్ల కనెక్టివిటీ అభివృద్ధి పనుల ప్రాధాన్యాన్ని వివరించారు. వినతిపత్రం స్వీకరించిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సానుకూలంగా స్పందించారు. నారాయణపేట జిల్లా మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గంలో కనెక్టివిటీ లేని గ్రామాలను అనుసంధానం చేయుట కోసం పెండింగ్లో ఉన్న పనులకు ఆమోదం కోసం ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కొరకుకృషి చేయాలని కోరారు. నారాయణపేట జిల్లా పరిధిలో పీఎంజీఎస్వై-4 కింద 24 గ్రామ పంచాయతీలను గుర్తించి గతంలో ప్రతిపాదన సమర్పించడం జరిగిందనీ వివరించారు. వీటిలో 13 గ్రామాలకు కనెక్టివిటీ రోడ్లకు ఇప్పటికే డీపీఆర్ల తయారీ కోసం ఎన్ఆర్ఐడీఏ ఆమోదించిందని ఎంపి తెలిపారు. మిగిలిన 11 గ్రామా లకు సంబంధించి కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆమోదం పెండింగ్ లో పెట్టిందని అన్నారు. మక్తల్ నియోజకవర్గం వెనుకబడిన ప్రాంతం,రోడ్ల కనెక్టివిటీ లేకపోవడం వల్ల ఆయా గ్రామాలలో నివసించే ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ ప్రాంతం యొక్క సామాజిక, ఆర్థిక అభివృద్ధికి రోడ్ల కనెక్టివిటీ చాలా కీలకం అన్నారు. అందువల్ల మిగిలిన 11 గ్రామాలకు వీలైనంత త్వరగా ఎన్ఆర్ఐడీఏ ఆమోదం తెలపాలని, మక్తల్ నియోజకవర్గంలోని మొత్తం 24 గ్రామాలకు కనెక్టివిటీ రోడ్లకు సంబంధించిన డిపిఆర్ తయారీని ప్రారంభిం చాలని, సంబంధిత అధికారు లను ఆదేశించాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ను ఎంపీ డీకే అరుణ కోరారు.

వార్తాతరంగాలు

శుక్రవారం 19 డిసెంబర్ 2025

## జర్నలిస్ట్ తక్కళ్ళపల్లి రాజేందర్ కుటుంబాన్ని పరామర్శించిన టిడబ్ల్యూజెఎఫ్ యూనియన్ నాయకులు



తలకొండ పల్లి మండల సీనియర్ జర్నలిస్టు కీర్తిశేషులు తక్కళ్ళపల్లి రాజేందర్ కుటుంబాన్ని గురువారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) నాయకులు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తక్కళ్ళపల్లి రాజేందర్ స్వగృహానికి వెళ్ళిన టిడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గణేష్ శేరీబాయి, మైల సైదులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి ఖాజాపాషా కేపీ, జిల్లా ప్రచార కార్యదర్శి నరసింహ రెడ్డి, షాద్ నగర్ డివిజన్ అధ్యక్షులు రాఘవేందర్ గౌడ్, తలకొండపల్లి జర్నలిస్టులు శంకర్, తిరుపతయ్య, శ్రీను, అమన్ గల్ విలేకరి శేఖర్ తదితరులు రాజేందర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. తండ్రి కృష్ణయ్య,రాజేందర్ సతీమణి రమాదేవి, కూతురు జెస్సికా, కుమారులను వారు పరామర్శించారు. రాజేందర్ జర్నలిస్టు వృత్తిలో ఎంతో మెరుగైన పాత్ర పోషించారని ఈ సందర్భంగా ఆయన సేవలను టిడబ్ల్యూజేఎఫ్ కొనియాడింది.రాజేందర్ తెలంగాణ ఉద్యమంలో కూడా కీలక భూమిక నిర్వహించారని, కల్వకుర్తి నియోజకవర్గంలో అనేకమందికి తలలో నాలుకలా వ్యవహరించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాజేందర్ కుటుంబానికి టిడబ్ల్యూజేఎఫ్ సంఘం అండగా నిలుస్తుందని తెలిపారు. విద్య, వైద్య తదితర విషయాలలో అతని కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. జర్నలిస్టుకు రావాల్సిన ప్రభుత్వం సంక్షేమ నిధి తదితర విషయాలలో ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించేందుకు కూడా యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు. ఎంతోమంది నాయకులతో ప్రజాప్రతినిధులతో రాజేందర్ కలిసి పనిచేసిన సందర్భాలు ఉన్నాయని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా అత్యంత సన్నిహితంగా ఉండేవారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాజేందర్ కుటుంబానికి పూర్తిస్థాయిలో అండగా నిలుస్తామని అధ్యక్ష కార్యదర్శులు తెలిపారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ తరపున చెక్ ను అందజేశారు

## జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో షాబాద్ డిప్యూటీ సర్పంచ్ కు సన్మానం



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ డిసెంబర్ 18:**-రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు గందె సురేష్ ఆధ్వర్యంలో షాబాద్ డిప్యూటీ సర్పంచ్ గా ఎన్నికైన దండు రాహుల్ గుప్తాను ఘనంగా సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మహాసభ అధ్యక్షులు గందె సురేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్య యువత రాజకీయాల్లో రాణించాలని దానికి నిదర్శనంగా రాహుల్ గుప్తాను కొనియాడారు షాబాద్ అభివృద్ధికి రాహుల్ గుప్తా పాటుపడాలని సూచించారు ఈ కార్యక్రమంలో షాబాద్ మండల అధ్యక్షులు సాయిరాం, ఫరూక్ నగర్ మండలాధ్యక్షులు ఎల్కుర్తి నారాయణ, మాజీ మండలాధ్యక్షులు హన్మరి మురళీధర్, జిల్లా మెంబర్షిప్ కమిటీ చైర్మన్ మల్పెది శ్రీనివాస్, జిల్లా యువజన సంఘం కోశాధికారి సామాజికవేత్త నీల రవీందర్, జిల్లా కమిటీ మెంబర్లు,బండారు శంకర్, గా జవాడ యశ్వంత్ రాజ్, శివ కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు

## బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన తుర్కలపల్లి వార్డు సభ్యులు



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ డిసెంబర్ 18:-** రంగారెడ్డి జిల్లాలోని కేశంపేట మండలం లేమామిడి గ్రామపంచాయతీ ఆమ్లెట్ విలేజ్ తుర్కలపల్లి గ్రామ బిఆర్ఎస్ వార్డ్ మెంబర్ వినోద్ కుమార్ ఆయన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో గురువారం లాంఛనంగా చేరారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కాంగ్రెస్ కండువాతో ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కన్నతల్లి లాంటిదని ఈ పార్టీ అందరికీ సమాన న్యాయం చేస్తుందని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు గ్రామాలు అభివృద్ధి పథంలో నడవాలంటే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సహకరిస్తుందని ఆయన అన్నారు.

## శంషాబాద్ లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నాయకుల ధర్నా





**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ డిసెంబర్ 18** :-రంగారెడ్డి జిల్లా శంషాబాద్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గాంధీ కుటుంబాన్ని వేధించడమే నేషనల్ హెరాల్డ్ కేసు లక్ష్యం అని కేవలం రాజకీయ ప్రతీకార దృక్పథంతోనే దీనిని దాఖలు చేశారన్నారు కోర్టు తీసుకున్న ఈ నిర్ణయం నరేంద్ర మోడీ, అమిత్ షాలకు చెంపదెబ్బలాంటిదన్నారు భవిష్యత్తులో ప్రజలను వేధించబోమని పేర్కొంటూ వారు రాజీనామా చేయాలి అని ఆయన డిమాండ్ చేశారు.అలాగే నేషనల్ హెరాల్డ్ కేసు ఓ తప్పుడు కేసుగా ఎమ్మెల్యే శంకర్ అభివర్ణించారు. కేవలం రాజకీయ ప్రతీకారం, దురుద్దేశంతోనే ఈ కేసును కొనసాగించారని ఆయన ఆరోపించారు 1938లో స్వాతంత్ర్య సమరయోధులు ఈ (నేషనల్ హెరాల్డ్) పత్రికను ప్రారంభించారనీ దీనిని బిజెపి ప్రభుత్వం ఇప్పుడు మనీలాండరింగ్ వంటి విషయాలతో ముడిపెట్టి అప్రతిష్టపాల్జేందుకు ప్రయత్నిస్తోందన్నారు నిజం ఏమిటంటే ఈ కేసులో ఏమీ లేదనీ అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ నాయకులను వేధించడమే గాంధీ కుటుంబాన్ని అవమానించడమే బీజేపీ ఈ కేసును ఒక సమస్యగా మార్చడానికి ప్రయత్నిస్తోంది అని శంకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకోవడానికి ఈడి ద్వారా కేసుల్ని పెట్టిస్తుందనీ కానీ ఢిల్లీ కోర్టు తీసుకున్న నిర్ణయంతో తీర్పు న్యాయానికి అనుకూలంగా వచ్చిందన్నారు. సత్యం గెలిచిందనీ కోర్టు తీర్పును హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నామని ఎమ్మెల్యే శంకర్ అన్నారు ఈ ధర్నాకు మాజీ పిప్పి శివశంకర్ గౌడ్, తదితర నియోజకవర్గ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి దినోత్సవ సందర్భంగా

# వెల్ బేబీ షో కార్యక్రమం

### ముఖ్య అతిథిగా కొత్తగూడెం ఏరియా సేవా అధ్యక్షురాలు శ్రీమతి జి. మధురవాణి








సింగరేణి డిసెంబర్ 18 (స్కై న్యూస్ ):కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం నందు నందు జరుగు సింగరేణి దినోత్సవ వేడుకలు- 2025 ను పురస్కరించుకొని ఉద్యోగులు వారి కుటుంబ మహిళల కొరకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగానే కొత్తగూడెం ఏరియా లో పనిచేస్తున్న ఉద్యోగస్తుల పిల్లలకు వెల్ బేబీ షో నిర్వహించారు. గురువారం ఉదయం 9.30 గంటలకు రుద్రంపూర్ డిస్పెంసరి నందు ఒకటి నుండి ఐదు సంవత్సరాల లోపు వయస్సు గల చిన్నారులకు వెల్ బేబీ షో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తగూడెం ఏరియా సేవా అధ్యక్షురాలు శ్రీమతి జి. మధురవాణి హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెల్ బేబీ షో కార్యక్రమం నిర్వహించుటకు ముఖ్య ఉద్దేశం చిన్నారుల యొక్క ఆరోగ్య స్థితిగతులను డాక్టర్ తో చూపించుకొని వారికి తగిన ఆహార అలవాట్లను పిల్లలు ఏ వయస్సు లో ఎంత బరువు ఉండాలి ఏ ఆహారం తీసుకోవాలి అను వాటిపై తెలుసుకొనుటకు ఈ వెల్ బేబీ షో కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ముఖ్యంగా చిన్నారులకు చిన్న వయసులో మొబైల్ ఫోన్లను అలవాటు చేయకూడదని తద్వారా వారి యొక్క మానసిక స్థితిపై ప్రభావం చూపి వారు మానసిక పరమైన వ్యాధులకు గురవుతున్నారని ఎక్కువ శాతం పిల్లలు ప్రస్తుత కాలంలో సెల్ ఫోన్ లకు ఎక్కువగా అలవాటు పడుతున్నందున వారికి సెల్ ఫోన్ లను దూరం పెట్టి ఫిజికల్ ఎక్సర్సైజ్ సంబంధించిన ఆటలను ఆడించాలని వెల్ బేబీ షో కార్యక్రమాన్నికి హాజరైన ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు తెలియజేశారు.ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు తేదీ.23 డిసెంబర్ మంగళవారం న కొత్తగూడెం ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయం లో జరిగే సింగరేణి దినోత్సవ వేడుకల నందు బేబీ కింగ్, బేబీ క్వీన్, ప్రిన్స్ %-% 1, ప్రిన్స్%-% 2, ప్రిన్సెస్ %-% 1, ప్రిన్సెస్ %-% 2 మొత్తం ఆరు (6) బహుమతులు అందజేయబడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా సేవా అధ్యక్షురాలు శ్రీమతి జి. మధురవాణి తో పాటు లేడీస్ క్లబ్ సెక్రెటరీ సునీత మురళి ఏజిఎం(పర్సనల్) జి. వి మోహన్ రావు, డివై పిఎం జి. హరీష్, సీనియర్ పిఓ మజ్జి మురళీ, సేవా సెక్రెటరీ వై అనిత,పర్సనల్ డిపార్ట్మెంట్ సిబ్బంది మహిళలు పాల్గొన్నారు.

# గాంధీ కుటుంబాన్ని... దెబ్బతీసేందుకే మోడీ కుట్రలు








**కార్పొరేట్ శక్తులకు కేంద్రం అండ.**

**దేశవ్యాప్త ఉద్యమాలకు సిద్ధం**

**నాగర్ కర్నూల్ డిసెంబర్ 18( స్కై న్యూస్)** మహాత్మా గాంధీ కుటుంబాన్ని దెబ్బ తీసేందుకు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని వాటిని తిప్పి కొట్టేందుకు పల్లె పల్లె నా ప్రజలను చైతన్యం చేసి దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హెచ్చరించారు గురువారం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకం నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్రలు చేస్తుందని నిరసిస్తూ జిల్లా కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి విజయ్ కుమార్ రెడ్డి అధ్యక్షత వహించగా ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005లో కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్న సమయంలో వలసలను నివారించేందుకు జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పార్లమెంటులో చట్టం చేసి ప్రారంభించడం జరిగిందని దానిని మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం గా పేరు పెట్టడాన్ని తట్టుకోలేక మోడీ ప్రభుత్వం దానిని నిర్వీర్యం చేసేందుకు రాష్ట్రాలపై భారం నెట్టేందుకు ప్రయత్నిస్తున్నదని దానిని తిప్పి కొడతామని హెచ్చరించారు. పార్లమెంట్లో చట్టం చేసి అన్ని రాష్ట్రాలలోని కూలీలకు ఉపాధి కల్పించేందుకు పూర్తిగా కేంద్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలిస్తే బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మద్దతు ఇస్తుందని ఆరోపించారు. దేశవ్యాప్త ఉద్యమాలకు ప్రజలను సన్నద్ధం చేసే బాధ్యత కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పునివ్వడాన్ని స్వాగతిస్తూ మోడీ ప్రభుత్వం ఇప్పటికైనా పేద ప్రజల పక్షాన నిలవాలని సూచించారు. హరిత విప్లవం తీసుకువచ్చేందుకు కేంద్రంలోని రాష్ట్రంలోని ప్రభుత్వాలు గతంలో పనిచేస్తే కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి మాత్రం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని రాబోయే అన్ని స్థానిక సంస్థల ఎన్నికలలో విజయం సాధించడంతోపాటు పార్లమెంటు శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని భీమా వ్యక్తం చేశారు. సమావేశంలో కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితి విజయ్ కుమార్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు హబీబ్ మాజీ ఎంపీపీలు కోటయ్య బండ పర్వతాలు దళిత ఉద్యమ నాయకులు వంకేశ్వరం నిరంజన్ ధర్మరాజు మాజీ జడ్పిటిసి మణెమ్మ తో పాటు ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు సంతోష్ హెూటల్ యాదయ్య తదితరులు ప్రసంగించగా మాజీ కౌన్సిలర్లు ముఖ్య నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు

# సర్పంచులను చంపింది మీరు కాదా కేటీఆర్..

### ఇరిగేషన్ బిల్లులు ఇచ్చి సర్పంచుల బిల్లులు పెండింగ్ లో పెట్టలేదా?

### మీరు బిల్లులు ఇవ్వనందుకు చాలా మంది సర్పంచులు చచ్చిపోలేదా?

### పాడి కౌశిక్ రెడ్డి ఎమోషనల్ బ్లాక్ మెయిల్ కు బ్రాండ్ అంబాసిడర్

### ఆయన్ని ఆదర్శంగా తీసుకొని ఛస్తామని బెదిరించి మీ వాళ్లు ఓట్లు అడిగారు

### ఛస్తామని బెదిరించి గెలిచిన వారికి నిధులివ్వకుండా చంపుతానన్నాను

### కేటీఆర్ విమర్శలపై స్పందించిన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, డిసెంబర్ 18 (స్కై న్యూస్)** రాష్ట్రంలో సర్పంచులను చంపింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని,కమీషన్ల కక్కుర్తితో వేల కోట్ల రుపాయల ఇరిగేషన్ బిల్లులను చెల్లించిన బీఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచుల బిల్లులను చెల్లించకపోవడంతో అనేక మంది సర్పంచులు గుండెపోటుతో మరణించారని, కొందరు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారనే విషయాన్ని కేటీఆర్ గుర్తుంచుకోవాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో సర్పంచులను చంపింది మీరు కాదా కేటీఆర్ అని ఆయన నిలదీసారు. పంచాయితీ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో గురువారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అనిరుధ్ రెడ్డి మాట్లాడారు. తాను ఎన్నికల ప్రచార సమయంలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చంపుతామని బెదిరిస్తున్నారంటూ టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై అనిరుధ్ రెడ్డి స్పందిస్తూ, సర్పంచులను చంపిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని కేటీఆర్ గుర్తించాలని కోరారు. సర్పంచులు గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను ఏళ్ల తరబడిగా చెల్లించకుండా పెండింగ్ లో పెట్టడం ద్వారా ఎంతో మంది సర్పంచుల చావుకు బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమైయిందని విమర్శించారు. బిల్లులు చెల్లించని కారణంగా కొందరు సర్పంచులు గుండె పోటుతో మరణించగా, మరికొందరు ఆత్మహత్యలు చేసుకున్నా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని, కమీషన్లు వస్తాయని ఇరిగేషన్ బిల్లులు చెల్లింపులపై చూపిన శ్రద్ధ సర్పంచుల బిల్లులపై చూపించలేదని తీవ్రంగా విమర్శించారు. సర్పంచుల మరణానికి కారణమైన కేటీఆర్ తనను విమర్శించడం సబబు కాదన్నారు. అలాగే పాడి కౌశిక్ రెడ్డి ఆయన ఎన్నికల సమయంలో తనకు ఓటు వేయకపోతే ఆత్మహత్య చేసుకుంటానని వీడియో పెట్టి ప్రజల్ని ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేయడానికి బ్రాండ్ అంబాసిడర్ గా మారారని విమర్శించారు. కౌశిక్ రెడ్డిని ఆదర్శంగా తీసుకున్న బీఆర్ఎస్ నేతలు పంచాయితీ ఎన్నికల్లో కూడా తమకు ఓటు వేయకపోతే తాము చచ్చిపోతామంటూ ప్రజలను ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేసి గెలవాలని ప్రయత్నించారని ఆరోపించారు. చచ్చిపోతామని బెదిరించిన వారు గెలిచి వస్తే అలాంటి వారికి నిధులు ఇవ్వకుండా చంపేస్తానని మాత్రమే తాను చెప్పానని స్పష్టం చేసారు. తాను సర్పంచులను కత్తితో పొడిచి చంపుతానని అనలేదు కదా?అని పేర్కొన్నారు. కొంత మంది బీఆర్ఎస్ అభ్యర్థులు స్కూళ్లకు వెళ్లే తమ పిల్లలతో కాళ్లు మొక్కించి ఓట్లు అడుక్కున్నారని అనిరుధ్ రెడ్డి చెప్పారు. అయితే ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేసినా రాష్ట్రంలో బీఆర్ఎస్ 10 శాతం సర్పంచ్ స్థానాలను కూడా నేరుగా గెలుచుకోలేకపోయిందని ఎద్దేవా చేసారు. ఇండిపెండెంట్లు గెలిచిన స్థానాలను కూడా తమ ఖాతాలో వేసుకొని జబ్బలు చరుచుకుంటున్నారని బీఆర్ఎస్ నేతలను అనిరుధ్ రెడ్డి ఎద్దేవా చేసారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ ఇచ్చిన తీర్పు విషయంగా మాట్లాడటానికి ఆయన నిరాకరించారు.

# జడ్చర్లలో 108 స్థానాలు గెలిచాం..
# మరో 35 మంది మాతో టచ్ లో ఉన్నారు

**సర్పంచులు మంచివారైతే ఎవరినైనా దగ్గరకు తీస్తా..**
**కాంగ్రెస్ అభ్యర్థులు ఇచ్చిన హామీలన్నీ నావే అనుకుంటా.**
**గ్రామ ఇంచార్జీలుగా ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థులు**
**ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పష్టీకరణ**

**జడ్చర్ల, డిసెంబర్ 18 (స్కై న్యూస్)** సర్పంచ్ ఏ పార్టీకి చెందిన వ్యక్తి అయినా మంచి వాడైతే తాము దగ్గరకు తీస్తామని, కబ్జాలు చేసి ప్రజల్ని భయపెట్టాలని చూస్తే సహించబోమని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి హెచ్చరించారు. పంచాయితీ ఎన్నికల్లో ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థులను గ్రామ ఇంచార్జీలుగా చేస్తామని, ఎమ్మెల్యే నిధులు, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో వారికే ప్రాధాన్యత ఇస్తానని ప్రకటించారు. పంచాయితీ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అనిరుధ్ రెడ్డి మాట్లాడారు. జడ్చర్ల నియోజకవర్గ వ్యాప్తంగా 108 పంచాయితీల్లో కాంగ్రెస్ సర్పంచులు గెలిచారని, వారు కాకుండా గెలిచిన ఇతర సర్పంచుల్లో మరో 35 మంది దాకా కాంగ్రెస్ పార్టీలోకి చేరుతామంటూ తమకు టచ్ లోకి వచ్చారని వెల్లడించారు. 22న సర్పంచుల ప్రమాణ స్వీకారం అనంతరం గెలిచిన సర్పంచులకు సన్మానం చేస్తామని, ఆ తర్వాత ఈ విషయాలపై స్పష్టత వస్తుందని చెప్పారు. అయితే ఛస్తామని బెదిరించి, స్కూలుకు వెళ్లే పసి పిల్లలతో కాళ్లు



మొక్కించి ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేసినా రాష్ట్రంలో బీఆర్ఎస్ 10 శాతం సర్పంచ్ స్థానాలను కూడా నేరుగా గెలుచుకోలేకపోయిందని ఎద్దేవా చేసారు. సర్పంచులు ఏ పార్టీకి చెందిన వారైనా వాళ్లు మంచి వాళ్లయితే వారిని దగ్గరకు తీస్తామని అనిరుధ్ హామీ ఇచ్చారు. అయితే సర్పంచ్ పదవులను అడ్డుపెట్టుకొని భూకబ్జాలు చేయాలని, ప్రజలను భయభ్రాంతులను చేయాలని చూస్తే మాత్రం తాను సహించేది లేదని ఎమ్మెల్యే స్పష్టం చేసారు. ఇప్పటికే కొందరు అలాంటి ప్రయత్నాల్లో ఉన్నారని తన దృష్టికి వచ్చిందని చెప్పారు. గత రెండేళ్లుగా ఎలాంటి భూకబ్జాలు జరగకుండా నియోజకవర్గం ప్రశాంతంగా ఉందని, ఈ ప్రశాంత వాతావరణాన్ని భగ్నం చేయాలని ఎవరు చూసినా సహించబోనని పేర్కొన్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు ఆయా గ్రామాల్లో ఉండే ఇందిరమ్మ కమిటీ సిఫార్సుతోనే మంజూరు అవుతాయని, ఇందులో సర్పంచుల ప్రమేయం ఉండదని అనిరుధ్ రెడ్డి చెప్పారు. అయితే ఇప్పటి వరకూ తాము నియోజకవర్గంలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లలో 40% బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారికే వచ్చాయని, అర్హత ఉన్న వారి విషయంలో తాము రాజకీయ వివక్ష చూపలేదని పేర్కొన్నారు. సర్పంచులు మంచివారైతే వారి సలహాలు కూడా కమిటీలు పరిగణలోకి తీసుకుంటాయని తెలిపారు. కాగా పంచాయితీ ఎన్నికలలో ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయా గ్రామాలకు ఇంచార్జులుగా పెడతామని, ఎమ్మెల్యే నిధుల ద్వారా చేపట్టే అభివృద్ధి పనుల మంజూరులో గ్రామ ఇంచార్జులకు ప్రాధాన్యత ఇస్తామని వివరించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ వారికి ప్రాముఖ్యత ఇస్తామని చెప్పారు. ప్రస్తుతం ఎస్డీఎఫ్ నిధులు వచ్చాయని, కొత్తగా గెలిచిన సర్పంచులు తమ ప్రమాణ స్వీకారం తర్వాత వచ్చి తమ గ్రామాల్లో తాము ఇచ్చిన హామీల మేరకు ఆయా గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు ఇస్తే వాటిని మంజూరు చేయిస్తామని అనిరుధ్ రెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్తులు ఇచ్చిన హామీలన్నీ తాను ఇచ్చిన హామీలుగానే భావిస్తానని చెప్పారు. పంచాయితీ ఎన్నికలలో వివిధ హామీలను ఇచ్చిన వారు వాటిని నెరవేర్చుకోవడానికి కృషి చేయాలని కోరారు.

# డ్రైనేజ్ వెడల్పు చేయాలని కమిషనర్ కు బిజెపి వినతి



**నారాయణపేట డిసెంబర్ 18: (స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా కేంద్రంలోని సత్యసాయి కాలనీ వద్ద హైదరాబాద్ రోడ్ లో ఉన్న డ్రైనేజీ నీ వెడల్పు చేసి ఇబ్బందులు తొలగించాలని బిజెపి పట్టణ మాజీ అధ్యక్షుడు మిర్చి వెంకటయ్య,మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ సత్య రఘుపాల్ గురువారం మున్సిపల్ కమిషనర్ నర్సయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన డ్రైనేజీ వెడల్పు లేకపోవడం వల్ల చీన్న పైపులు ఉండడంతో వాటిలో ప్లాస్టిక్ కవర్లు, బాటి ళ్లు పేరుకు పోయి మురుగు నీరు జామ్ అవుతుందనీ దాంతో కాలనీ లని మురికి కాలువలో నీరు నిలిచిపోయి దోమల బెడదతో ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే డ్రైనేజీ కాలువను వెడల్పు చేసి ఇబ్బందులు తొలగించాలని కోరారు.

# బాబా వారి ఆశీర్వాదం అందుకున్న సర్పంచ్ గుమ్మడి కృష్ణవేణి....

**శ్రీశ్రీశ్రీ శిరిడి పుష్కర ద్వారక సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు**
**అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో నూతన సర్పంచ్ ను ఆహ్వానించిన ఆలయ కమిటీ**





**బూర్గంపాడు డిసెంబర్ 18 (స్కై న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక లోని శ్రీశ్రీశ్రీ శిరిడి పుష్కర ద్వారకా సాయిబాబా వారి మందిరంలో గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఆలయ కమిటీ వారి ఆహ్వానం మేరకు తాళగొమ్మూరు సర్పంచి గుమ్మడి కృష్ణవేణి పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ,నూతన సర్పంచ్ కు ఆలయ కమిటీ వారు వేద ఆశీర్వాదం ,శాలువా పూలదండలతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా నూతన సర్పంచ్ మాట్లాడుతూ బాబా అనుగ్రహంతో ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందని, మమ్మల్ని గెలిపించిన ప్రజలకు ఎప్పుడు అండగా ఉంటామన్నారు, ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచు గుమ్మడి కృష్ణవేణి కి శుభాకాంక్షలు తెలియజేశారు. బాబా దయవల్ల గ్రామంలోనే సమస్యలన్నిటిని తీర్చి, ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించే శక్తిని నూతన సర్పంచ్ కు సాయిబాబా వారు అనుగ్రహించాలని కోరుకుంటున్నామన్నారు. భవిష్యత్తులో సాయిబాబా వారి అనుగ్రహంతో మీరు మీరు ఉన్నత పదవులను పొందాలని కోరుకుంటున్నామన్నారు.అన్నప్రసాద వితరణ కార్యక్రమానకు సహాయం అందించిన దాతలు మారం నిఖిల్ రెడ్డి ప్రీతి దంపతులు ఈ కార్యక్రమంలో తల్లగుమ్మూరు వార్డు నెంబర్ గ్రామ ప్రజలు ఆలయ కమిటీ వారు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# శాస్త్రోక్తంగా ధనుర్మాస ప్రత్యేక పూజలు...



**బిజినపల్లి డిసెంబర్ 18 (స్కై న్యూస్)** మండల పరిధిలోని పాలెం గ్రామంలో వెలిసిన శ్రీ అలేర్ల మంగ సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనుర్మాస పురస్కరించుకొని ప్రత్యేకంగా గోదాదేవి అమ్మవారి ప్రత్యేక పూజలు ,తిరుప్పావై సేవా కాలం,పాశుర పఠనం, మహ మంగళారతి ,ప్రత్యేక నైవేద్యాలు సమర్పణ తెల్లవారుజామున 5 గంటల నుండి ప్రతిరోజు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కురవి రామానుజ చార్యులు తెలిపారు. ఈ ప్రాంత భక్తులు గోదా అమ్మవారి కృపా కటాక్షం పొందుటకు ధనుర్మాస పూజలు నెలరోజుల పాటు చేయుటకు 501 రూపాయి రుసుము చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని తెలిపారు.వారి పేరిట ప్రతిరోజు పూజలు నిర్వహించి ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు ప్రత్యేకంగా వేద ఆశీర్వచనం ఇవ్వనున్నట్లు తెలిపారు. స్వామివారి అమ్మవారి కృపా కటాక్షాలు పొందుటకు ధనుర్మాసం సువర్ణ అవకాశంగా భక్తులు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు జయంతి కుమార్, శక్ర, అరవింద, ఆలయ సిబ్బంది శివకుమార్ ,బాలయ్య, ఈ ప్రాంత భక్తులు, మహిళలు చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు.

# విజేతగా నిలిచిన కొత్తగూడెం &కార్పొరేట్ క్రికెట్ టీం

**కంపెనీ స్థాయి పురుషుల క్రికెట్ పోటీల ముగింపు వేడుకలు**
**ముఖ్య అతిథి గా ఏరియా ఇన్చార్జ్ జనరల్ మేనేజర్ ఎంవీ నరసింహారావు**
**విశిష్ట అతిథిగా జనరల్ మేనేజర్ (పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి కిరణ్ కుమార్**





**సింగరేణి డిసెంబర్ 18 (స్కై న్యూస్ ):** కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రొఫెసర్ జయ శంకర్ స్టేడియం, రుద్రంపూర్ నందు గత 3 రోజులపాటు అనగా డిసెంబర్ 16 నుండి 18 డిసెంబర్ వరకు నిర్వహించిన కంపెనీ స్థాయి పురుషుల క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథి గా ఏరియా ఇన్చార్జ్ జనరల్ మేనేజర్ ఎంవీ నరసింహారావు, విశిష్ట అతిథిగా జనరల్ మేనేజర్ (పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి కిరణ్ కుమార్ లు హాజరై విజేత టీమ్ లకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ సందర్భముగా ఇంచార్జ్ జిఎం ఎం.వి. నరసింహారావు మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సింగరేణి కంపెనీ స్థాయి పురుషుల క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహించుకోవటం చాలా సంతోషం అని గత మూడు రోజులుగా నిర్వహించిన పోటీలలో 3 రీజియన్ లలో ఉన్న ఆరు (6) సింగరేణి కంపెనీ క్రికెట్ జట్టు క్రీడాకారులు పాల్గొన్నారు ఈ క్రికెట్ పోటీలలో క్రీడాకారులు అందరూ అద్భుతమైన క్రీడాస్ఫూర్తితో పాల్గొన్నారు అని, క్రీడలలో గెలుపు ఓటములు సహజం అని తెలిపారు. సింగరేణి సంస్థ క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహిస్తున్నదని, క్రీడలలో పాల్గొనటం వలన శరీరకముగా గానే కాకుండా మానసికం గా కూడా చాలా దృఢం గా ఉంటారని తెలుపుతూ పోటీలలో గెలుపొందిన కొత్తగూడెం %c% కార్పొరేట్ క్రికెట్ టీం క్రీడాకారులను అభినందించారు. క్రికెట్ పోటీలలో కొత్తగూడెం %c% కార్పొరేట్ క్రికెట్ టీం విజేతగా నిలవగా, మణుగూరు %c% ఇల్లందు రన్నర్ గా నిలిచిన టీంలకు ముఖ్య అతిథిగా హాజరైన ఇన్చార్జ్ జనరల్ మేనేజర్ ఎంవీ నరసింహారావు, విశిష్ట అతిథిగా హాజరైన జనరల్ మేనేజర్ (పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి కిరణ్ కుమార్ లు బహుమతులను అందజేసి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో గెలుపొందిన కొత్తగూడెం అండ్ కార్పొరేట్ క్రికెట్ టీం కోల్ ఇండియా స్థాయిలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి క్రికెట్ టోర్నమెంట్ ట్రోఫీని కనబరిచిగెలవాల్సిందిగా కోరుకుంటున్నామని, పొరాడి ఓడిన జట్టు భాధపడకుండా, క్రీడా స్ఫూర్తితో మరింత పట్టుదలతో కృషి చేసి వచ్చే ఏడాది లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి గెలుపొందాలని కోరుకుంటున్నామన్నారు.

**మూడవ రోజు ఫైనల్ మ్యాచ్ వివరాలు**



టాస్ గెలిచి కొత్తగూడెం కార్పొరేట్ క్రికెట్ ఫీల్డింగ్ ఎంచుకోనగా ముందుగా బ్యాటింగ్కు వచ్చిన ఇల్లందు మనుగురు టీం 20 ఓవర్లకు నాలుగు వికెట్లు కోల్పోయి 1505 పరుగులను చేయడం జరిగింది ఈ లక్ష్య చేధనలో కొత్తగూడెం %c% కార్పొరేట్ టీం 18 ఓవర్ల రెండు బాల్ లో ఆరు వికెట్లు కోల్పోయి 156 పరుగులు చేసి క్రికెట్ టోర్నమెంట్ విజేతగా నిలవడం జరిగింది ముఖ్యంగా ఈ యొక్క ఫైనల్ మ్యాచ్లో సాయి రాకేష్, ఫిట్టర్, పీవీకే.5ఇంక్లైన్ అత్యుత్తమ ప్రదర్శన ఘనపరిచి 82 పరుగులతో నాటౌట్ గా ఉండి కొత్తగూడెం %c% కార్పొరేట్ టీమును విజేతగా నిలపడంలో ఎంతగానో కృషి చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి జిఎం తో పాటు జనరల్ మేనేజర్ (పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి కిరణ్ కుమార్,కొత్తగూడెం ఏరియా గుర్తింపు సంఘం (ఏఐటియుసి) అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జె గట్టయ్య,ప్రాతినిధ్య సంఘం (ఐఎన్టియుసి) వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్ , ఏజిఎం(సివిల్) సిహెచ్.రామకృష్ణ, ఎజిఎం (పర్సనల్) జి.వి. మోహన్ రావు, డిజిఎం(పర్సనల్) కేసా నారాయణ రావు, కొత్తగూడెం ఏరియా ఇన్చార్జి ఎస్ఓటు జిఎం ఎం. వెంకటేశ్వర రావు, అధికారులు, యూనియన్ నాయకులు, స్పోర్ట్స్ మేనేజర్ కే.సునీల్ కుమార్, సూపర్వైజర్ లు, పర్సనల్, ఎస్%c%పిసి, ఈ%c%ఎం, సివిల్ శాఖల సిబ్బంది, ఫైనల్ మ్యాచ్లో పాల్గొన్న జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

# బాబా వారి ఆశీర్వాదం అందుకున్న సర్పంచులు గుమ్మడి కృష్ణవేణి, కుంజా కొండమ్మ

**శ్రీశ్రీశ్రీ శిరిడి పుష్కర ద్వారక సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు**
**అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో నూతన సర్పంచులను ఆహ్వానించిన ఆలయ కమిటీ**
**అన్న ప్రసాద వితరణ కార్యక్రమంనకు సహకరించిన దాతలు నిఖిల్ రెడ్డి ప్రీతి దంపతులు**

**బూర్గంపాడు డిసెంబర్ 18 (స్కై న్యూస్ ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక లోని శ్రీశ్రీశ్రీ శిరిడి పుష్కర ద్వారకా సాయిబాబా వారి మందిరంలో గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఆలయ కమిటీ వారి ఆహ్వానం మేరకు కోయగూడెం సర్పంచ్ కుంజా కొండమ్మ , తాళగొమ్మూరు సర్పంచి గుమ్మడి కృష్ణవేణి పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ,నూతన సర్పంచులకు ఆలయ కమిటీ వారు వేద ఆశీర్వాదం ,శాలువా పూలదండలతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా నూతన సర్పంచులు మాట్లాడుతూ బాబా అనుగ్రహంతో ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందని, మమ్మల్ని గెలిపించిన ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటామన్నారు, ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచులు కుంజా కొండమ్మ, గుమ్మడి కృష్ణవేణి లకు శు భాకాంక్షలు తెలియజేశారు. బాబా దయవల్ల గ్రామంలోనే సమస్యలన్నిటిని తీర్చి, ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించే శక్తిని నూతన సర్పంచులకు సాయిబాబా వారు అనుగ్రహించాలని కోరుకుంటున్నామన్నారు. భవిష్యత్తులో సాయిబాబా వారి అనుగ్రహంతో మీరు మీరు ఉన్నత పదవులు పొందాలని కోరుకుంటున్నామన్నారు.అన్నప్రసాద వితరణ



కార్యక్రమానకు సహాయం అందించిన దాతలు మారం నిఖిల్ రెడ్డి ప్రీతి దంపతులు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు ఆలయ కమిటీ వారు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## ఎమ్మెల్యే గారిని మర్యాదపూర్వకంగా కలిసిన 11 జిల్లాల మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు



ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి గారిని కలిసిన 11 జిల్లాల మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు మరియు జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు ఎం సురేష్ గారు, కార్యదర్శి కృష్ణ గారు, ట్రెసరర్ ప్రభాకర్ రెడ్డి గారు, మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది.

# ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలు తనిఖి చేసిన డి ఎం హెచ్ ఓ

**సిబ్బందితో కలిసి శ్రమదానంలో పాల్గొన్న డి ఎం హెచ్ ఓ తుకారాం రాథోడ్**

**కొత్తగూడెం డిసెంబర్ 18( స్కై న్యూస్):** నవభారత్ పాల్వంచ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు గుడిపాడు,అశ్వాపురం మణుగూరు సందర్శించి వారి ఆరోగ్య కేంద్రాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది అందరు సమయ పాలన పాటించాలని,అందరు తమ తమ ఉపకేంద్రాలందు దగ్గరలో అందుబాటులో ఉండాలని లేనియెడల శాఖ పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.కుష్ఠ వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమంను ఆశ కార్యకర్తలు చేస్తున్న సర్వే ను పరిశీలించిన



తరువాత ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలందు జరిగిన శ్రమదాన కార్యక్రమం నందు సిబ్బందితో పాల్గొని వాటి పరిసరాలను శుభ్రం చేయడం జరిగింది. ఈ శ్రమదానం కార్యక్రమం నందు పాల్గొన్న సిబ్బంది అందరు తమ ఆనందాన్ని సంతోషాన్ని వ్యక్తపరిచారు .ఈ కార్యక్రమం చాలా ఆహ్లాదకరంగా సంతోషంగా మన కేంద్రాన్ని మనమే శుభ్రం చేసుకున్నామని ,అందరం తారతమ్యాలు మరిచి ఈ కార్యక్రమం ఇలాగే ముందుకు తీసుకొని వెళ్తామని సిబ్బంది అందరు హర్షం వ్యక్తపరచారు. ఈ కార్యక్రమం నందు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ ,డాక్టర్ పుల్లారెడ్డి పి ఒ ఎన్ టి ఈ పి , డాక్టర్ నిశంత్, డాక్టర్ సంకీర్తన, మోహన్ డిపిఎంఓ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా విశ్వాసానికి ప్రతీకగా కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

**మహబూబ్ నగర్, డిసెంబర్ 18(స్మైన్యూస్):** ప్రజల జీవితాల్లో నేరుగా మార్పు తీసుకొచ్చే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో కాంగ్రెస్ పార్టీపై ప్రజల విశ్వాసం రోజురోజుకు పెరుగుతుండటం మరోసారి రుజువైంది. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాహిత పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలోకి భారీ సంఖ్యలో చేరారు. మాచన్‌పల్లి గ్రామ అధ్యక్షులు తుమ్మల భారత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎంపిటిసి బోయ శ్రీనివాసులు, నూతన గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు బోయి రమేష్, పెద్ద గౌడి వెంకటయ్య, లక్ష్మమ్మ, మాజీ గ్రామ వార్డు సభ్యులు కొత్తకాపు రఘునందన్ రెడ్డితో పాటు వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరడం విశేషం. గౌరవ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారి సూచన మేరకు మహబూబ్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి నూతన సభ్యులకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మల్లు నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ, గౌరవ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారి ఆలోచనలు ప్రజల అవసరాలకే




ప్రతిబింబమని తెలిపారు. విద్య, వైద్యం, సంక్షేమం ప్రతి కుటుంబానికి చేరాలన్న దృఢ సంకల్పంతో ఎమ్మెల్యే గారు నిరంతరం పనిచేస్తున్నారని అన్నారు. అభివృద్ధి అంటే భవనాలు మాత్రమే కాదని, ప్రజల జీవన ప్రమాణాలు పెరగడమే నిజమైన అభివృద్ధి అన్న భావనతో ఆయన ముందుకు సాగుతున్నారని కొనియాడారు. ఎమ్మెల్యే గారి ఆలోచనలు, సంకల్పాన్ని కార్యరూపంలోకి తీసుకురావడానికి ఈ సమయం అత్యంత కీలకమని, ప్రతి కార్యకర్త తన వంతు బాధ్యతగా కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని ఆయన సూచించారు. దేశంలోనే కాదు, రాష్ట్రంలో కూడా పేదల పాలిట ఆశాకిరణంగా కాంగ్రెస్ పార్టీ నిలిచిందని అన్నారు. పేద, మధ్యతరగతి, రైతు, మహిళ, యువత సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు కాగితాలకే పరిమితం కాకుండా, ప్రతి ఇంటి తలుపు తడుస్తున్నాయంటే అది కాంగ్రెస్ పాలనకు నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తున్నారని చెప్పారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయబోయే మరిన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలంటే క్షేత్రస్థాయిలో పార్టీ మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. అందుకు కార్యకర్తలే మూలస్తంభాలని, పాత, కొత్త అనే తేడా లేకుండా అందరూ ఐక్యంగా కాంగ్రెస్ జెండాను ముందుకు నడిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గుచ్చు మల్లె వెంకటయ్య, శ్రీనివాస్ యాదవ్, రాఘవేందర్, మాల నారాయణ, బోయ వెంకటయ్య తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెదవి దాటితే పృథ్వి దాటుతుంది

**రాజకీయాల్లో మార్పు రావాలి**

**చట్టసభల్లో ప్రమాణం చేసి భావ కాలుష్యం సృష్టిస్తున్నారు**

**షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కన నర్సింలు..**

పెదవి దాటితే పృథ్వి దాటుతుందని సామెత.. అందుకే ఆచితూచి మాట్లాడటం అందరికీ మంచిది! అప్పుడే మాట కూడా మనకి అలంకారమవుతుందనీ రాజకీయాల్లో వృధా మాటల వల్ల ప్రయోజనం లేదని ప్రజలు గమనిస్తుంటారని తెలంగాణ టిడిపి పోలీట్ బ్యూరో సభ్యులు, షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ మూడు దశల ఎన్నికలు ముగిసిన అనంతరం ఆయన మీడియాతో గురువారం చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. మాట్లాడే శక్తి మానవులకు మాత్రమే ఉంది, కాబట్టి ఈ శక్తిని మంచికి ఉపయోగించాలనీ ఎన్నికల సందర్భంగా ప్రజా ప్రతినిధులు రాజకీయ నాయకులు చేసే మాటలు ప్రసంగాలు రెచ్చగొట్టే ధోరణలు సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తాయని బక్కని అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎంతోమంది ప్రజాప్రతినిధులు భారత రాజ్యాంగాన్ని విశ్వసిస్తామని, దేశ సార్వభౌమత్వం, సమగ్రతను కాపాడుతామని, మరియు తమ విధులను నిజాయితీగా నిర్వర్తిస్తామని చేసే ప్రతిజ్ఞ లేదా ధృవీకరణ తర్వాత ప్రజాక్షేత్రంలోకి వచ్చాక వారి పరిస్థితి భిన్నంగా ఉంటుందని బక్కని స్పష్టం చేశారు. ఇటీవల గ్రామ



పంచాయతీ ఎన్నికల్లో పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కూడా చేసిన వ్యాఖ్యలు తాను గమనించానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. రాజకీయంగా మాట్లాడేటప్పుడు ఎదుటి వ్యక్తులు ఏ హోదాలో ఉన్నారు తెలుసుకొని మాట్లాడితే బాగుండేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఇంకా తదితర పోలీసు అధికారిని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి వారి పట్ల మాట్లాడిన మాటలు రాజ్యాంగ విరుద్ధమనీ ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇలాంటి మాటలను ప్రజాస్వామ్యంలో ప్రజలు హర్షించారని ఆయన అన్నారు రాజకీయాల్లో రెచ్చగొట్టే ప్రసంగాలు మాటలు కొంతమందికి అర్షద్వానాలు పలకవచ్చని కానీ మెజార్టీ ప్రజలు మాత్రం ఇలాంటి వాటిని హర్షించారని ఆయన హితవు పలికారు తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రాజకీయాల్లో భాషా పరంగా అనేక మార్పులు వచ్చాయని ఎన్నో వ్యాఖ్యలు ముఖ్య మంత్రి నుండి ఎమ్మెల్యే వరకు ఇతర నాయకులు విచ్చలవిడిగా నోటికి అదుపు లేకుండా దురుసుగా మాట్లాడుతున్నారని మాజీ ఎమ్మెల్యే పక్కనే ఆవేదన వ్యక్తం చేశారు గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా చాలా ప్రాంతాల్లో డబ్బు మద్యం ఏరులై పారిందని ఇవన్నీ ఎవరికోసమని అప్పులు సప్పులు చేసి ఆస్తులు కుదువ పెట్టి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా గ్రామపంచాయతీలో విచ్చలవిడిగా డబ్బు పంపకాలు నగదు మద్యం ఇతర వస్తువులు ఇచ్చి ప్రలోభ పెట్టి ఓట్లు వేయించుకోవడం సరైన పద్ధతి కాదని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దఫా జరిగిన ఎన్నికల్లో ప్రతి గ్రామపంచాయతీలో గెలుపే ధ్యేయంగా చాలామంది లక్షలాది రూపాయలు పంపకాలు జరిపారని ఎన్నికల్లో పెట్టిన డబ్బులు మళ్ళీ ఎలా రాబట్టుకుంటారో అందరికీ తెలుసని ఇది సిగ్గుచేటని అన్నారు. ప్రజాస్వామ్య విలువలు పూర్తిగా పతనమయ్యాయని బక్కని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో సమాజంలో మార్పు రావాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని లేకపోతే నిజాయితీగా సేవ చేసుకునేవారు డబ్బులు లేని వారు ఎన్నికలకు భయపడి దూరంగా మిగిలిపోతారని సమాజం తద్వారా భ్రష్టు పట్టిపోతుందని బక్కని స్పష్టం చేశారు ఈ చిట్ చాట్ లో సీనియర్ నాయకులు తోకల దామోదర్ రెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతాం

**- కార్పొరేట్లకు దోచిపెడుతున్న బీజేపీ**
**- డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్**
**- పాలమూరులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన**

**మహబూబ్ నగర్, డిసెంబర్ 18(స్మైన్యూస్):**దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతామని డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. తెలంగాణ చౌరస్తా నుంచి బీజేపీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించడానికి ప్రయత్నించగా కార్యాలయ సమీపంలో పోలీసులు భారీకెడ్లు ఏర్పాటు చేశారు. భారీకేడ్డు దాటి కాంగ్రెస్ నాయకులు వెళ్లడానికి ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం మీడియాతో డీసీసీ అధ్యక్షులు మాట్లాడుతూ దేశంలోని రాజ్యాంగ వ్యవస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని ఆరోపించారు. ప్రతిపక్షాలను




భయభ్రాంతులకు చేయడానికి ఈడీ, సీబీఐలను ఇష్టానుసారంగా వాదుకుంటున్నదని విమర్శించారు. దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గట్టిగా ప్రస్తావిస్తున్న కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్గాంధీపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్ అనేది కేవలం జర్నలిజంకు సంబంధించినదని అన్నారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ పట్ల బీజేపీ అవలంభిస్తున్న తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని అన్నారు. దేశంలో బీజేపీని భూస్థాపితం చేసేవరకు పోరాడుతామని హెచ్చరించారు. నిరసనలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, నాయకులు వినోద్ కుమార్, మిథున్ రెడ్డి, సీజే బెనహర్, అజ్మత్ అలీ, బెక్కరి మధుసూదన్ రెడ్డి ఫయాజ్, ఆవేజ్, రాములు యాదవ్, నాగరాజు, ప్రవీణ్ కుమార్ తో పాటు జిల్లాలోని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నూతనంగా గెలుపొందిన గ్రామ పంచాయతీల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## దేవరకద్ర ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి....





**దేవరకద్ర డిసెంబర్ 18(స్మైన్యూస్)** మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు) ను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అక్షయపాత్ర పథకం ద్వారా అందుతున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ భోజనం రుచి, నాణ్యతపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ వారి చదువు గురించి తెలుసుకున్నారు. ఏవైనా సబ్జెక్టుల్లో ఇబ్బందులు ఉన్నాయా, సాయంత్రం స్నాక్స్ అందుతున్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో జరిగిన చర్చలో గత విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో 89 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడగగా పాఠశాల ప్రహరీ, సైన్స్ ల్యాబ్ సదుపాయాలు లేవని విద్యార్థులు జిల్లా కలెక్టర్ కు తెలిపారు. ఈ సమస్యలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా రామాలయంలో ధనుర్మాస ప్రత్యేక పూజలు...

**నాగర్ కర్నూల్ డిసెంబర్ 18( స్మై న్యూస్)** జిల్లా కేంద్రంలోని రామ్ నగర్ కాలనీలో గల శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ధనుర్మాసం పురస్కరించుకొని ప్రతిరోజు విశేషంగా శాస్త్రోక్తంగా గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు ,తిరుప్పావై సేవా కాలం, పాశుర పఠనం, మహా మంగళహారతి, వివిధ నక్షత్ర హారతులు,



కుంకుమార్చన, పుష్పార్చన వేదమూర్తులైన బ్రాహ్మణులచే నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యంగార్ తెలిపారు. ఈ ప్రత్యేక పూజలు భక్తులు చేసుకొనుటకు ఈ మాసంలో వినియోగించు కోవాలని, అమ్మవారి కృప వారి కుటుంబాలపై ఉండుటకు ధనుర్మాస వ్రతం ఎంతో పుణ్యఫలితం ఉంటుందని అన్నారు. అట్టి భక్తులకు ప్రత్యేకంగా అమ్మవారి కుంకుమ, పుష్పాలు, తీర్థప్రసాదాలు వేద ఆశీర్వచనం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంత భక్తులు ఈ ధనుర్మాస అవకాశాన్ని అధిక సంఖ్యలో వినియోగించు కోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కందాడై శ్రీనివాసాచార్యులు, పద్మావతి, కరుణ శ్రీ, గోమటం మురళీమోహనా చార్యులు, గోమటం శ్రీనివాసాచార్యులు, రాధిక, భక్తులు విజయ్ కుమార్, స్వామి, రమాదేవి, శారద, సాయి భక్తులు భజన మండలి భక్తులు విష్ణు సహస్ర పారాయణ కమిటీ సభ్యులు, రామాలయ భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆల్విన్ కాలనీలో కూల్చివేతలు ఎమ్మెల్యేపై మండిపడుతున్న బాధితులు

**హైదరాబాద్ :** ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఒక సామాజిక వర్గానికి చెందిన నాయకుడిలానే వ్యవహరిస్తారని కాంగ్రెస్ నేతలు ఆరోపణలు చేశారు. నేడు శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారి వెడల్పు లో భాగంగా రోడ్డు పక్కన ఉన్న షాపులను, ఇండ్లను జిహెచ్ఎంసి అధికారులకు కూల్చివేస్తున్నారు. దీనితో అక్కడ ఉధృత వాతావరణం నెలకొంది. కనీసం తమకి ఖాళీ చేసే సమయం కూడా ఇవ్వకుండా వచ్చి కూల్చి వేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దగ్గరుండి మరి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి కుల్చి వేస్తున్నారని ఆరోపించారు. కనీసం తమకు జిహెచ్ఎంసి నుండి నోటీసులు కూడా రాలేదని ఆరోపించారు. అభివృద్ధి పనులకు తాము ఆటంకం కలిగించమని కనీసం సమయం ఇవ్వకుండా కూల్చివేయడంపై విమర్శించారు తులసి వనం నుండి రోడ్డు వెడల్పు పనులు ప్రారంభం కావాల్సి ఉండగా కొందరి లబ్ధి కోసం వాటిని మార్చేసి పేదల ఇండ్లను కూల్చుకుంటూ వెడల్పు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేపట్టారని విమర్శించారు. రేపు జరగబోయే ఓట్లలో ఏ ముఖం పెట్టుకొని తాము ఓటు వేయమని అడుగుతామని పేర్కొన్నారూ. కాంగ్రెస్ పార్టీలో ఉన్నవారికి సైతం చూడకుండా కనీసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కమిషనర్ తో మాట్లాడి ఇల్లు కోల్పోతున్న వారికి నష్టపరిహారం కూడా ఇచ్చేలా కృషి చేయలేదని అన్నారు.

## ఓటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

**మహేశ్వరం :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం లోని ఓటింగ్ కేంద్రాన్ని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. చిన్నారులతో వచ్చిన మహిళలను ముందుగా ఓటు వేసేందుకు అనుమతించాలని పోలీసులకు సూచించారు. ప్రశాంతంగా ఓటింగ్ ప్రక్రియ నడుస్తుందని తెలిపారు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా మొత్తం 174 గ్రామ సర్పంచ్ లకు ఎన్నికలు కాగ అందులో 10 ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు తెలిపారు. ప్రస్తుతం 163 సర్పంచులకు 1449 వార్డు సభ్యులకు ఓటింగ్ ప్రక్రియ నడుస్తునట్టు తెలిపారు. ఒంటిగంట వరకు ఓటింగ్ ప్రక్రియ ఉంటుంది. ఒంటిగంట లోపు క్యూలైన్ లో ఉన్న వారికి ఓటింగ్ వేసేందుకు అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. రెండు గంటలకు ఒట్ల లెక్కింపు ప్రారంభం. ముందుగా వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపు తర్వాత సర్పంచ్ ఒట్ల లెక్కింపు అని తెలిపారు.

## ప్రశాంతంగా మూడవ విడత పోలింగ్

**జిల్లాలో మూడవ విడత పోలింగ్ శాతం 79.64**

**మొత్తం 1,71,920 ఓట్లలో పోలైన ఓట్లు 1,36,917**

**జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్**




**జగిత్యాల :** మూడవ విడత సర్పంచ్ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నట్లుగా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ తెలిపారు.గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మూడవ విడత ఎన్నికల పోలింగ్ 79.64 శాతం నమోదు అయింది. జిల్లాలోని బుగ్గారం, ధర్మపురి, ఎండపెల్లి, గొల్లపెల్లి, పెగడపెల్లి, వెల్గటూర్మండలాల్లో బుధవారం పోలింగ్ నిర్వహించారు.6 మండలాల్లో కలిపి మొత్తం ఓట్లు 1,71,920 ఉండగా పోల్ 1,36,917 అయ్యాయి. 79.64 శాతం పోలింగ్ నమోదు అయింది.మండలాల వారిగా ఓటర్లు.. నమోదు అయిన పోలింగ్ శాతం..బుగ్గారం మండలంలో మొత్తం ఓటర్లు 17,347మంది ఉండగా, 13,496 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 77.8 శాతం నమోదు అయింది.ధర్మపురి మండలంలో మొత్తం ఓటర్లు 34,638మంది ఉండగా, 25,302 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 73.05 శాతం నమోదు అయింది.ఎండపెల్లి మండలంలో మొత్తం ఓటర్లు 22,825 మంది ఉండగా, 19,110 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 83.72 శాతం నమోదు అయింది.గొల్లపెల్లి మండలంలో మొత్తం ఓటర్లు 39,658 మంది ఉండగా, 32,065 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 80.85 శాతం నమోదు అయింది.పెగడపెల్లి మండలంలో మొత్తం ఓటర్లు 34,768 మంది ఉండగా27,855 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 80.12 శాతం నమోదు అయింది.వెల్గటూర్ మండలంలో మొత్తం ఓటర్లు 22,684 మంది ఉండగా, 19,089 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 84.15 శాతం నమోదు అయిందని ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ తెలిపారు

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్



**జగిత్యాల :** జిల్లాలో 3వ దశ పోలింగ్‌లో భాగంగా ధర్మపురి మండలంలోని జైన, రాజారాం, రాయపట్నం గ్రామాలు, ఎండపల్లి మండలంలోని రాజారాంపల్లి, గుల్లకోట గ్రామాలు, పెగడపల్లి మండలంలోని నంచర్ల, బతికేపల్లి గ్రామాలు, అలాగే వెల్గటూర్ మరియు గొల్లపల్లి మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ సెంటర్లను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు.ఈ సందర్భంగా పోలింగ్ ఏర్పాట్లు, సిబ్బంది హాజరు, మౌలిక సదుపాయాలు, భద్రతా చర్యలు తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే కౌంటింగ్ ప్రక్రియ సజావుగా, త్వరితగతిన పూర్తి అయ్యేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆర్ ఓ అధికారులకు ఆదేశించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో కలెక్టర్ వెంట జడ్పీ సీఈవో గౌతంరెడ్డి, నోడల్ ఆఫీసర్లు రఘువరన్, నరేష్, మదన్మోహన్, రేవంత్, జగిత్యాల ఆర్డిఓ మధుసూదన్, జగిత్యాల డీఎస్పీ రఘు చందర్, సంబంధిత ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎలక్షన్ సరళి, పోలీసు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**జగిత్యాల :** మూడవ విడత సర్పంచ్ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నట్లుగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.ఎన్నికలు జరుగుతున్న ఇబ్రహీం నగర్, గొల్లపల్లి, బత్కపల్లి, నంచర్ల, గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెట్రోలింగ్ వాహనాలు మరియు ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం పర్యటిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తారని తెలిపారు.పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులకు మరియు సిబ్బందికి ఎస్పీ భద్రత పరమైన పలు సూచనలు చేశారు.



# చలికాలంలో పెరుగు తింటున్నారా?

శీతాకాలంలో విటమిన్లు అధికంగా ఉండే పెరుగును తినడానికి చాలా మంది వెనుకాడుతుంటారు. పెరుగు చల్లదనాన్ని కలిగి ఉంటుందని, ఇది జలుబు, దగ్గు సమస్యలను కలిగిస్తుందని భయపడుతుంటారు. కానీ, ఆయుర్వేదంలో సీజన్‌తో పనిలేకుండా పెరుగు ఆరోగ్యానికి మంచిది. కానీ, చలికాలంలో తప్పు సమయంలో తింటే ఇబ్బంది కలగవచ్చు. ఇది జీర్ణశక్తిని, రోగనిరోధక శక్తిని పెంచుతుంది. కానీ సరిగ్గా తీసుకోకపోతే సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. శీతాకాలంలో పెరుగు తినాలా..? వద్దా అనే సందేహం చాలా మంది వ్యక్తం చేస్తుంటారు. ప్రోబయోటిక్స్ అధికంగా ఉండే పెరుగును తీసుకోవడం మీ ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరం. కానీ, శీతాకాలంలో విటమిన్లు అధికంగా ఉండే పెరుగును తినడానికి చాలా మంది వెనుకాడుతుంటారు. పెరుగు చల్లదనాన్ని కలిగి ఉంటుందని, ఇది జలుబు, దగ్గు సమస్యలను కలిగిస్తుందని భయపడుతుంటారు. కానీ, ఆయుర్వేదంలో సీజన్‌తో పనిలేకుండా పెరుగు ఆరోగ్యానికి మంచిది. కానీ, చలికాలంలో తప్పు సమయంలో తింటే ఇబ్బంది కలగవచ్చు. ఇది జీర్ణశక్తిని, రోగనిరోధక శక్తిని పెంచుతుంది. కానీ సరిగ్గా తీసుకోకపోతే సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. పెరుగును సాధారణ ఉష్ణోగ్రత వద్ద మాత్రమే తినాలని గుర్తుంచుకోండి. ఇది కాకుండా, మీరు ఉదయం పెరుగు తినాలి. ఇది మీ ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. పెరుగు మీ పేగులలో ఉండే మంచి బ్యాక్టీరియాను పెంచడంలో చాలా సహాయపడుతుంది. పెరుగులో ఉండే కాల్షియం మీ ఎముకలను బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. పెరుగు ప్రోటీన్, కాల్షియం, రిబోఫ్లేవిన్, విటమిన్ బి6, విటమిన్ బి12 వంటి ముఖ్యమైన పోషకాలతో నిండి ఉంది. ఈ పోషకాలు రోజువారీ శరీర విధులకు సహాయపడతాయి. జీవక్రియను మెరుగుపరుస్తాయి. మొత్తం ఆరోగ్యాన్ని బలపరుస్తాయి. పెరుగు పోషక విలువలు మెరుగైన రోగనిరోధక శక్తికి, జీర్ణ ఆరోగ్యానికి తోడ్పడతాయి. క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల పేగుల సమతుల్యతను కాపాడటం ద్వారా, శరీర సహజ రక్షణ వ్యవస్థకు మద్దతు ఇవ్వడం ద్వారా అనేక సాధారణ సమస్యలను తగ్గించవచ్చు. చలికాలంలో పోషకాహార నిపుణులు పెరుగును పగటిపూట తినమని చెబుతున్నారు. ఉదయం లేదా మధ్యాహ్నం సమయంలో తీసుకోవడం వల్ల శరీరం దానిని సులభంగా జీర్ణం చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది. చల్లబరిచే, పోషక లక్షణాలను పూర్తిగా ఉపయోగించుకోవచ్చు. పెరుగు సహజంగానే శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. రాత్రి సమయంలో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి కాబట్టి.. రాత్రిపూట పెరుగు తినడం జీర్ణక్రియకు ఆటంకం కలిగిస్తుంది. చలి సంబంధిత సమస్యలను మరింత పెంచుతుంది. ఇది శీతాకాలంలో రాత్రి సమయంలో తీసుకోవడానికి తక్కువ అనుకూలంగా ఉంటుంది. చలికాలంలో రాత్రిపూట పెరుగు తింటే కొంతమందిలో శ్వాసకోశ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. చల్లదనం కారణంగా చలి, దగ్గు, గొంతు నొప్పి లేదా సైనస్ సమస్యలు వంటి లక్షణాలు తీవ్రమవుతాయి. పెరుగులో కాల్షియం, ఫాస్ఫరస్ అధికంగా ఉంటాయి. ఇవి ఎముకల బలాన్ని కాపాడటానికి అవసరమైన రెండు ముఖ్యమైన ఖనిజాలు. రోజూ పగటిపూట తీసుకోవడం వల్ల ఎముకల సాంద్రత, మొత్తం అస్థిపంజర ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పెరుగు తక్కువగా కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. దీనిని సరిగ్గా తినడం ద్వారా గుండె సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదాన్ని తగ్గించవచ్చు. కాలక్రమేణా ఆరోగ్యకరమైన గుండెను నిర్వహించడానికి దోహదపడుతుంది. పెరుగులో లాక్టిక్ ఆమ్లం ఉంటుంది. ఇది చర్మాన్ని సున్నితంగా ఎక్స్‌ఫోలియేట్ చేస్తుంది. మృత కణాలను తొలగిస్తుంది. క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల పొడిబారడం, మందగించటానికి పేరుగాంచిన శీతాకాలంలో స్పష్టమైన, ఆరోగ్యకరమైన చర్మం కనిపించడానికి సహాయపడుతుంది.

# న్యూస్ పేపర్లలో బజ్జీ, వడలు తినడం ప్రమాదకరమా!



ఇండియాలో ముఖ్యంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో టీ బడ్డీలు, రోడ్డు పక్కన ఉన్న చిరు హోటళ్లలో సాయంత్రం స్నాక్స్ తినడం సాధారణం. బజ్జీలు, వడలు, బోండాలు ఎన్నెన్నో రుచులతో ఆకర్షిస్తాయి. ఇండియాలో ముఖ్యంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో టీ బడ్డీలు, రోడ్డు పక్కన ఉన్న చిరు హోటళ్లలో సాయంత్రం స్నాక్స్ తినడం సాధారణం. బజ్జీలు, వడలు, బోండాలు ఎన్నెన్నో రుచులతో ఆకర్షిస్తాయి. చాలా మంది ఈ వేడి వేడి పదార్థాలను పాత వార్తాపత్రికల్లో ఇస్తుంటారు. వాటిలోనే పార్శిల్ చేస్తారు. తక్కువ ఖర్చు, ఈజీగా పని పూర్తవుతుందని అనిపించినా, ఇందులో దాగి ఉన్న ఆరోగ్య ప్రమాదాలు చాలా తీవ్రమైనవి. వార్తాపత్రికల ప్రింటింగ్ ఇంక్, లెడ్ వంటి భారీ లోహాలు, రసాయనాలు, పిగ్మెంట్లు, బైండర్లు, యాడిటివ్లు ఉంటాయి. ఇవి ఆహారంలో కలిసినప్పుడు ముఖ్యంగా వేడి వేడిగా ఉన్న బజ్జీలు, వడలు వంటి పదార్థాల్లోకి ఇంక్ కలిసిపోతుంది. ఈ రసాయనాలు శరీరంలోకి ప్రవేశించి క్రమంగా పేరుకుపోయి, జీర్ణక్రియ సమస్యలు, టాక్సిసిటీ, కాలేయం, మూత్రపిండాల దెబ్బ, నాడీ వ్యవస్థ రుగ్మతలు, రోగనిరోధక శక్తి తగ్గడం వంటి ప్రమాదాలు కలిగిస్తాయి. వీటి తయారీకి వాడే కొన్ని పదార్థాలు క్యాన్సర్ కారకాలు (కార్సినోజెనిక్) కూడా. ముఖ్యంగా పిల్లలు, యువకులు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువ ఉన్నవారు తొందరగా ఇబ్బందిపడతారు. భారత ఆహార భద్రతా ప్రామాణిక అథారిటీ 2018లోనే వార్తాపత్రికలను ఆహార ప్యాకేజింగ్ కోసం ఉపయోగించడం నిషేధించింది. అయినా చాలా చోట్ల ఈ పద్ధతి కొనసాగుతోంది. వార్తాపత్రికల్లో ఆహార పదార్థాల ప్యాకింగ్ నిషేధిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలి. రూల్స్ ఉల్లంఘించిన వారికి అధిక జరిమానాలు విధించేలా ఆదేశాలు జారీ చేయాలి. నూనె పీల్చుకునేందుకు ఫుడ్ గ్రేడ్ అబ్సార్బెంట్ పేపర్ లేదా టిష్యూ పేపర్ ఉపయోగించండి. పార్శిల్ కోసం అల్యూమినియం ఫాయిల్, బ్రౌన్ పేపర్ బ్యాగులు లేదా బయోడిగ్రేడబుల్ ప్యాకెట్లు వాడండి. వార్తాపత్రికలో ప్యాక్ చేసిన లేదా వడ్డించిన ఫుడ్‌ను తీసుకోవడానికి నో చెప్పండి. మీ బాక్స్ తీసుకెళ్లి పార్శిల్ చేయించుకోండి. ఇంట్లో కూడా వండిన పదార్థాలను వార్తాపత్రికల్లో పెట్టి తినడాన్ని నిషేధించండి. ఆహారాన్ని ప్లేట్లలో వడ్డించండి లేదా అరటి ఆకులు, మంచి క్లాత్ వంటి సహజమైన వాటిని ఉపయోగించండి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పర్యావరణానికి కూడా మంచివి. ఈ చిన్న అలవాట్లు మార్చుకోవడం వల్ల మనం మాత్రమే కాకుండా మన ఫ్యామిలీ, సమాజం ఆరోగ్యంగా ఉంటుంది. రుచికరమైన బజ్జీలు, వడలు తినాలనిపిస్తే ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సురక్షితమైన ప్రాంతాల్లో, శుభ్రమైన పాత్రల్లో తినండి. ఆరోగ్యమే మహాభాగ్యం.. దానిని కాపాడుకోవడం మన బాధ్యత అని గుర్తుంచుకోండి.

# నవ్వితే పోయేదేం లేదు.. అనారోగ్యం తప్ప!



నేటి ఒత్తిడితో కూడిన జీవితంలో, నవ్వు అనేది ఒక చౌకైన, ప్రభావవంతమైన ఔషధం. ఇది మానసిక స్థితిని తక్షణమే మెరుగుపరుస్తుంది, ఒత్తిడి హార్మోన్లను తగ్గిస్తుంది. నవ్వడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది, గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది, శరీరంలో ఆక్సిజన్ స్థాయిలను పెంచుతుంది మరియు సంబంధాలను బలపరుస్తుంది. ప్రతిరోజూ బిగ్గరగా నవ్వడం ద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. నేటి ఉరుకుల పరుగుల జీవితాల్లో ప్రజలు ఒత్తిడి, ఉద్రిక్తతను తమ నిత్య సహచరులుగా చేసుకున్నారు. కొన్నిసార్లు వారు దాని నుండి బయటపడటానికి ఖరీదైన చికిత్సలు, మందులను కూడా ఆశ్రయిస్తారు. కానీ, ఈ సమస్యకు చౌకైన, అత్యంత ప్రభావవంతమైన చికిత్స బిగ్గరగా నవ్వడం అని మీకు తెలుసా? నవ్వు మీ మానసిక స్థితిని తక్షణమే మెరుగుపరచడమే కాకుండా అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. ఒక నివేదిక ప్రకారం, నవ్వు కార్టిసాల్ వంటి ఒత్తిడి హార్మోన్లను తగ్గిస్తుంది. రోగనిరోధక కణాలను పెంచుతుంది. ఇది శరీర రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. వ్యాధుల నుండి రక్షిస్తుంది. మనం నవ్వినప్పుడు, మన హృదయ స్పందన రేటు కొద్దిసేపు పెరుగుతుంది. తరువాత కండరాల సడలింపు, రక్తపోటు తగ్గుతుంది. ఇది శరీరమంతా రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఫలితంగా, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. బిగ్గరగా నవ్విన తర్వాత, డయాఫ్రాగమ్, ఊపిరితిత్తులు చురుగ్గా మారుతాయి. ఇది ఆక్సిజన్ స్థాయిలను పెంచుతుంది. ఊపిరితిత్తులలో చిక్కుకున్న గాలిని బయటకు పంపుతుంది. బిగ్గరగా నవ్వడం వల్ల శరీరంలో ఆక్సిజన్ పరిమాణం పెరుగుతుందని, శ్వాస తీసుకోవడం సులభతరం అవుతుంది. నవ్వు ఒత్తిడి హార్మోన్లను తగ్గిస్తుంది. డోపమైన్, సెరోటోనిన్ వంటి ఆనందాన్ని కలిగించే న్యూరోకెమికల్స్‌ను పెంచుతుంది. ఇది ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తుం. మనకు మంచి అనుభూతిని కలిగిస్తుంది. మనం మన భాగస్వాములతో, స్నేహితులతో, సహోద్యోగులతో లేదా కుటుంబ సభ్యులతో నవ్వుతున్నా, నవ్వు సంబంధాలలో సాన్నిహిత్యాన్ని, నమ్మకాన్ని పెంపొందిస్తుంది. నవ్వు ఒత్తిడిని కూడా తగ్గిస్తుంది. విభేదాలను పరిష్కరించడంలో సహాయపడుతుంది. ఇతరులను అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది.

# ఈ లక్షణాలను లైట్ తీసుకోవద్దు



స్థూలకాయులలో కొవ్వు కాలేయ (ఫ్యాటీ లివర్) సమస్యలు సర్వసాధారణం.. కానీ ప్రజలు తరచుగా సన్నగా ఉన్నవారికి వాటితో బాధపడరని అనుకుంటారు.. అది తప్పు. ఈ రోజుల్లో, సన్నగా ఉన్నవారికి కూడా కొవ్వు కాలేయ సమస్యలు వచ్చే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ రోజుల్లో, అనారోగ్యకరమైన ఆహారాలు, చెడు ఆహారపు అలవాట్లు, పేలవమైన జీవనశైలి.. ఫ్యాటీ లివర్ సమస్యలకు దారితీస్తాయి.. అయితే.. ఊబకాయం, బొడ్డు కొవ్వు ఉన్న వారికి ఫ్యాటీ లివర్ సమస్య ఎక్కువగా ఉంటుందని పేర్కొంటారు.. కానీ అలా కాదు.. సన్నగా బక్కగా ఉన్నవారు కూడా ఇప్పుడు ఫ్యాటీ లివర్ సమస్యను ఎదుర్కొంటున్నారు. ఫ్యాటీ లివర్ (కొవ్వు కాలేయం) అనేది అధిక కొవ్వు పేరుకుపోవడం ద్వారా వర్గీకరించబడిన ఒక పరిస్థితి. కాలేయంలో అధిక కొవ్వు పేరుకుపోయినప్పుడు, అది లివర్ సిర్రోసిస్‌కు దారితీస్తుంది. ఫిట్‌నెస్ పట్ల స్పృహ ఉన్న యువకులు ఫ్యాటీ లివర్ సమస్యలను ఎదుర్కొంటున్నారని.. దీని విషయంలో జాగ్రత్త తప్పనిసరి అని నిపుణులు చెబుతున్నారు. సన్నగా బక్కగా కనిపించే యువత కూడా ఫ్యాటీ లివర్ బారిన పడవచ్చు. బరువు పెరగడం, ఎక్కువసేపు కూర్చోవడం, ఆహారపు అలవాట్లు సరిగా లేకపోవడం వల్ల ఫ్యాటీ లివర్ వ్యాధి వస్తుందని నమ్ముతారు. ఈ రోజుల్లో, సన్నగా ఉన్నవారు కూడా ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడుతున్నారు. బయటి నుండి ఫిట్‌గా కనిపించే వ్యక్తులు జీవక్రియపరంగా ఆరోగ్యంగా ఉండకపోవచ్చు. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, సన్నగా కనిపించే, వ్యాయామం చేసే కొంతమందిలో విసెరల్ ఫ్యాట్ ఉండవచ్చు. ఈ రకమైన కొవ్వు చర్మం కింద కాకుండా శరీర అంతర్గత అవయవాలను చుట్టుముడుతుంది. ఈ దాచిన కొవ్వు శరీరంలో చాలా చురుకుగా ఉంటుంది. ఫిట్‌నెస్ లోపం ఉన్న వ్యక్తులలో విసెరల్ ఫ్యాట్ ఫ్యాటీ లివర్ సమస్యలకు దారితీస్తుంది. సన్నగా ఉన్నవారిలో ఫ్యాటీ లివర్ నిశ్శబ్దంగా అభివృద్ధి చెందుతుంది. దీని లక్షణాలు చాలా సాధారణం. ఫ్యాటీ లివర్ అలసట, పక్కటెముకల కింద తేలికపాటి నొప్పి, బరువు – అసౌకర్యాన్ని కలిగిస్తుంది. ఈ సంకేతాలను తరచుగా నిర్లక్ష్యం చేస్తారు. సన్నగా ఉన్నవారు తరచుగా రోగ నిర్ధారణ ఆలస్యంగా ఎదుర్కొంటారు. కాలేయ ఆరోగ్యాన్ని బాహ్య బరువు ద్వారా నిర్ణయించకూడదు. యోగా లేదా జిమ్‌ను క్రమం తప్పకుండా సాధన చేసే వ్యక్తులు లోపల ఏమి జరుగుతుందో గమనించాలి. కొవ్వు కాలేయం అనేది అధిక బరువు ఉన్నవారికి మాత్రమే వచ్చే వ్యాధి కాదు.. ఇది జీవనశైలి, జన్యుశాస్త్రం, అంతర్గత జీవక్రియ నమూనాల ద్వారా నిర్ణయించబడిన సమస్య అని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

# రక్తపోటును తొలగించే డ్రింక్?



మహిళల్లో చాలా మందికి రక్తహీనత సమస్య ఉంటుంది. రక్తహీనత వల్ల పలు రకాల వ్యాధులు వచ్చే అవకాశం కూడా ఉంది. అంతేకాకుండా రక్త హీనతతో బాధపడేవారిలో తీవ్రమైన బలహీనతను కూడా ఉంటుంది. మహిళల్లో చాలా మందికి రక్తహీనత సమస్య ఉంటుంది. రక్తహీనత వల్ల పలు రకాల వ్యాధులు వచ్చే అవకాశం కూడా ఉంది. అంతేకాకుండా రక్త హీనతతో బాధపడేవారిలో తీవ్రమైన బలహీనతను కూడా ఉంటుంది.అలాంటి సందర్భాల్లో వైద్యులను సంప్రదించి రక్తం వృద్ధికి మందులు తీసుకోవల్సి ఉంటుంది. మీకూ రక్తహీనత ఉంటే వైద్యులు సూచించిన మందులతోపాటు ఆహారంలోనూ పలు మార్పులు చేర్చుకోవాల్సి ఉంటుంది. అవేంటంటే. రక్త పరిమాణాన్ని పెంచడంలో బీట్‌రూట్ దుంపలు చాలా కీలక పాత్ర పోషిస్తాయి. రక్త పరిమాణాన్ని పెంచడానికి బీట్‌రూట్ కంటే ప్రయోజనకరమైనది మరొకటి లేదు. రక్తం వృద్ధికి మీ ఆహారంలో వివిధ పద్ధతుల్లో దుంపలను చేర్చుకోవడం మంచిది. బీట్‌రూట్‌తో కూడా వివిధ వంటకాలు తయారు చేసుకోవచ్చు. బీట్‌రూట్‌తో పాటు, పాలకూర కూడా రక్త పరిమాణాన్ని పెంచడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. పాలకూరను ఆహారంలో వివిధ మార్గాల్లో తీసుకోవడం ద్వారా రక్త పరిమాణాన్ని పెంచడంలో సహాయపడుతుంది. పాలకూరను రోజూ ఆహారంలో తీసుకోవడం వల్ల తక్కువ రక్తపోటు సమస్యను శాశ్వతంగా తొలగిస్తుంది. ఆరోగ్యంగా ఉండటానికి ఉదయం ఖాళీ కడుపుతో బీట్‌రూట్, పాలకూర జ్యూస్ తాగడం మంచిది.

# బిజినెస్

## రూ. 4,000 పెరిగిన బంగారం.. తులం ఇప్పుడు రూ. 1.37 లక్షలు

బంగారం ధరలు మరోసారి కొత్త రికార్డు గరిష్టాలకు చేరాయి. అంతర్జాతీయ పరిణామాలకు తోడు దేశీయ మార్కెట్లో భారీ గిరాకీ కారణంగా ధరలు దూసుకెళ్తున్నాయి. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం, సోమవారం దేశ రాజధాని ఢిల్లీలో బంగారం ధర ఒక్కరోజే రూ. 4,000 పెరిగి రూ. 1,37,600కి చేరుకుంది. హైదరాబాద్ మార్కెట్లో స్వచ్ఛమైన పది గ్రాముల బంగారం రూ. 1,35,480కి చేరింది. ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల పసిడి 10 గ్రాములు రూ. 1,24,100కి పెరిగింది. అంతర్జాతీయ స్పాట్ గోల్డ్ ధర 4,350 డాలర్లకు పెరగడంతో, దేశీయ మార్కెట్‌లోనూ ర్యాలీ కొనసాగిందని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ, కరెన్సీ విభాగం వైస్ ప్రెసిడెంట్, రీసెర్చ్ అనలిస్ట్ జతీన్ త్రివేది అన్నారు. ప్రధానంగా సురక్షిత పెట్టుబడి సాధనంగా బంగారానికి డిమాండ్ పెరుగుతుండటంతో పాటు అమెరికాకు చెందిన నాన్-ఫార్మ్ పెరోల్స్ సహా ఆ దేశ ఆర్థిక డేటాపై అంచనాల కారణంగా ధరలు రికార్డు గరిష్ఠాలకు చేరాయి. ఇప్పుడందరి దృష్టి యూఎస్ ఆర్థిక డేటాపై ఉండటమే ధరల పెరుగుదలను ప్రభావితం చేస్తున్నాయని జతీన్ త్రివేది వివరించారు. ప్రస్తుత క్యాలెండర్ ఏడాదిలో బంగారం ధరలు ఏకంగా 74.3 శాతం పెరిగాయి. 2024, డిసెంబర్ 31న 10 గ్రాముల పసిడి రూ. 78,950 ఉంది. అంటే ఈ ఏడాదిలో ఇప్పటివరకు బంగారం రూ. 58,650 పెరిగింది. మరోవైపు, వెండి ధరలు రూ. 5,000 పెరిగి రూ. 2,15,000 (అన్ని పన్నులతో కలిపి)కి చేరుకుంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు వెండి కూడా భారీగా పెరిగింది. 2024, డిసెంబర్ 31న కిలో రూ. 89,700 ఉండగా, 122.41 శాతం పెరిగి రూ. 2.15 లక్షలకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ఔన్స్ 1.16 శాతం పెరిగి 4,350.06 డాలర్లకు చేరింది. గత ఐదు సెషన్లలో ఔన్స్ బంగారం 3.80 శాతం పెరిగింది. ఔన్స్ వెండి 3.24 శాతం పెరిగి 63.96 డాలర్లకు చేరుకుంది.

## మరో పావలా పతనమైన రూపాయి



భారత కరెన్సీ రూపాయి మారకం విలువ రోజురోజుకు మరింత పతనమవుతోంది. గతవారం వరుసగా రికార్డు పతనాన్ని చూసిన తర్వాత సోమవారం రూపాయి విలువ ఇప్పటివరకు ఎన్నడూ లేనంత కనిష్ఠ స్థాయి రూ. 90.80కి క్షీణించింది. ఆ తర్వాత కొంత కోలుకున్నప్పటికీ, అమెరికా డాలరుతో రూపాయి విలువ రూ. 90.74 వద్ద స్థిరపడింది. గతవారం ముగింపుతో పోలిస్తే ఇది 25 పైసల నష్టాన్ని నమోదు చేసింది. భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి కొనసాగుతుండటం, భారత ఈక్విటీల నుంచి విదేశీ నిధులు తరలిపోతుండటం ఇందుకు ప్రధాన కారణాలు అని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతేకాకుండా దిగుమతిదారుల నుంచి అమెరికా డాలర్‌కు భారీ డిమాండ్ ఉండటం, ప్రస్తుతం ఉన్న రిస్క్‌తో కూడిన మార్కెట్ ధోరణి పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను మరింత దెబ్బతీసిందని ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు. భారత రూపాయి రికార్డు కనిష్ట స్థాయికి పడిపోయింది, ఇది ఆసియా కరెన్సీలలో అత్యంత బలహీన కరెన్సీగా నిలిచింది. ఊహించిన దానికంటే మెరుగైన వాణిజ్య గణాంకాలు నమోదైనప్పటికీ, రూపాయికి మద్దతు లభించలేదని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ పరిశోధన విశ్లేషకుడు దిలీప్ పర్మార్ అన్నారు. ఇందుకు ప్రధానంగా డిమాండ్-సరఫరా అసమతుల్యతకు కారణమని, దిగుమతిదారుల నుంచి డాలర్ డిమాండ్, విదేశీ నిధులు తరలిపోవడం కారణంగా రూపాయిపై ప్రతికూల ప్రభావం కొనసాగుతోందని దిలీప్ పర్మార్ వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రూ. 90.95 వద్ద, బలహీనపడితే రూ. 90.50 వద్ద స్థిరపడే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి భారత్-అమెరికా ప్రయత్నాలు చేస్తున్నాయి. మరోవైపు, అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లో డాలరు ఇండెక్స్ రూ. 98.23 వద్ద ట్రేడవుతోంది.

# మెరుగైన టోకు ధరల సూచీ



టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం మెరుగైంది. నవంబర్‌లో 0.32శాతం పెరిగింది. అంతకు ముందు నెల అక్టోబర్‌లో -1.21శాతానికి తగ్గిన విషయం తెలిసిందే. గతేడాది నవంబర్‌లో ఈ రేటు 2.16శాతంగా నమోదైంది. నెలవారీ ప్రాతిపదికన పప్పులు, కూరగాయల వంటి ఆహార పదార్థాల ధరలు పెరగడంతో టోకు ద్రవ్యోల్బణంలో కొంత మెరుగైంది. నవంబర్ 2025లో ద్రవ్యోల్బణం ప్రతికూల స్థాయిలో ఉండడానికి ప్రధాన కారణం ఆహార పదార్థాలు, ముడి పెట్రోలియం, సహజ వాయువు, ప్రాథమిక లోహాల నిర్మాణం, విద్యుత్ ధరలు తగ్గడమే అని పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. టోకు ధరల సూచీ టోకు స్థాయిలో వస్తువుల ధరల్లో సగటు మార్పును సూచిస్తుంది. నవంబర్‌లో ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం 4.16 శాతంగా ఉండగా.. అక్టోబర్‌లో ఇది 8.31 శాతంగా ఉంది. నవంబర్‌లో కూరగాయలలో ద్రవ్యోల్బణం 20.23 శాతంగా ఉండగా.. అక్టోబర్‌లో ఇది 34.97 శాతంగా ఉంది. నవంబర్‌లో పప్పుధాన్యాల్లో ద్రవ్యోల్బణం 15.21 శాతంగా ఉండగా.. బంగాళదుంప, ఉల్లిపాయల్లో వరుసగా 36.14 శాతం, 64.70 శాతంగా నమోదైంది. తయారీ ఉత్పత్తుల విషయంలో అక్టోబర్‌లో 1.54 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం నవంబర్‌లో 1.33 శాతానికి తగ్గింది. ఇంధనం, విద్యుత్ ధరలు అక్టోబర్‌లో 2.55 శాతంతో పోలిస్తే, 2.27 శాతం ప్రతికూల ద్రవ్యోల్బణం నమోదైంది. గత వారం విడుదలైన గణాంకాల ప్రకారం.. పెరుగుతున్న ఆహార ధరల కారణంగా నవంబర్‌లో సీపీఐ రికార్డు కనిష్ట స్థాయి 0.25 శాతం నుంచి స్వల్పంగా పెరిగి 0.71 శాతానికి చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తక్కువ ద్రవ్యోల్బణం కారణంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పాలసీ వడ్డీ రేట్లను 1.25 శాతం పాయింట్లు తగ్గించింది. ఈ నెల ప్రారంభంలో రిజర్వ్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణ అంచనాను అంతకుముందు 2.6 శాతం నుంచి 2 శాతానికి తగ్గించింది. ఎందుకంటే ఆర్థిక వ్య-క్ ప్రధానంగా రిటైల్ ద్రవ్యోల్బణాన్ని పర్యవేక్షించడం ద్వారా వడ్డీ రేట్లను నిర్ణయిస్తుంది. ఈ నెల ప్రారంభంలో ఆర్‌బీఐ కీలక పాలసీ వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు కోత విధించి 5.25 శాతానికి తగ్గించింది. గత వారం రిజర్వ్ బ్యాంక్ 2026 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 6.8 శాతం నుంచి 7.3 శాతానికి పెంచింది. భారత్ సెప్టెంబర్ త్రైమాసికంలో 8.2 శాతం, జూన్ త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి చెందింది.

# పదేళ్ల గరిష్ట స్థాయికి చేరిన భారత ఎగుమతులు




భారత వాణిజ్య లోటు గణనీయంగా దిగొచ్చింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, ఈ ఏడాది నవంబర్‌లో దేశ వాణిజ్య లోటు 24.53 బిలియన్ డాలర్లు(రూ. 2.22 లక్షల కోట్లు)గా నమోదైంది. గతేడాది ఇదే సమయంలో ఇది 31.93 బిలియన్ డాలర్లు(రూ. 2.89 లక్షల కోట్లు)గా ఉంది. మరోవైపు, నవంబర్ నెలలో దేశ దిగుమతులు 1.88 శాతం తగ్గి 62.66 బిలియన్ డాలర్లు(రూ. 5.68 లక్షల కోట్ల)కు చేరాయి. ఎగుమతులు మాత్రమే ఏకంగా 23.15 శాతం పుంజుకుని 38.13 బిలియన్ డాలర్ల(రూ. 3.46 లక్షల కోట్ల)కు చేరుకున్నాయి. ఇది గడిచిన 10 ఏళ్లలోనే అత్యధికం కావడం విశేషం. ఎగుమతులు ఈ స్థాయిలో వృద్ధి సాధించేందుకు ఇంజనీరింగ్ వస్తువులు, ఎలక్ట్రానిక్స్, రత్నాభరణాలు, డ్రగ్స్, ఫార్మా వంటి రంగాలు ప్రధాన చోదకాలుగా ఉన్నాయని వాణిజ్య కార్యదర్శి రాజేష్ అగర్వాల్ తెలిపారు. సమీక్షించిన నెలలో బంగారం దిగుమతులు 60 శాతం తగ్గాయి. బంగారం కాకుండా, పెట్రోలియం ఉత్పత్తులు, వంట నూనె, బొగ్గు దిగుమతులలో కూడా గణనీయమైన క్షీణత కనిపించిందని ప్రభుత్వ డేటా స్పష్టం చేస్తోంది. ఇక, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-నవంబర్ మధ్య కాలంలో ఎగుమతులు 2.62 శాతం పెరిగి 292.07 బిలియన్ డాలర్ల(రూ. 26.50 లక్షల కోట్ల)కు చేరుకోగా, ఈ ఎనిమిది నెలల కాలంలో దిగుమతులు 5.59 శాతం పెరిగి 515.21 బిలియన్ డాలర్ల(రూ. 46.75 లక్షల కోట్ల)కు చేరాయి. డేటా ప్రకారం, నవంబర్‌లో అమెరికాకు గతేడాది కంటే 22 శాతం ఎక్కువగా 6.97 బిలియన్ డాలర్ల(రూ. 63.24 వేల కోట్ల) విలువైన ఎగుమతులు జరిగాయి. టారిఫ్‌లు విధించినప్పటికీ, మేము అమెరికాకు ఎగుమతులను కొనసాగించగలిగామని రాజేష్ అగర్వాల్ అన్నారు. అయితే, ఇరు దేశాలు స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తున్నాయని తెలిపారు. వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి భారత్ ప్రస్తుతం అమెరికాతో చర్చలు కొనసాగిస్తోంది.

# సోర్ట్స్

# కేకేఆర్ జట్టులోకి శ్రీలంక ఫాస్ట్ బౌలర్.. రూ.18కోట్లు పలికిన మతీషా పతిరానా!

ఐపీఎల్ 2026 వేలం అబుదాబి వేదికగా రసవత్తరంగా సాగుతున్నది. 77 స్లాట్స్ కోసం భారత, విదేశీ క్రికెటర్లు పోటీపడుతున్నారు. ఇప్పటి వరకు సాగిన వేలంలో అత్యధికంగా ఆస్ట్రేలియా క్రికెటర్ కామెరాన్ గ్రీన్ అత్యధికంగా రూ.25.20 కోట్లకు కోల్‌కతా నైట్ రైడర్స్ కొనుగోలు చేసింది. దాంతో ఐపీఎల్‌లో అత్యధిక ధరకు అమ్ముడయిన విదేశీ ఆటగాడిగా గ్రీన్ నిలిచాడు. శ్రీలంక ఫాస్ట్ బౌలర్ మతీషా పతిరానా కోసం పలు జట్లు పోటీపడ్డాయి. రూ.2కోట్ల బేస్ ప్రైజ్‌తో వేలంలోకి వచ్చిన ఈ ఫాస్ట్ బౌలర్ కోసం ఢిల్లీ, లక్నో జట్లు పోటీపడ్డాయి. ఇరు జట్లు రూ.13కోట్ల వరకు వెళ్లాయి. మధ్యలో కేకేఆర్ సైతం ఎంట్రీ ఇచ్చింది. అదే సమయంలో సీఎస్‌కే సైతం ఆసక్తిని మళ్లీ జట్టులోకి తీసుకునేందుకు ఆసక్తి చూపింది. రూ15కోట్లకు బిడ్ వేసింది. కేకేఆర్ రూ.16కోట్లకు కొనుగోలు బిడ్ వేసింది. అయితే, లక్నో ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. కోల్‌కతా రూ.18కోట్లకు వేలంలో దక్కించుకొని తమ జట్టులో చేర్చుకుంది. ఐపీఎల్ వేలంలో ఇప్పటికే కామెరూన్ గ్రీన్‌ను రికార్డు ధరకు దక్కించుకున్న కేకేఆర్ తాజాగా.. శ్రీలంక ఫాస్ట్‌బౌలర్‌ను సైతం రూ.18కోట్లకు కొనుగోలు చేసి అందరినీ షాక్‌కు గురి చేసింది. మిచెల్ స్టార్క్ స్థానాన్ని భర్తీ చేసేందుకు కేకేఆర్ డెత్ బౌలర్‌ను జట్టులోకి తీసుకోవాలని భావించింది. దాంతో పతిరానా కోసం తీవ్రంగా పోటీ పడింది. డెత్ ఓవర్లలో పతిరానా దిట్ట. యార్కర్లు వేయడంలో స్పెషలిస్ట్. అందుకే ఈ







లంక బౌలర్‌ను బేబీ మలింగగా పిలుస్తుంటారు. పతిరానా గతంలో చెన్నై తరఫున నిలడగా రాణించాడు. మతీషా పతిరానా ఐపీఎల్‌లో 32 మ్యాచుల్లో 1016 పరుగులు చేయడంతో పాటు 47 వికెట్లు పడగొట్టాడు.

## కుర్రాళ్లకు జాక్‌పాట్.. రూ.14.20 కోట్లు పలికిన చిచ్చరపిడుగులు..!

ఐపీఎల్ మినీ వేలంలో కుర్రాళ్లు సైతం భారీ ధర పలుకుతున్నారు. దేశవాళీ క్రికెట్‌లో దంచేస్తున్న.. వికెట్ల వేటతో రెచ్చిపోతున్న ఆటగాళ్లపై ఫ్రాంచైజీలు కోటీశ్వరులను చేస్తున్నాయి. జమ్ముకశ్మీర్ పేసర్ అకీబ్ దార్ రూ.8.40 కోట్లు పలకగా.. ఉత్తరప్రదేశ్ కుర్రాడు ప్రశాంత్ వీర్ ఏకంగా రూ.14.20 కోట్లు కొల్లగొట్టాడు. మరో యంగ్‌స్టర్ కార్తిక్ శర్మ ను సైతం రూ.14.20 కోట్లకు దక్కించుకుంది చెన్నై సూపర్ కింగ్స్. దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్న కుర్రాళలు ఐపీఎల్ వేలంలో కోట్లు పలుకుతున్నారు. విధ్వంసక ఆటగాడైన ప్రశాంత్ వీర్ రూ.30 లక్షలతో వేలంలోకి రాగా.. అతడిని రూ.14.20 కోట్లకు పట్టేసింది చెన్నై సూపర్ కింగ్స్. అలానే వికెట్ కీపర్, బ్యాటర్ అయిన కార్తిక్ శర్మ కోసం కోల్‌కతా నైట్ రైడర్స్‌తో పోటీపడిన సీఎస్కే చివరకు రూ.14.20 కోట్లకు దక్కించుకుంది. నిఖార్సైన రవీంద్ర జడేజా స్థానాన్ని వీరిలో భర్తీ చేయాలనే ఉద్దేశంతోనే ప్రశాంత్, కార్తిక్‌లై చెన్నై ఫ్రాంచైజీ కోట్లు కుమ్మరించింది. లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటరైన ప్రశాంత్ ఇటీవల యూపీ టీ20లో 155.34 స్ట్రయిక్ రేటుతో 320 పరుగులు సాధించాడు. బంతితోనూ రాణించి 8 వికెట్లు కూల్చాడీ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్. ఇక సయ్యద్ ముస్తాక్ అలీ



ట్రోఫీలో ఆరు ఇన్నింగ్స్‌ల్లో 112 రన్స్.. బంతితోనూ తిప్పేస్తూ 9 వికెట్లు పడగొట్టాడు. 19 ఏళ్ల కార్తిక్ ఇప్పటివరకూ టీ20ల్లో 12 మ్యాచుల్లో 162.93 స్ట్రయిక్ రేటుతో 334 పరుగులు సాధించాడు.

## ఒకప్పుడు మ్యాచ్ విన్నర్లు.. ఇప్పుడేమో కనీస ధర పలకలే..!



ఐపీఎల్ మినీ వేలంలో యువక్రికెటర్లు కోట్లు కొల్లగొడుతుంటే.. గత సీజన్లలో దంచేసిన ఆటగాళ్లకు మాత్రం చుక్కెదురైంది. కనీస ధరకు కూడా వీళ్లను కొనేందుకు ఏ ఫ్రాంచైజీ ఆసక్తి చూపించలేదు. ఫలితంగా పృథ్వీ షా విజయ్ శంకర్, రచిన్ రవీంద్ర బెయిర్‌స్టో, రహ్మానుల్లా గుర్బాజ్ వంటి స్టార్లు నిరాశకు లోనయ్యారు. వీరిలో పాటు న్యూజిలాండ్, ఆస్ట్రేలియా ప్లేయర్లకు కూడా వేలంలో బిగ్ షాక్ తగిలింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ వేలంపై భారీ ఆశలు పెట్టుకున్న క్రికెటర్లకు ఊహించని షాకిచ్చాయి ఫ్రాంచైజీలు. గతంలో మ్యాచ్ విజేతలుగా పేరొందిన రచిన్ రవీంద్ర, బెయిర్‌స్టో, డెవాన్ కాన్వే, లివింగ్‌స్టోన్ వంటి హిట్టర్లను కనీస ధరకు కూడా ఎవరూ కొనలేదు. ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో అర్ధ శతకాలతో రెచ్చిపోయిన పృథ్వీ షా, సర్ఫరాజ్ ఖాన్‌లను సైతం ఫ్రాంచైజీలు పట్టించుకోలేదు. తెలుగు కుర్రాడు శ్రీకర్ భరత్‌ను సైతం వదిలేశారు. ఇక భారత అన్‌క్యాప్డ్ ప్లేయర్లలో శివం మావి, మహిపాల్ లొమ్‌రోర్, అన్మోల్‌ప్రీత్ సింగ్.. తదితరులు వేలంలో అమ్ముడుపోలేదు. అలానే విశ్వవేదికపై చెలరేగిన బౌలర్లు అట్కిన్సన్, మ్యాట్ హెన్రీలను ఎవరూ కొనలేదు. ప్రస్తుతానికి అమ్ముడుపోని ఆటగాళ్ల జాబితా ఇది. భారత క్రికెటర్లు : విజయ్ శంకర్, రాహుల్ చాహర్, ఆకాశ్ దీప్, పృథ్వీ షా, సిమర్జిత్ సింగ్, రాజ్ లింబానీ, తుషార్ రహేజా, రుచిత్ అహిర్, సన్వీర్ సింగ్, కమలేష్ నగర్‌కోటి, తనుష్ కొతియాన్, మహిపాల్ లోమ్‌రోర్, రాజ్‌వర్ధన్ హంగ్రేకర్, ఈడెన్ టామ్, ఆర్య దేశాయ్, యశ్ ధుల్, అభినవ్ మనోహర్, అన్మోల్‌ప్రీత్ సింగ్, అభినవ్ తెజ్రన, అథైర్వ తైడే, శివం మావి, కేఎస్ భరత్, దీపక్ హుడా, సర్ఫరాజ్ ఖాన్, కుమార్ కార్తికేయ సింగ్, విఘ్నేష్ పుతూర్, ప్రశాంత్ సోలంకి, కరన్ శర్మ.

# డేంజర్ జోన్‌లో 'రామ్ పోతినేని' కెరీర్.. హిట్ పడాల్సిందే!



టాలీవుడ్ హీరో రామ్ పోతినేని సరైన విజయం కోసం ఏడేళ్లుగా ఎదురుచూస్తున్నాడు. ఇస్మార్ట్ శంకర్ (2019) విజయం తర్వాత తనకు సరైన హిట్ దక్కలేదు. రెడ్, రొమాంటిక్, ది వారియర్, స్కంద వంటి సినిమాలు వచ్చినప్పటికీ ఏదీ కూడా ప్రేక్షకులను మెప్పించలేదు. రీసెంట్‌గా విడుదలైన ఆంధ్రా కింగ్ తాలుకా మూవీకి పాజిటివ్ రివ్యూలు వచ్చాయి. కానీ, పట్టుమని రెండు వారాలైన గట్టిగా థియేటర్స్‌లో రన్ కాలేకపోయింది. ప్రస్తుతం రామ్ 40ఏళ్లకు దగ్గర్లో ఉన్నాడు. కొద్దిరోజులుగా తన పెళ్లి వార్తలు కూడా సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలోనే తన సినీ కెరీర్ కూడా పెద్దగా చెప్పుకునే విధంగా లేదు. ఇలాంటి సమయంలో ఆయన నిర్ణయం ఎటూ అనేది తేల్చుకోవడం కాస్త కష్టమే అని చెప్పాలి. స్కంద వంటి మాస్ సినిమాను కూడా జనం చూడలేదు. డబుల్ ఇస్మార్ట్ అని చెప్పినా సరే థియేటర్ వైపు ప్రేక్షకులు చూడలేదు. సరే అని ఆంధ్రా కింగ్ తాలుకా అంటూ కొత్త ప్రయత్నం చేస్తే పాజిటివ్ రివ్యూలు వచ్చాయి. కానీ, ప్రేక్షకులు లేరు. దీనికి కారణం తనకంటూ ఒక ఫ్యాన్ బేస్‌ను క్రియేట్ చేసుకోవడంలో పూర్తిగా విఫలం అయ్యాడు. ఈ మూవీ కోసం మైత్రి లాంటి పెద్ద నిర్మాణ సంస్థ భారీ పెట్టుబడి పెట్టింది. చివరకు నష్టాలను చూసింది. ఇప్పుడు రామ్ ఎలాంటి సినిమా తీస్తే జనాలు చూస్తారనే క్లారిటీ కూడా లేదు. కథ పరంగా ఎలాంటి జోనర్ టచ్ చేసినా సరే.. ఫెయిల్యూర్ వెంటాడుతూనే ఉంది. ఆంధ్రా కింగ్ తాలుకా మూవీకి మంచి టాక్ వచ్చింది. కానీ, అనుకున్నంత రేంజ్‌లో కలెక్షన్స్ లేవు. వరుస పరాజయాల కారణంగా తన సినిమాలకు థియేటర్ మార్కెట్ చాలా వరకు పడిపోయింది. 20 ఏళ్లకు పైగా ఇండస్ట్రీలో కొనసాగుతున్న ఒక హీరోకు కనీసం రూ. 20 కోట్లు కలెక్షన్స్ కూడా రాకుంటే పరిస్థితి అర్థం అవుతుంది. ఇలాంటి సమయంలో ఓటీటీ మార్కెట్ సంగతి ఎలా ఉంటుందో అందరికీ తెలిసిందే. వార్2తో ఎన్టీఆర్, గేమ్ ఛేంజర్ చిత్రంతో రామ్ చరణ్ కూడా దారుణమైన ట్రోలింగ్ ఎదుర్కొన్నారు. కానీ, వారికి బలమైన ఫ్యాన్ బేస్ ఉంది. దీంతో త్వరగానే బౌన్స్‌బ్యాక్ అయ్యే ఛాన్స్ ఉంది. అయితే, రామ్ పోతినేనికి బలమైన కథతో పాటు సరైన దర్శకుడు దొరికితేనే నిలిదొక్కుకునే అవకాశం



# సంక్రాంతికి ప్రభాస్ 'రాజాసాబ్'.. మూడు గంటల నిడివి హాట్ టాపిక్‌గా మారిందా?


పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రం 'రాజాసాబ్' సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అయితే ఈ సినిమాపై మొదటి నుంచి మిశ్రమ అంచనాలే నెలకొన్నాయి. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడటం, విడుదలైన టీజర్, ట్రైలర్‌లు పెద్దగా ఇంపాక్ట్ చూపించకపోవడంతో ప్రేక్షకుల్లో, ముఖ్యంగా అభిమానుల్లో కూడా హైప్ అంతగా కనిపించడం లేదు. ఇదిలా ఉండగా, తాజాగా రాజాసాబ్ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికర సమాచారం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న ఈ హారర్ కామెడీ చిత్రం షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. అయితే షూటింగ్ సమయంలో తీసిన మొత్తం ఫుటేజ్‌ను కలిపితే దాదాపు నాలుగు గంటలకు పైగా వచ్చిందని ఇండస్ట్రీ వర్గాల సమాచారం. దీంతో ఎడిటింగ్ టేబుల్‌పై భారీ కత్తెర పడినట్లు తెలుస్తోంది. ఎంత ఎడిటింగ్ చేసినా సినిమా నిడివి మూడు గంటల 15 నిమిషాల కంటే తక్కువకు రావడం కష్టమయ్యిందట. చివరికి దర్శకుడు మారుతి, ప్రభాస్ కలిసి చర్చించుకుని మూడు గంటల 10 నిమిషాల నిడివి వద్ద ఫైనల్ కట్‌ను లాక్ చేసినట్లు సమాచారం. 'రాజాసాబ్' ఒక హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ కావడంతో పాటు ప్రభాస్%-%హీరోయిన్లపై పాటలు, కామెడీ ట్రాక్స్ ఎక్కువగా ఉంటాయని టాక్. ఇలాంటి జానర్ సినిమాకు మూడు గంటల పది నిమిషాల నిడివి ప్రేక్షకులను థియేటర్లలో కూర్చోబెట్టగలదా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒకప్పుడు ఎన్టీఆర్, ఏఎన్నార్ కాలంలో నాలుగు గంటలు, మూడున్నర గంటల సినిమాలు సాధారణంగా ఉండేవి. కానీ ఇప్పటి ప్రేక్షకుల అభిరుచులు పూర్తిగా మారిపోయాయి. గత కొంతకాలంగా మళ్లీ మూడు గంటలకు పైగా నిడివి ఉన్న సినిమాలు వస్తున్నప్పటికీ, అవి కంటెంట్ బలంగా ఉన్నప్పుడే ప్రేక్షకులను మెప్పిస్తున్నాయి. రాజాసాబ్ సినిమాపై ప్రస్తుతం ఫ్యాన్స్ కూడా పెద్దగా అంచనాలు పెట్టుకోవడం లేదు. అయినప్పటికీ ప్రభాస్ స్టార్ పవర్, సంక్రాంతి సీజన్ అడ్వాంటేజ్ కలిసి వస్తే సినిమా ఎలా నిలబడుతుందో చూడాలి. ముఖ్యంగా మూడు గంటల నిడివి ప్రేక్షకుల సహనాన్ని పరీక్షించనుందా? లేక మారుతి కథనం, ప్రభాస్ కామెడీ టైమింగ్‌తో టైమ్ ప్లై అయిపోతుందా? అన్నది రిలీజ్ తర్వాతే తేలాల్సి ఉంది. మొత్తానికి, సంక్రాంతికి రాబోతున్న 'రాజాసాబ్' సినిమా నిడివి ఇప్పుడు కొత్త చర్చకు తెరలేపింది. ఈ మూడు గంటల ప్రయాణం ప్రభాస్ ఫ్యాన్స్‌కు ఫుల్ మీల్స్ అవుతుందా? లేక భారంగా మారుతుందా? అనేది ఆసక్తికరంగా మారింది.

# 'నన్ను మీరే కాదు... ఎవ్వరూ పట్టుకోలేరు'




అమ్మిత్ రావ్, పర్వేజ్ సింబా, ప్రకాశ్ తుమినాడ్, రవి భట్, సంగీత లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'జిన్'. చిన్మయ్ రామ్ దర్శకత్వంలో నిఖిల్ ఎం. గౌడ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న రిలీజ్ కానుంది. 'జిన్ అనేది ఉందుంటే ఒకసారి వచ్చి నా చేతిని టచ్ చేయాలి, నన్ను మీరే కాదు... ఎవ్వరూ పట్టుకోలేరు' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు అతిథిగా హాజరైన నిర్మాత రాజ్ కందుకూరి మాట్లాడుతూ%-% "థియేటర్స్‌లో కరెక్ట్‌గా భయపెడితే ఆడియన్స్ హారర్ చిత్రాలను ఆదరిస్తారు" అన్నారు. "జిన్' ట్రైలర్ నచ్చింది" అన్నారు సోహెల్ మాట్లాడుతూ .. 'తెలుగు ఆడియెన్స్ అన్ని భాషల చిత్రాల్ని, అన్ని భాషల టెక్నీషియన్లను ఆదరిస్తుంటారు. 'జిన్' ట్రైలర్ నాకు చాలా నచ్చింది. స్పూకీ వరల్డ్ అనే ట్యాగ్ లైన్ బాగుంది. జిన్‌లో గుడ్ జిన్ ఉంటుంది.. బ్యాడ్ జిన్ ఉంటుంది. ట్రైలర్ చూస్తే ఇది బ్యాడ్ జిన్ గురించి చెబుతున్నట్టుగా కనిపిస్తోంది. దర్శక, నిర్మాతలకు మంచి విజయం దక్కాలి. డిసెంబర్ 19న ఈ మూవీని అందరూ చూడండి' అని అన్నారు. దర్శకుడు చిన్మయ్ రామ్ మాట్లాడుతూ .. "మా 'జిన్' కోసం వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మా అందరినీ సపోర్ట్ చేసేందుకు డబ్బులు పెట్టి నిర్మించిన నిఖిల్ గారికి థాంక్స్. మా చిత్రం డిసెంబర్ 19న రిలీజ్ అవుతోంది. ఆడియెన్స్ అందరూ మా మూవీని చూడండి. మీరు పెట్టే డబ్బులకు సరిపడా ఎంటర్టైన్మెంట్ ఇస్తామ'ని అన్నారు.

# హైప్ లేని చిరు 'విశ్వంభర'.. పవర్‌ఫుల్ టీజర్‌ని ప్లాన్ చేస్తున్న మేకర్స్




మెగాస్టార్ చిరంజీవి డ్రీమ్ ప్రాజెక్ట్‌గా భావిస్తున్న అడ్వెంచర్ ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' వాయిదా పడిన విషయం తెలిసిందే. రెండేళ్ల క్రితం భారీ అంచనాల మధ్య ప్రారంభమైన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. ముందుగా ఈ చిత్రాన్ని 2026 సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా విశ్వంభర సినిమా టీజర్‌ను కూడా విడుదల చేశారు. ఈ టీజర్‌లో నాసిరకం విజువల్స్ ఉండడంతో అభిమానుల నుంచి పెద్దఎత్తున్న విమర్శలు వచ్చాయి. దీంతో ఈ సినిమా %ఎఖీశ%పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అద్భుతమైన విజువల్ ఫీస్ట్ అనుభవాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం 2026 సమ్మర్లో విడుదలయ్యే అవకాశం ఉంది. ఇప్పటివరకు, 'విశ్వంభర'పై సాధారణ ప్రేక్షకులు, మెగా ఫ్యాన్స్ నుంచి ఆశించిన స్థాయిలో ఆసక్తి కనిపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సినిమాపై అంచనాలను భారీగా పెంచేందుకు మేకర్స్ త్వరలోనే పవర్‌ఫుల్ టీజర్ను విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ సినిమాతో స్టార్ హీరోయిన్ త్రిష చాలా ఏళ్ల తర్వాత తెలుగు చిత్ర పరిశ్రమలోకి రీ-ఎంట్రీ ఇవ్వనుంది. గతంలో తెలుగులో స్టార్ హీరోలతో అనేక హిట్ చిత్రాల్లో నటించిన త్రిష, కొంతకాలంగా పూర్తిగా తమిళ సినిమాలకే పరిమితమైంది. మెగాస్టార్‌తో ఆమె జోడీ కట్టడంపై ఫ్యాన్స్ ప్రత్యేకంగా ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం చిరంజీవి నటిస్తున్న మన శంకర్ వర ప్రసాద్ గారు చిత్రం విడుదలైన తర్వాతే, విశ్వంభర ప్రమోషన్స్‌ను భారీ ఎత్తున ప్రారంభించేందుకు ప్లాన్ చేస్తున్నట్లు ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి.

# నాకు ఎవరితోనూ పెళ్లి కాలేదు'.. రూమర్స్‌పై మెహరీన్ ఫైర్..!



టాలీవుడ్ హీరోయిన్ మెహరీన్ ఫిర్జాదా గురించి తెలుగు ప్రేక్షకులకు పరిచయం అక్కర్లేదు. కృష్ణగాడి వీర ప్రేమగాథ మూవీతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ పలు సూపర్ హిట్ చిత్రాల్లో నటించింది. వెంకీమామ, వరుణ్ తేజ్ నటించిన ఎఫ్2, ఎఫ్3 సినిమాలతో అభిమానులను మెప్పించింది. అంతేకాకుండా రాజా ది గ్రేట్ చిత్రంలో రవితేజ సరసన కనిపించింది. అయితే సినీతారలపై రూమర్స్ రావడం సహజం. డేటింగ్, పెళ్లి అంటూ ఎప్పుడో ఒకసారి రూమర్స్ వినిపిస్తూనే ఉంటాయి. గతంలో మెహరీన్‌పై కూడా అలాగే వదంతులు వచ్చాయి. మెగా హీరో సాయి ధరమ్ తేజ్‌తో మెహరీన్ ప్రేమలో ఉన్నారంటూ వార్తలొచ్చాయి. ఆ తర్వాత అదంతా ఫేక్ అని తేలిపోయింది. ?అప్పటి నుంచి మెహరీన్ సినిమాలతో బిజీ అయిపోయింది. అయితే తాజాగా మరోసారి మెహరీన్ పెళ్లి అంటూ వార్తలొచ్చాయి. సోషల్ మీడియాలో మరోసారి వైరల్‌గా మారాయి. దీంతో మెహరీన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎలాంటి సమాచారం లేకపోయినా ఇలాంటి వార్తలు రాయడం చూస్తుంటే వింతగా అనిపిస్తోందని ట్వీట్ చేశారు. కేవలం డబ్బుల కోసం పనికిమాలిన వార్తలతో జర్నలిజం పూర్తిగా దెబ్బతినిందని మెహరీన్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఈ విషయంపై రెండు ఏళ్లుగా మౌనంగా ఉన్నానని.. నిరంతరం ఇలాంటి వేధింపుల కారణంగా ఈ రోజు మాట్లాడాల్సి వస్తోందని అన్నారు. తాను ఎవరో ఓ వ్యక్తిని పెళ్లి చేసుకున్నట్లు రాశారని మెహరీన్ ఆవేదన వ్యక్తం చేసింది. తాను ఎప్పుడు కలవని వ్యక్తితో పెళ్లయిందని రాయడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించింది. నాకు ఇప్పటి వరకు ఎవరితోనూ పెళ్లి కాలేదు.. నన్ను నమ్మండి అంటూ పోస్ట్ చేసింది. నేను పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు.. ఈ ప్రపంచం మొత్తానికి తెలిసేలా చేసుకుంటానని మెహరీన్ ఫుల్ క్లారిటీ ఇచ్చేశారు. ఈ ట్వీట్‌తో మెహరీన్ పెళ్లి రూమర్స్‌కు ఇక చెక్ పడినట్లే.

# తయారీ రంగంపై దృష్టి పెట్టాలి

**న్యూఢిల్లీ :** జర్మనీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పర్యటన బిజీబిజీగా సాగుతోంది. ఈ పర్యటనలో భాగంగా మ్యూనిచ్‌లోని బీఎండబ్ల్యూ ప్లాంట్‌ను రాహుల్ గాంధీ సందర్శించారు. అందులోని తాజా మోడల్ కార్లు, ఎలక్ట్రిక్ బైక్‌లు.. ఎం సీరిస్, బీఎండబ్ల్యూ ఐఎస్3, రూల్స్ రాయిస్ తదితర వాహనాలను ఆయన పరిశీలించారు. అనంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. తయారీ రంగంపై దృష్టి పెట్టాలంటూ కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. దేశంలో చిరు వ్యాపారులను పట్టించుకోవడం లేదంటూ కేంద్ర వైఖరిని తప్పుపట్టారు.



ఈ సందర్భంగా తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక వీడియోను పోస్ట్ చేసి ఆయన.. కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. టీవీఎస్ 450 సీసీ మోటర్ సైకిల్‌ను బీఎండబ్ల్యూ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఇది భారతీయ ఇంజినీరింగ్ పనితనానికి గర్వకారణంగా ఉందన్నారు. తయారీ రంగం.. బలమైన ఆర్థికాభివృద్ధికి వెన్నుముక వంటిందని అభివర్ణించారు. కానీ విచారం ఏమింటే.. భారత్‌లో మాత్రం ఈ తయారీ రంగం అనేది తగ్గిపోతుందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధిని వేగవంతం చేయాలంటే.. మనం మరిన్ని ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు. పార్లమెంట్ శీతకాల సమావేశాలు జరుగుతున్నాయి. డిసెంబర్ 15 నుంచి 20వ వరకు జర్మనీ రాజధాని బెర్లిన్ వేదికగా ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ జరుగుతుంది. ఇందులో పాల్గొనేందుకు లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జర్మనీ వెళ్లారు. రాహుల్ చేస్తున్న ఈ పర్యటనపై బీజేపీ వ్యంగ్యంగా స్పందించింది. ఒక వైపు పార్లమెంట్ శీతకాల సమావేశాలు జరుగుతుండగా.. ఆయన విదేశాలకు వెళ్లడం ఏమిటని ప్రశ్నించింది. దేనికి ప్రాధాన్యత ఇవ్వల్లో రాహుల్‌కు తెలియదని ఆ పార్టీ అభిప్రాయపడింది. అంతేకాదు.. లీడర్ ఆఫ్ పర్యటన్ (%ూఢా%), లీడర్ ఆఫ్ పార్టీయింగ్ అని వ్యాఖ్యానించింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ.. ఆయన పర్యటనపై బీజేపీ ఈ సందర్భంగా విమర్శలు గుప్పించింది. బీజేపీ విమర్శలపై రాహుల్ సోదరి ప్రియాంకా గాంధీ కాస్తా ఘాటుగా స్పందించారు. అయితే 2005లో అప్పటి యూపీయే ప్రభుత్వం.. జాతీయ ఉపాధి హామీ పథకం ప్రవేశ పెట్టింది. దీనికి జాతిపిత మహాత్మా గాంధీ పేరు పెట్టింది. తాజాగా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఈ పేరును మార్చేసింది. దీనిపై కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశ చరిత్ర నుంచి గాంధీ, నెహ్రూల పాత్ర చెరిపిసే కుట్ర జరుగుతుందంటూ కాంగ్రెస్ పార్టీ మండిపడింది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఆందోళనకు ఆ పార్టీ పిలుపునిచ్చింది. ఇక పార్లమెంట్ శీతకాల సమావేశాలు డిసెంబర్ 19వ తేదీతో ముగియనున్నాయి. ఈ సమావేశాల చివరి మూడు రోజులు సభ్యులంతా సభకు హాజరు కావాలంటూ ఇప్పటికే ఆ పార్టీ విప్ జారీ చేసింది. మరి ఆ జాబితాలో పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పేరు లేక పోవడం గమనార్హం.

# ఇథియోపియాలో 'వందేమాతరం'

ప్రధాని నరేంద్ర మోదీ తన విదేశీ పర్యటనలో భాగంగా ఇథియోపియాలో పర్యటిస్తున్నారు. జోర్డాన్ పర్యటన ముగించుకుని ఇథియోపియా చేరుకున్న ఆయనకు అక్కడ అరుదైన, మర్చిపోలేని స్వాగతం లభించింది. 15 ఏళ్ల తర్వాత ఆ దేశంలో పర్యటిస్తున్న భారత ప్రధానికి గౌరవ సూచకంగా ఇథియోపియా గాయకులు భారత జాతీయ గీతం 'వందేమాతరం' ఆలపించారు. ఈ అద్భుత ప్రదర్శనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇథియోపియా ప్రధాని అబీ అహ్మద్.. ప్రధాని మోదీ గౌరవార్థం ప్రత్యేక విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా స్థానిక గాయకులు 'వందేమాతరం' గీతాన్ని ఎంతో శ్రావ్యంగా ఆలపించి అందరినీ ఆకట్టుకున్నారు. తమ దేశానికి వచ్చిన భారత ప్రధానికి ఈ విధంగా స్వాగతం పలికారు. ఈ పరిణామంతో పులకించిపోయిన ప్రధాని మోదీ.. గాయకుల ప్రదర్శనను చప్పట్లతో అభినందించారు.

భారతదేశానికి స్ఫూర్తినిచ్చిన వందేమాతరం గీతం 150 వసంతాలు పూర్తి చేసుకున్న తరుణంలో విదేశీ గడ్డపై ఈ గీతాన్ని ఆలపించడం మరింత ప్రత్యేకతను సంతరించుకుంది.



ఈ అరుదైన ఘట్టం ఇరు దేశాల మధ్య సాంస్కృతిక బంధానికి నిదర్శనంగా నిలిచింది.

**ప్రధాని మోదీకి ఇథియోపియా అత్యున్నత పురస్కారం**

ఇథియోపియాలో పర్యటిస్తున్న భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అపూర్వ గౌరవం దక్కింది. అక్కడి ప్రభుత్వం ఆయనకు దేశ అత్యున్నత పురస్కారం 'గ్రేట్ ఆనర్ నిషాన్ ఆఫ్ ఇథియోపియా' తో సత్కరించింది. అడీస్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన ఒక కార్యక్రమంలో ఇథియోపియా ప్రధాని డాక్టర్ అబి అహ్మద్ అలీ.. ప్రధాని మోదీని అవార్డుతో సత్కరించారు. ప్రధాని మోదీ జోర్డాన్ పర్యటనను ముగించుకొని మంగళవారం ఇథియోపియా రాజధాని అడీస్ అబాబాకు చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు ఇథియోపియా ప్రధాని డాక్టర్ అబి అహ్మద్ అలీ సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు పరస్పర ప్రయోజనకరమైన విస్తృతస్థాయి ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొన్నారు. అంతకుముందు జోర్డాన్ రాజధాని అమ్మాన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మోదీ మాట్లాడారు.

వచ్చే ఐదేళ్లలో భారత్-జోర్డాన్ ద్వైపాక్షిక వాణిజ్య బంధం విలువ రెట్టింపై 500 కోట్ల డాలర్ల స్థాయికి చేరుకుంటుందని ఆశాభావం ప్రధాని మోదీ వ్యక్తంచేశారు. భారత ఆర్థిక పురోగతిలో పాలుపంచుకొని లబ్ధి పొందాల్సిందిగా జోర్డాన్ వాణిజ్య సంస్థలకు ఆయన ఆహ్వానం పలికారు. జోర్డాన్ రాజు అబ్దుల్లా-2తో కలిసి ద్వైపాక్షిక వాణిజ్య వేదికపై ప్రసంగించారు. యువరాజు హుసేన్‌తోపాటు జోర్డాన్ వాణిజ్య, పరిశ్రమల శాఖల మంత్రులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# వాయు కాలుష్యం ఆరోగ్యంపై ప్రభావం

దేశ రాజధాని నగరం న్యూఢిల్లీలో వాయుకాలుష్యం భూతం వేయి కాళ్లతో విస్తరిస్తోంది. రోజురోజుకూ పెనుభూతంలా మారుతున్న కాలుష్యం కారణంగా వాయు నాణ్యత రికార్డ్ స్థాయిల్లో క్షీణిస్తోంది. డబ్ల్యూహెచ్వో నివేదిక కంటే 18 రెట్లు ఎక్కువగా ఢిల్లీలోని సూక్ష్మ కణిక పదార్థం 2.5 గా ఉందని అంచనా. ఫలితంగా ఢిల్లీలో రోగాలతో ఆస్పత్రుల్లో చేరుతున్నవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ముసురుకుంటున్న కాలుష్య మేఘాల కారణంగా అనే రోడ్డు ప్రమాదాలు, ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా నమోదవుతున్నాయి. తీవ్రమైన దగ్గు, ఊపిరాడకపోవడం, ఊపిరితిత్తుల పనితీరు బలహీనం కావడం ఇలాంటి సమస్యలతో పాటు,అకాల మరణాలకు దారితీస్తుంది. ఢిల్లీ కాలుష్యంతో లంగ్ క్యాన్సర్ ముప్పు ఉందని శాస్త్రీయ పరిశోధనలలో వెల్లడైంది. పీఎం 2.5, నైట్రోజన్ దయాక్సైడ్ నేరుగా ఊపిరితిత్తుల్లోకి చేరడంతో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. పీఎం 2.5 పెరుగుదలతో లంగ్ క్యాన్సర్ ముప్పు 14శాతం పెరుగుతుందని డబ్ల్యూహెచ్వో నివేదిక ద్వారా తెలుస్తోంది. ఎక్కువసేపు బయట పని ప్రదేశంలో ఉంటున్న యువతీ యువకులపై ఇది మరింత తీవ్ర ప్రభావం చూపుతోంది.

**వాయు కాలుష్యం ఆరోగ్యం పై ప్రభావం**

వాయు కాలుష్యానికి స్వల్ప మరియు దీర్ఘకాలికంగా గురికావడం వల్ల స్ట్రోక్, క్రానిక్ అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్, ట్రాకియా, బ్రోంకస్ ,ఊపిరితిత్తుల క్యాన్సర్‌లు, తీవ్ర ఆస్తమా ,దిగువ శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు లాంటి పలు వ్యాదులు వస్తాయి. వాయు కాలుష్యానికి గురికావడంవల్ల టైప్ 2 దయాబెటిస్, ఊబకాయం, దైహిక వాపు, అల్జీమర్స్ వ్యాధి , చిత్తవైకల్యానికి దారి తీయవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ (చిఉూ) తేల్చింది. ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్ వాయు కాలుష్యాన్ని, ముఖ్యంగా ఖఓ2.5ని క్యాన్సర్‌కు ప్రధాన



కారణంగా వర్గీకరించింది. దీర్ఘకాలికంగా ఈ కాలుష్యం బారిన పడితే శరీరంలోని ప్రతి అవయవాన్ని ప్రభావితం చేస్తుందని, ఇది ఇప్పటికే ఉన్న అనారోగ్య పరిస్థితులనుమరింత తీవ్రతరం చేస్తుందని మరొక ప్రపంచ సమీక్ష కనుగొంది.

ముఖ్యంగా రోగనిరోధక వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న దశలో ఉన్న పిల్లలు,కౌమారదశలో ఉన్న వారిపై మరింత హానికరమైన ప్రభావం ఉటుంది. వాయు కాలుష్యం బాల్యంలో ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. జీవితంలో తరువాతి కాలంలో వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది.

**ఇఇం లెక్కలు**

యూరోపియన్ ఎన్విరాన్‌మెంట్ ఏజెన్సీ తాజా అంచనాల ప్రకారం సూక్ష్మ కణ పదార్థం ఆరోగ్యానికి గణనీయ మైన ప్రభావాలను కలిగిస్తూనే ఉంది. 2021లో, ప్రపంచ ఆరోగ్య సంస్థ వాయు కాలుష్యం మానవ ఆరోగ్యాన్ని ఎలా దెబ్బతీస్తుందో చూపించే తాజా శాస్త్రీయ ఆధారాలను క్రమబద్ధంగా సమీక్షించిన తర్వాత కొత్త గాలి నాణ్యత మార్గదర్శకాలను ప్రచురించింది. దీని ప్రకారం 2050 నాటికి గాలి, నీరు మరియు నేల కాలుష్యాన్ని ఆరోగ్యానికి మరియు సహజ పర్యావరణ వ్యవస్థలకు హానికరం కాని స్థాయికి తగ్గించడానికి ఒక దార్శనికతను నిర్దేశించింది. దీంతోపాటు జీరో పొల్యూషన్ యాక్షన్ ప్లాన్ 2030కి లక్ష్యాలను నిర్దేశించింది.

2005తో పోలిస్తే వాయు కాలుష్యం (అకాల మరణాలు) ఆరోగ్య ప్రభావాలను 55శాతం కంటే ఎక్కువ తగ్గించడం.

2005తో పోలిస్తే జీవవైవిధ్యానికి ముప్పుగా మారుతున్న ఈయూ పర్యావరణ వ్యవస్థల వాటాను 25శాతం తగ్గించడం. యూరోపియన్ ఎన్విరాన్‌మెంట్ ఏజెన్సీ అంచనా ప్రకారం 2023లో, పట్టణ జనాభాలో 94.4శాతం మంది ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ఆరోగ్య ఆధారిత మార్గదర్శక స్థాయి కంటే ఎక్కువ సూక్ష్మ కణాల సాంద్రతలకు గురయ్యారు. 27 ఇఏ సభ్య దేశాలలో 182,000 అకాల మరణాలు సంభవించాయి.

**ముప్పు గుప్పిట్లో హైదరాబాద్**

మరోవైపు ఢిల్లీ నగరం మాత్రమే కాదు హైదరాబాద్‌లో కూడా కాలుష్యం తీవ్రంగానే ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. హైదరాబాద్‌లో వాయుకాలుష్యంతో పాటు, నీటి కాలుష్యం, శబ్ద, ఆహార కాలుష్యం ఇలా పలు రకాలతో కూడిన కాలుష్య భూతం నగరవాసుల పాలిట ప్రమాదకరంగా పరిణమించి ప్రమాద ఘంటికలను మోగిస్తోందని, అప్రమత్తంగా ఉండాలని పర్యావరణ వేత్తలు, కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## రైల్వే ప్రయాణికులకు గుడ్‌న్యూస్.. ఇక 10 గంటల ముందే చార్ట్ ప్రిపరేషన్

భారతీయ రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రైలు బయల్దేరడానికి 10 గంటల ముందే రిజర్వేషన్ చార్ట్ ప్రిపేర్ చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన చార్ట్ ప్రిపరేషన్ షెడ్యూల్‌ను రైల్వేబోర్డు అప్‌డేట్ చేసింది. ప్రస్తుతం రైలు బయల్దేరడానికి నాలుగు గంటల ముందుగా రిజర్వేషన్ చార్ట్ ప్రిపేర్ చేస్తున్నారు. ఆఖరి నిమిషంలో చార్ట్ ప్రిపేర్ కావడం వల్ల టికెట్ కన్ఫార్మ్ కాని ప్రయాణికులు సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కాబట్టి 10 గంటల ముందే చార్ట్ ప్రిపేర్ చేయడం వల్ల ప్రయాణికులు.. ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేసుకోవడానికి వీలవుతుందని రైల్వే శాఖ భావించింది. ఈ నేపథ్యంలోనే 10 గంటల ముందే చార్ట్ ప్రిపేర్ చేయాలని నిర్ణయించింది. ఈ కొత్త టైమింగ్స్ ప్రకారం ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బయల్దేరే రైళ్లకు తొలి చార్ట్‌ను ముందు రోజు రాత్రి 8 గంటలకల్లా రూపొందించాల్సి ఉంటుంది. మధ్యాహ్నం 2.01 గంటల నుంచి రాత్రి 11.59 గంటల వరకు, అర్ధరాత్రి 12 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు బయల్దేరే రైళ్ల తొలి చార్టును కనీసం 10 గంటల ముందు రూపొందిం చనున్నారు. కొత్త షెడ్యూల్ ప్రకారం చార్టుల తయారీకి సత్వరమే చర్యలు తీసుకోవాలని అన్ని జోనల్ కార్యాలయాలకు లేఖ రాసింది.



## 16 మంది మావోల అరెస్ట్



ఆదిలాబాద్ జిల్లాలోని సిర్పూర్‌లో 16 మంది మావోయిస్టులను అరెస్ట్ చేయడంపై మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా స్పందించింది. ఈ అరెస్టులను ఖండిస్తూ కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో ఓ లేఖను విడుదల చేసింది. కకర్ బుడ్డి, బాబ్జీ పేట్ గ్రామాల సమీపంలో నిరాయుధంగా ఉన్న తమ వారిని అరెస్ట్ చేశారని లేఖలో ఆరోపించింది. ఈ చర్య తెలంగాణలో కొనసాగుతున్న ప్రజాస్వామ్య వాతావరణానికి ఎదురుదెబ్బ అని పేర్కొంది. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. ఫాసిస్టు బీజేపీ రూపొందించిన 'కగార్' యుద్ధానికి మద్దతు ఇవ్వొద్దని ఈ లేఖ ద్వారా మావోయిస్టు పార్టీ విజ్ఞప్తి చేసింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 'మావోయిస్టు ముక్త్', 'ప్రతిపక్ష ముక్త్' లక్ష్యాలతో ఈ యుద్ధాన్ని అమలు చేస్తోందని విమర్శించింది. 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్, ఏక్ చునావ్, ఏక్ పార్టీ' వంటి నినాదాలతో దేశంలోని ఇతర పార్టీలను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని ఆరోపించింది. ఎన్నికల కమిషన్, కోర్టులు, సీబీఐ, ఎన్ఐఏ వంటి రాజ్యాంగ సంస్థలను కేంద్రం తన ఆధీనంలో పెట్టుకుని పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని, దీనికి బీహార్ ఎన్నికలే తాజా ఉదాహరణ అని లేఖలో పేర్కొంది. బీజేపీ విధానాలు కేవలం కార్పొరేట్లకు మాత్రమే మేలు చేస్తున్నాయని విమర్శించింది. తెలంగాణలో ప్రశాంత వాతావరణం కొనసాగేలా చూసేందుకు ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు ఆందోళనలు చేపట్టాలని మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది.

## ఈశాన్య రాష్ట్రాలపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు



ఈశాన్య రాష్ట్రాలపై బంగ్లాదేశ్ నేషనల్ సిటిజన్ పార్టీ (ఎన్సీపీ) నాయకుడు హస్నాత్ అబ్దుల్లా ఇటీవల రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంపై భారత్ చర్యలకు ఉపక్రమించింది. బంగ్లాను అస్థిరపరిస్తే.. సెవన్ సిస్టర్స్ (7 ఈశాన్య రాష్ట్రాలు)ను ముక్కలు చేస్తామని బహిరంగంగా హెచ్చరించారు హస్నాత్ అబ్దుల్లా. ఈ విషయమై ఆ దేశ హైకమిషనర్ మహ్మద్ రియాజ్ హమీదుల్లాకు సమన్లు జారీ చేసింది. బంగ్లాదేశ్‌లోని భారత దౌత్య కార్యాలయానికి బెదిరింపులు వచ్చిన నేపథ్యంలో ఈ చర్యలకు ఉపక్రమించింది ఇండియా. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. బంగ్లాదేశ్‌లో భద్రతా పరిస్థితులు క్షీణించడంపై హమీదుల్లా ముందు ఆందోళన వ్యక్తం చేసింది భారత విదేశాంగ శాఖ. ఢాకాలోని ఇండియన్ ఎంబస్సీపై బంగ్లాదేశీయులు బెదిరింపులకు పాల్పడటాన్ని ప్రధానంగా ప్రస్తావించింది. బంగ్లాలో ఇటీవల జరిగిన సంఘటనలకు సంబంధించి ఇండియాపై తప్పుడు కథనాలను పూర్తిగా తిరస్కరిస్తున్నట్టు స్పష్టం చేసింది. ఈ ఘటనలకు సంబంధించి తాత్కాలిక ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు నిర్వహించకపోవడం లేదా సరైన ఆధారాలను పంచుకోకపోవడం దురదృష్టకరమని భావిస్తూ అసంతృప్తి వ్యక్తం చేసింది. భారత్.. బంగ్లాదేశ్‌తో సన్నిహిత, స్నేహపూర్వక సంబంధాలను కలిగి ఉందని ఈ సందర్భంగా పునరుద్ఘాటించింది. ఆ దేశంతో శాంతి, స్థిరత్వాన్ని కోరుకుంటు న్నామని.. శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని పిలుపునిచ్చినట్టు గుర్తు చేసింది. తాత్కాలిక ప్రభుత్వం తన దౌత్య బాధ్యతలకనుగుణంగా బంగ్లాలోని భారత మిషన్లు, పోస్టుల భద్రతను నిర్ధారించాలని ఆశిస్తున్నట్టు స్పష్టం చేసింది ఇండియా. కాగా.. గతేడాది విద్యార్థుల ఆందోళన తర్వాత బంగ్లాదేశ్ ప్రధానిగా ఉన్న షేక్ హసీనా రాజీనామా చేశారు. నాటి నుంచి భారత్- బంగ్లా సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. భారత్‌కు వ్యతిరేకంగా అక్కడి నాయకులు పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. అయితే.. వీటిని ఎప్పటికప్పుడు ఖండిస్తూనే ఉంది భారత్.

## బీజేపీ నేతలు మిస్సింగ్.. డ్రగ్స్ రవాణా కేసులో పోలీసులు అరెస్ట్



**కోల్‌కతా:** ఇద్దరు బీజేపీ నేతలు అదృశ్యమయ్యారు. దీంతో వారి కుటుంబాలు ఆందోళన చెందాయి. అయితే మాదకద్రవ్యాల అక్రమ రవాణా చేయడంతో ఆ ఇద్దరు బీజేపీ నేతలను అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌లోని కూచ్ బెహార్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. దిన్‌హటకు చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు కృష్ణ బర్మాన్, మరో నేత అశుతోష్ రే మంగళవారం అదృశ్యమయ్యారు. పాత రాజకీయ కేసులో విచారణ కోసం కోర్టుకు హాజరైన తర్వాత కనిపించలేదని కృష్ణ బర్మాన్ కుటుంబం తెలిపింది. పోలీసులు వారిని అక్రమంగా నిర్బంధించినట్లు ఆరోపించింది. దీంతో ఇది రాజకీయ వివాదానికి దారి తీసింది. కాగా, ఇద్దరు బీజేపీ నేతల మిస్సింగ్‌పై పోలీసులు బుధవారం క్లారిటీ ఇచ్చారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించి కృష్ణ బర్మాన్, అశుతోష్ రేను అరెస్టు చేసినట్లు తెలిపారు. బంగ్లాదేశ్ సరిహద్దు వైపు స్కూటర్‌పై వెళుతుండగా సీతాయ్‌లోని సాగర్‌డిఘి వంతెన ప్రాంతంలో తనిఖీ చేసినట్లు చెప్పారు. వారి వద్ద లభించిన 55 గ్రాముల యాబా మాత్రలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మరోవైపు బుధవారం ఉదయం కూచ్ బెహార్‌లోని ఎన్డీపీఎస్ కోర్టులో ఇద్దరు నిందితులను హాజరుపరిచినట్లు పోలీస్ అధికారి వెల్లడించారు. అయితే తమ పార్టీ నేతలను తప్పుడు కేసులో పోలీసులు ఇరికించారని బీజేపీ ఆరోపించింది.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137